# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 80 | హైదరాబాద్ | బుధవారం 10-09-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

మీకు లక్షల్లో మెజారిటీ ఎలా వస్తోంది?..
కేంద్రమంత్రిని ఆసక్తిగా అడిగిన లోకేశ్!

# 111 జీఓ పరిధిలో అక్రమ నిర్మాణాలు..

హైదరాబాద్ నగర అభివృద్ధి గత మూడు దశాబ్దాలుగా వేగంగా కొనసాగుతోంది. మెట్రో సిటీ స్థాయికి ఎదిగిన ఈ మహానగరానికి నీటి అవసరం రోజు రోజుకీ పెరుగుతోంది. ఈ అవసరాన్ని తీర్చే ప్రధాన వనరులే ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ సరస్సులు. వీటి రక్షణ కోసం 1996లో ప్రభుత్వం జీవో 111ను జారీ చేసింది. కానీ ప్రభుత్వాలు జారీ చేసిన జీఓనే.. స్వయంగా ఆ ప్రభుత్వంలో భాగస్వాములైన కొందరు కుహనా నాయకులు ఉల్లంఘిస్తున్నారు.. ఇష్టానుసారం 111 జీఓ పరిధిలోని భూములను ఆడగోలుగా ఆక్రమించి నిర్మాణాలు చేసుకున్నారు.. తమ విలాసాలకు విల్లాలు, ఫార్మ్ హౌస్ లు నిర్మించుకున్నారు.. మరి కొందరు రియల్టర్లు యథేచ్ఛగా 111 జీఓ పరిధిలోని భూములను ఆక్రమించి అపార్ట్మెంట్స్, విల్లాలు నిర్మించి అమ్మేసుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు.. ఇంతలా అవినీతి జరుగుతున్నా ప్రభుత్వం గానీ, ఉన్నతాధికారులు గానీ స్పందించడం లేదు.. కారణం ఈ అవినీతిలో ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారుల సన్నిహితులు, రాజకీయ నాయకులకు సన్నిహితంగా మెలిగే రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉండటమే.. ప్రజలేమైనా పర్వాలేదు.. భవిష్యత్ తరాలకు తాగునీరు, వ్యవసాయానికి సాగునీరు లేకపోయినా పర్వాలేదు.. తమ బొక్కసాలు నిండితే చాలు అనుకుంటున్నారు.. వీరి తరం గడచిపోతుంది.. మరి భవిష్యత్ తరాల మాటేమిటి..? ఏముంది అప్పుడు కూడా ఈ అవినీతిపరుల పరంపర వారి బిడ్డలా రూపంలో తిరిగి విజృంభిస్తుంది.. వీరి అక్రమాలు కొనసాగుతూనే ఉంటాయి.. ఈ వ్యవహారానికి ఇప్పుడే ఫుల్ స్టాప్ పెట్టకపోతే.. సామాన్యులు దాహార్తితో అలమటించి, రైతులు పంటలు లేక విలవిల్లాడిపోతారు.. మహానగరం స్మశానంలా మారిపోతుంది.. భవిష్యత్తులో పుస్తకాల్లో తప్ప మహానగర వైభవం మటుమాయమై పోతుంది.. ఇది అక్షర సత్యం..

భవిష్యత్ నీటి భద్రతకు
సంభవించనున్న పెను ముప్పు..




12లో

## నేటి భారతం

- మనిషికి నమ్మకం ఉండటం ఎంతో అవసరం..
- కానీ ఎవరినీ గుడ్డిగా నమ్మవద్దు. ముఖ్యంగా సొంతవారిని.
- "మనవాడు, మన ఊరివాడు, మన కులం" అని నమ్మితే మోసపోక తప్పదు.
- నమ్మకంతో బాటు పనితనం, సామర్థ్యం వంటబట్టించుకోవడం కూడా ఎంతో అవసరం..
- ఒక వేళ మనకా లక్షణాలు లేకపోతే అలాంటి లక్షణాలు వున్నవారికి బాధ్యతలు ఇస్తే మంచి జరుగుతుంది.
- అలాగే నీకు సాయం చేసిన వాడిని మర్చిపోకు !
- నిన్ను ప్రేమించినవారిని ద్వేషించకు !
- నిన్ను నమ్మిన వారిని ఎప్పుడూ మోసం చేయకు !
- నీ కష్టాలను తొలగించమని ప్రార్థించడం కన్నా.. వాటిని ఎదుర్కొనే శక్తినివ్వమని ప్రార్థించడం ఏంటో అవసరం..

**– బోయినపల్లి రమణా రావు,** సీనియర్ జర్నలిస్ట్..

## కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ



11లో

105 యంగ్ ఇండియా మోడల్ స్కూళ్లకు
ఆర్థిక సాయంపై వినతి


## ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ఘన విజయం



- సీపీ రాధాకృష్ణన్‌కు పోలైన 452 ఓట్లు
- జస్టిస్ సుదర్శన్ రెడ్డికి పోలైన 300 ఓట్లు
- 15 ఓట్లు చెల్లనివిగా ప్రకటించిన రిటర్నింగ్ అధికారి

దిల్లీ, హైదరాబాద్, సెప్టెంబర్ 09 ( భారత శక్తి ) : ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ గెలుపొందారు. మొత్తం 781 మంది సభ్యులకుగాను 768

తరువాయి 11లో



## ఏపీ అభివృద్ధి పరుగులు పెడుతోంది..

చంద్రబాబుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రశంసలు

11లో



11లో

## అల్లకల్లోలంగా నేపాల్...

భారతీయులను అప్రమత్తం చేసిన కేంద్రం

- నేపాల్‌లో హింసాత్మక నిరసనలు, ఘర్షణల్లో 19 మంది మృతి
- ఖాట్మండు సహా పలు నగరాల్లో కర్ఫ్యూ
- నేపాల్ లో ఉన్న భారతీయులు జాగ్రత్తగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం హెచ్చరిక

## తొలి త్రైమాసికంలో రెండంకెల వృద్ధి...



11లో




భారత శక్తి

## రోజుల్లో లక్ష కోట్లకు పైగా సంపద ఆవిరి

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకొని ఉంటాయి. ఏ స్టాక్ ఎప్పుడు పెరుగుతుందో ముందుగానే మనం ఊహించలేం. మార్కెట్లపై సరైన అవగాహన ఉన్నప్పుడే.. ఆయా కంపెనీల నుంచి వచ్చే ప్రకటనలు, ప్రణాళికలు, పెట్టుబడి వ్యూహాలు, ఫలితాలు ఇలా ఇవన్నీ స్టాక్ గమనంతో పాటు స్టాక్ మార్కెట్ గమనాన్ని కూడా నిర్దేశిస్తుంటాయి. అందుకే జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. ఇంకా సరైన సమయంలో సరైన కంపెనీ స్టాక్‌ను నిపుణుల సలహాతో ఎంచుకోవాలి. ఇదే సమయంలో షార్ట్ టర్మ్‌లోనే లాభాలు రావాలని కూర్చోవద్దు. ఓపిక ఉండాలి. దీర్ఘ కాలంలోనే బంపర్ రిటర్న్స్ వస్తుంటాయని నిపుణులు ఎప్పుడూ చెబుతుంటారు.అయితే గత కొంత కాలంగా దేశీయ స్టాక్ మార్కెట్లు నేలచూపులు చూస్తున్నాయి. గత వారం షేర్ మార్కెట్లో గణనీయమైన హెచ్చుతగ్గులు నమోదయ్యాయి. ముఖ్యంగా సెన్సెక్స్ టాప్–10 జాబితాలోని పలు కంపెనీల పెట్టుబడిదారులు నష్టాలను చవిచూశారు. మార్కెట్ విలువ పరంగా దేశంలోనే అతిపెద్ద సంస్థ అయిన ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు టాటా గ్రూప్‌కు చెందిన టీసీఎస్, ఎల్ఐసీ వంటి సంస్థలకు గత వారం నిరాశజనకంగా ముగిసింది. అయితే ఈ పతనంలో రిలయన్స్ పెట్టుబడిదారులు అతిపెద్ద షాక్‌ను చవిచూశారు. కేవలం 5 పని దినాల్లో వారి సంపద రూ.లక్ష కోట్లకు పైగా తగ్గింది.వరుస సెషన్లలో పతనం దిశగానే సాగుతున్నాయి. ఇన్వెస్టర్లు తీవ్ర ఒత్తిడితో ఆయా షేర్లను విక్రయిస్తుండటం కారణంగా స్టాక్స్ పడిపోతుండటంతో పాటు వారు కూడా నష్టాల్ని ఎదుర్కొంటున్నారు. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు, కార్పొరేట్ కంపెనీల బలహీనమైన త్రైమాసిక ఫలితాలకు తోడు.. యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ కఠిన నిర్ణయాలు ఇందుకు కారణంగా నిలుస్తున్నాయి.ఇక గత వారం కూడా సూచీలు భారీగానే పడిపోయాయి. బీఎస్ఈ బెంచ్‌మార్క్ ఇండెక్స్ బొంబాయి స్టాక్ ఎక్స్చేంజి సూచీ సెన్సెక్స్ 294.64 పాయింట్లు పడిపోయింది. ఈ క్రమంలోనే చాలా స్టాక్స్ పడిపోగా.. దేశంలో మార్కెట్ విలువ పరంగా టాప్–10 కంపెనీల్లో 6 కంపెనీల విలువనే ఏకంగా రూ. 2.22 లక్షల కోట్లు తగ్గడం గమనార్హం. ఇందులో దిగ్గజ పారిశ్రామిక వేత్త ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ టాప్‌లో ఉంది. రిలయన్స్ సంస్థ ఎం– క్యాప్ 5 రోజుల వ్యవధిలో ఏకంగా రూ. 1.14 లక్షల కోట్లు తగ్గగా ఇప్పుడు అది రూ. 18.83 లక్షల కోట్లకు దిగొచ్చింది.ఆ తర్వాత ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ ఉంది. ఇన్ఫీ మార్కెట్ విలువ గత వారం రూ. 29 వేల కోట్లకుపైగా తగ్గగా ప్రస్తుతం ఎం – క్యాప్ రూ. 6.29 లక్షల కోట్లుగా ఉంది. ఇదే సమయంలో ఎల్ఐసీ మార్కెట్ విలువ రూ. రూ. 23 వేల కోట్ల పతనంతో రూ. 5.60 లక్షల కోట్లకు దిగొచ్చింది. ఇక టీసీఎస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 20 వేల కోట్లు తగ్గి రూ. 11.34 లక్షల కోట్లకు పడిపోయింది. బజాజ్ ఫినాన్స్ ఎం క్యాప్ రూ. 17 వేల కోట్లు తగ్గింది. హిందుస్థాన్ యూనిలివర్ మార్కెట్ విలువ రూ. 17 వేల కోట్లు పడిపోయింది.వీటికి భిన్నంగా మరో 4 కంపెనీల విలువ అమాంతం పెరిగింది. ఫలితాల్లో ఈ కంపెనీలు అంచనాల్ని మించగా.. షేర్లు పెరిగాయి. ఇందులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ టాప్‌లో నిలిచింది. ఈ బ్యాంక్ మార్కెట్ విలువ రూ. 37 వేల కోట్లు పెరిగి రూ. 15.38 లక్షల కోట్లకు ఎగబాకింది. ఐసీఐసీఐ బ్యాంకు ఎం క్యాప్ రూ. 35 వేల కోట్లు పెరగడంతో రూ. 10.53 లక్షల కోట్లుగా ఉంది. భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ రూ. 20 వేల కోట్లు పెరిగి రూ. 11.04 లక్షల కోట్ల వద్ద ఉంది. అంతకుముందు వారం ఇది మార్కెట్ విలువలో టీసీఎస్‌ను మించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మళ్లీ తగ్గింది. ఎస్బీఐ ఎం – క్యాప్ రూ. 9 వేల కోట్లు పెరిగి రూ. 7.44 లక్షల కోట్లకు చేరింది.స్టాక్ మార్కెట్ లో వచ్చిన పతనం కారణంగా బే స్టాక్ ఎక్స్ఛేంజ్‌ని 30 షేర్ల సెన్సెక్స్ 294.64 పాయింట్ల నష్టాన్ని నమోదు చేసింది. ఈ పరిణామంలో సెన్సెక్స్ టాప్–10లో 6 కంపెనీల మార్కెట్ క్యాప్ సంయుక్తంగా రూ.2.22 లక్షల కోట్ల భారీ పతనాన్ని చవిచూసింది. ఈ జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎల్ఐసీ వంటి దిగ్గజ సంస్థలు ఉన్నాయి. అయితే ఈ పతనంలో కూడా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ సహా నాలుగు సెన్సెక్స్ కంపెనీల మార్కెట్ విలువ పెరిగి పెట్టుబడిదారులకు ఊరటనిచ్చింది.గత కొన్ని వారాలుగా దేశంలోనే అత్యంత ధనవంతుడైన ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ మార్కెట్ క్యాప్ తగ్గినప్పటికీ ఇది ఇప్పటికీ దేశంలో అత్యంత విలువైన కంపనీల జాబితాలో నంబర్ 1 స్థానంలో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. దీని తర్వాత వరుసగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐ, ఇన్ఫోసిస్ , బజాజ్ ఫైనాన్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎల్ఐసీ ఉన్నాయి. మార్కెట్ ఒడిదుడుకులు ఉన్నప్పటికీ రిలయన్స్ తన స్థానాన్ని నిలబెట్టుకోవడం విశేషం.

# ఓవర్ టూ ఢిల్లీయేనా...

విజయవాడ, సెప్టెంబర్ 8

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. లిక్కర్ స్కామ్ కేసులో వరసగా అరెస్ట్ లు జరుగుతుండటంతో పాటు తనకు అత్యంత ఆప్తులైన వారిని జైల్లోకి పంపుతుండటంతో వైఎస్ జగన్ ముఖ్యమైన నిర్ణయం వైపుగా అడుగులు వేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇప్పటికే లిక్కర్ స్కామ్ కేసులో పన్నెండు మంది అరెస్టయ్యారు. అందులో తన కార్యాలయంలో పనిచేసిన ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డితో పాటు తనకు అత్యంత ఆప్తులైన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్ట్ కావడంతో మనస్తాపం చెందిన వైఎస్ జగన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సోషల్ మీడియాలో పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. అందులో ఒక ప్రచారానికి వస్తే త్వరలోనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఢిల్లీకి వెళ్లి బీజేపీ నేతలను కలసి ఏపీ లిక్కర్ స్కామ్ విషయంపై చర్చిస్తారంటున్నారు. 2014 నుంచి 2019 వరకూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఎక్సైజ్ శాఖకు మద్యం అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని, తాను అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో 2019 నుంచి 2024 వరకూ వచ్చిన ఎక్సైజ్ ఆదాయంపై బీజేపీ నేతలకు వివరించే అవకాశముందని ప్రచారం జరుగుతుంది. అయితే జగన్ ఇప్పట్లో ఢిల్లీ వెళ్లే అవకాశాలు లేవని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఢిల్లీకి వెళ్లి ఎవరినీ కలిసే ఉద్దేశ్యం లేదని, మద్యం కేసును న్యాయపరంగానే ఎదుర్కొనేందుకు జగన్ సిద్ధమవుతున్నారని అంటున్నారు. దీంతో పాటు మరో ముఖ్యమైన ప్రచారం జరుగుతుంది. వైసీపీ నేతలపై అక్రమ కేసులు, అరెస్ట్ లకు నిరసనగా వైసీపీ శాసనసభ్యులందరితోనూ రాజీనామా చేయిస్తారన్న ప్రచారం జరుగుతుంది. తనతో పాటు గత ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలందరి చేత రాజీనామా చేయించాలన్న నిర్ణయానికి వచ్చినట్లు సోషల్ మీడియాలో పెద్దయెత్తున కథనాలు వెలువడుతున్నాయి. అయితే గతంలో మాదిరిగా ఇప్పుడు రాజీనామాల అస్త్రాల ప్రయోగం జగన్ చేయరన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. గెలిచిన నియోజకవర్గాల నుంచి రాజీనామాలు చేసి తిరిగి ఉప ఎన్నికల్లో పోటీ చేయడం అంటే ప్రజలలో ఒకరకమైన వ్యతిరేక భావన ఏర్పడుతుందని భావిస్తున్నారు. నాడు సెంటిమెంట్ కారణంగా రాజీనామాలు చేస్తే వర్కవుట్ అయ్యాయి. కానీ ఇప్పుడు అరెస్ట్ లను సాకుగా చూపి రాజీనామాలు చేయించినంత మాత్రాన జరిగేదేమీ లేదన్న విషయం జగన్ కు తెలియంది కాదు. ఉప ఎన్నికల్లో ఈసారి గెలుపు కూడా కష్టమే అవుతుంది. సెంటిమెంట్ లేకపోగా, సానుభూతి రాకపోగా అసలుకే ఎసరు వచ్చి ప్రస్తుతం పార్టీకి ఉన్న హైప్ కూడా పోతుందని ఆయన గట్టిగా భావిస్తున్నారు. అందుకే కేసులకు భయపడి ఢిల్లీ పెద్దల వద్దకు వెళ్లి సాగిలపడటం, అలాగే ఉన్న ఎమ్మెల్యేల చేత రాజీనామాలు చేయించడం జరగదని వైసీపీకి చెందిన సీనియర్ నేత ఒకరు చెప్పారు. అవన్నీ ప్రచారం మాత్రమేనని, వాస్తవానికి దూరంగా అటువంటి విశ్లేషణలు ఉన్నాయని చెబుతున్నారు.

# 250 కుటుంబాలను చంద్రబాబు దత్తత

తిరుపతి సెప్టెంబర్ 8

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పీ4 కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలోని 250 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు బ్యాడ్జిని అధికారులు చంద్రబాబుకు అందించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి పీ4 కార్యక్రమంపై మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, అధికారులతో ముఖ్యమంత్రి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోస్టర్ ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.”కుప్పం నియోజకవర్గానికి చెందిన 250 కుటుంబాలను దత్తత తీసుకుంటున్నాను. ఆ కుటుంబాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసే బాధ్యత నాది. మార్గదర్శులు ముందుకు రావాలని పిలుపు ఇస్తున్న నేను.. చెప్పడమే కాదు.. ఆచరించి చూపాలని 250 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నా. ఈ కుటుంబాల అభ్యున్నతి కోసం ప్రణాళిక రూపొందిస్తాను. ఐయామ్ ఏ మార్గదర్శి. సమాజంలో పేద–ధనికుల మధ్య అంతరాలు తగ్గించే ఇలాంటి కార్యక్రమాన్ని ఎక్కడా చేపట్టలేదు. గతంలో జన్మభూమి స్ఫూర్తితో గ్రామాలను అభివృద్ధి చేస్తే.. ఇప్పుడు పేదలను ఆదుకునేందుకు పీ4 అమలుకు ప్రణాళికలు చేపట్టాం. ఈ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచేలా రూపొందించాం. పేదలకు చేయూతనిచ్చే పీ4 కార్యక్రమం నిరంతరం కొనసాగుతుంది” అని ముఖ్యమంత్రి చెప్పారు.పీ4లో భాగంగా బంగారు కుటుంబాలుగా నమోదైన వారు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలి. ఇవాళ్టి బంగారు కుటుంబాలు.. రేపటి మార్గదర్శులుగా ఎదగాలన్నదే నా ఆలోచన. సాయం పొందిన సాయం చేసేందుకు ముందుకు వస్తారు. ఈ కార్యక్రమం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలి. దీన్ని విజయవంతంగా అమలు చేయగలిగితే ఈ కార్యక్రమం శాశత్వంగా ఉండిపోతుంది. చాలా మందికి మంచి ఆలోచనలు ఉంటాయి.. ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే లక్ష్యాలున్న వారు పేదరికం కారణంగా వెనుకబడిపోతున్నారు. ఇలాంటి వారికి చేయూతనిస్తే అద్భుతాలు సృష్టిస్తారు. ఎన్నో కార్యక్రమాలు చేసిన నాకు.. పీ4 కార్యక్రమం మనస్సుకు చాలా దగ్గరగా ఉంది” అని చంద్రబాబు అన్నారు.“బంగారు కుటుంబాలుగా నమోదైన వారి అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తాం. బంగారు కుటుంబాలు అభివృద్ధికి ఏం చేస్తే బాగుంటుంది.. వాళ్లు చేయగలిగే పనులేంటీ..? అనే అంశాలపై ఓ పది పాయింట్లతో కూడిన సర్వే చేపడుతున్నాం. వీరి అభివృద్ధికి ఏం చేస్తున్నామనే విషయాన్ని వివరించేందుకు ప్రతి బంగారు కుటుంబానికి విజన్



డాక్యుమెంట్ తయారు చేస్తున్నాం. స్వల్ప, మధ్య, దీర్ఘ కాలిక ప్రణాళికల ద్వారా వారి అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తాం. బంగారు కుటుంబాల స్థితిగతులపై ప్రతి మూడు నెలలకోసారి సమీక్ష చేపట్టాలి.” అని సీఎం అన్నారు. ప్రతిష్టాత్మక “పీ4” పథకంపై ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు నేడు సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్న ఈ కార్యక్రమంలో “పీ4” పథకం లోగోను ఆవిష్కరించారు.?

“ఆగస్టు 15 నుంచి పీ4 మొదటి విడత ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నా దగ్గర నుంచి ఎమ్మెల్యే వరకు పని చేయాలి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి క్షేత్ర స్థాయి ఉద్యోగి వరకు కృషి చేయాలి. బంగారు కుటుంబాలను.. మార్గదర్శులను గుర్తించే విషయంలో కొన్ని జిల్లాలు ఇంకా మెరుగ్గా పని చేయాలి. వచ్చే 15 రోజుల్లో దీని కోసం గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో కసరత్తు చేయాలి. ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలి.” అని సీఎం సూచించారు. జూమ్ కాన్ఫరెన్సు ద్వారా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. సీఎం స్ఫూర్తితో తాను కూడా ఐదు పేద కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ ప్రకటించారు. షాజహాన్ ను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. దేశంలోనే తొలిసారిగా చేపట్టిన ఈ తరహా కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేసేందుకు సహకరిస్తామని ప్రజా ప్రతినిధులు సీఎంకు హామీనిచ్చారు

# మారనున్న ఓర్వకల్లు

కర్నూలు, సెప్టెంబర్ 8

కర్నూలు జిల్లాలోని ఓర్వకర్లు సమీపంలో ఉన్న నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్ టెస్ట్ రేంజ్‌లో లాంచ్డ్ ప్రెసిషన్ గైడెడ్ మిస్సైల్ క్క ఫ్లైట్ ట్రయల్స్‌ను డీఆర్‌డీఏ విజయవంతంగా నిర్వహించింది. భారత రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన మైలురాయిగా భావిస్తున్నారు. డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో ఈ విజయాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోషల్ మీడియా లో ప్రకటించారు. కర్నూలుజిల్లా ఓర్వకల్లు మండలం, పాలకొలను సమీపంలో నేషనల్ ఓపెన్ ఏరియా రేంజ్ ఉంది. ఔాంఖీ అనేది అత్యాధునిక రక్షణ సాంకేతికతలను పరీక్షించడానికి డీఆర్ డీఓ ఉపయోగించే కీలక సౌకర్యం, ఇది గతంలో హై–ఎనర్జీ లేజర్ ఆధారిత డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్స్ పరీక్షలకు కూడా ఉపయోగించబడింది. జఒఖఉఓ–ఎ3 ఫ్లైట్ ట్రయల్స్ విజయవంతంగా పూర్తయ్యాయి, ఇది భారత్ కు చెందిన డ్రోన్–లాంచ్డ్ ప్రెసిషన్ స్ట్రైక్ సామర్థ్యాలలో ఎంతో కీలకమైనది. సిరీస్‌లో మూడు తెలిసిన వేరియంట్‌లు ఉన్నాయి. డీఆర్ డీఓ టెర్మినల్ బాలిస్టిక్స్ రిసెర్చ్ లాబొరేటరీ ద్వారా అభివృద్ధి చేసిన ప్రొడక్షన్ వేరియంట్ బహుళ వార్‌హెడ్ కాన్ఫిగరేషన్‌లతో ఉంటుంది. ఎక్స్‌టెండెడ్ రేంజ్ వేరియంట్, ఇమేజింగ్ ఇన్‌ఫ్రారెడ్ సీకర్ , డ్యూయల్–థ్రస్ట్ ప్రొపల్షన్ సిస్టమ్‌లతో మెరుగైన ఫీచర్లను కలిగి ఉంది. ఈ వేరియంట్ ను 2025లో ప్రదర్శించారు. ఈ మిస్సైల్ సిస్టమ్ తేలికైనది, ఖచ్చితమైనది, వివిధ ఏరియల్ ప్లాట్‌ఫామ్‌లతో అనుకూలంగా ఉంటుంది, ఇది ఆధునిక యుద్ధాలలో వ్యూహాత్మక సౌలభ్యాన్ని అందిస్తుంది. అదానీ గ్రూప్ , భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ప్రాజెక్ట్‌లో కీలక తయారీ భాగస్వాములు. ఈ పరీక్షలు భారత పరిశ్రమ, ముఖ్యంగా ఓూఇబ స్టార్టప్‌ల సామర్థ్యాన్ని సూచిస్తాయని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. , ఇవి కీలక రక్షణ సాంకేతికతలను గ్రహించి, ఉత్పత్తి చేయడంలో సఫలమవుతున్నాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ సహకారాన్ని ప్రశంసించారు. ఇది ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో ముఖ్యమైన అడుగుగా పేర్కొన్నారు .ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా అనంతపురం, కర్నూలు జిల్లాల్లో రక్షణ పరికరాల ఉత్పత్తికి కేంద్ర స్థానంగా మార్చాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ఇలాంటి ప్రయోగాలు ఏపీలో జరగడం వల్ల మరింత పేరు వచ్చే అవకాశం ఉంది.

## శ్రీవారిని దర్శించుకున్న విఐపిలు

తిరుమల సెప్టెంబర్ 8

తిరుమల శ్రీవారిని పలువురు రాజకీయ సినీ ప్రముఖులు దర్శించుకున్నారు .. ఈరోజు ఉదయం నైవేద్య విరామ సమయంలో తెలంగాణ ప్రభుత్వ విప్పు శ్రీధర్ ,తెలంగాణ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి వేరువేరుగా కుటుంబ సమేతంగాదర్శించుకున్నారు.. అలాగే కన్నడ ప్రముఖ హీరో శివరాజ్ కుమార్, తెలుగు దర్శకుడు గోపీచంద్ మలినేని తదితరులు స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.. ప్రముఖులకు ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేసి అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు..

## పెద్దపులి దాడిలో లేగ దూడ మృతి

మంచిర్యాల సెప్టెంబర్ 8

కాసిపేట్ మండలం ధర్మరావుపేట సెక్షన్ పరిధిలో వెంకటాపూర్ బీట్ రొట్టెపల్లి అటవీ శివారు ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం మేతకు వెళ్లిన పశువులపై పులి దాడి చేసి చంపింది. అటవీ క్షేత్రాధికారి బెల్లంపల్లి పూర్ణచందర్ వివరాల ప్రకారం గోండు గూడ కి చెందిన కురిసేంగ అచ్యుత్ రావు యొక్క లేగదూడను పెద్దపులి చంపివేసిందని అయన తెలిపారు. బాధితుడికి నష్టపరిహారం త్వరలోనే చెల్లిస్తామని అటవీ ప్రాంతంలోకి పశువుల కాపరులు సమీప పంట చేనులో పనికి వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెద్దపులికి సంబంధించిన ఆనవాళ్లు కనిపించినచో అటవీ శాఖ వారికి వెంటనే ఇన్ఫర్మేషన్ ఇవ్వాలని కోరారు. సమీప గ్రామాలలో దప్పు చాటింపును చేయించడం జరిగిందని తెలిపారు..

## రాష్ట్రాభివృద్ధిలో తెలుగువారంతా భాగస్వాములు కావాలి

### తెలుగు డయాస్పోరా వాలంటీర్లతో మంత్రి నారా లోకేష్

సింగపూర్: సెప్టెంబర్ 8

గత అయిదేళ్ల విధ్వంస పాలన చూశాక రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు విదేశాల్లో ఉన్న తెలుగువారంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు, అందుకే ఏ దేశం వెళ్లినా ముఖ్యమంత్రి గారు, నేను తొలుత తెలుగువాళ్లను కలవాలని నిర్ణయించుకున్నామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. తెలుగు డయాస్పోరా సమావేశాన్ని విజయవంతం చేసిన వాలంటీర్లతో లోకేష్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... సింగపూర్ అభివృద్ధి చెందిన తీరును మనమంతా స్ఫూర్తిగా తీసుకోవాలి. ఇక్కడ ఉన్న తెలుగు వారంతా రాష్ట్రాభివృద్ధి లో భాగస్వాములు కావాలి. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడానికి కృషి చేయాలి. డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటు కావడం వల్ల రాష్ట్రం ఊపిరి తీసుకుంటోంది. ప్రధాని మోడీజీ త్వరలోనే సింగపూర్ లో పర్యటిస్తారు. ఆ పర్యటనలో పెద్ద ఎత్తున తెలుగువారు పాల్గొని విజయవంతం చేయండి. రాష్ట్రానికి సహకరిస్తున్న ప్రధానికి కృతజ్ఞతలు తెలపాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు. తెలుగు డయాస్పోరా సమావేశాన్ని విజయవంతం చేసిన వాలంటీర్లను అభినందించిన లోకేష్ వారితో ఫోటోలు దిగారు.

## విడాకుల వలన విలువలు తగ్గించుకుంటున్నారు

హైదరాబాద్ఓపిక,అడ్జెస్ట్‌మెంట్ వల్లనే బంధాలు నిలబడతాయి. ఈ జనరేషన్ వారికి అంత ఓపిక లేదని అందాల ముద్దుగుమ్మ అనసూయ పేర్కొంది.అయితే ఈ మధ్య విడాకుల వలన విలువలు తగ్గించుకుంటున్నారన్నారు. ఇక మన అన్నతో మనకి విడాకులు ఉండవు. అమ్మతో విడాకులు ఉండవు.. అక్కతో ఉండవు. కానీ కేవలం భార్యతోనే ఉంటుంది. పెళ్లి అనే దానికి మన భారతీయ సాంప్రదాయంలో ఇచ్చేటంత గౌరవం మరెక్కడ కూడా ఇవ్వరన్నారు.యాంకర్‌గా, నటిగా అశేష ప్రేక్షకాదరణ దక్కించుకుంది. ఇక సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే అనసూయ గ్లామరస్ ఫోటోలు షేర్ చేస్తూ కుర్రాళ్లకి కంటిపై కునుకు లేకుండా చేస్తుంటుంది. ఇక ఇంటర్వ్యూలలో ఆమె ఏ విషయంపైనైన చాలా ఓపెన్‌గా మాట్లాడుతుంది. తాజాగా తన భర్తకి సంబంధించిన కొన్ని విషయాలు చెప్పుకొచ్చి అందరిని ఆశ్చర్యపరిచింది మా ఆయన పర్‌ఫెక్ట్ అని అందరు అనుకుంటారు. కాని ఆయన కూడా అందరి మగాళ్లలాగే . మా ఇద్దరి మధ్య కూడా కొన్ని సందర్భాలలో గొడవలు అయ్యాయి. నేను వెళ్లి కొంతమందిని కలవడం. కొంతమందితో సినిమాలు చేయడం ఆయనకి నచ్చలేదు. ఆ సమయంలో చాలా ఇబ్బందులు పడుతూ గొడవలు పడ్డ సందర్భాలు కూడా ఉన్నాయి. నేను హీరోలతో.. పెద్ద పెద్ద స్టార్‌లతో.. గుడ్ లుకింగ్ పీపుల్స్‌తో ఇంట్రాక్ట్ అయినప్పుడు చాలా ఇబ్బంది పడేవారు. అబ్బాయిల మనస్తత్వమే అది. నన్ను ఫ్లర్ట్ చేయడం కావచ్చు.. కాంప్లిమెంట్ కావచ్చు.. ఆయన తీసుకోలేరు. సాధారణంగా అందరు కూడా అనసూయ భర్త అన్నీ చేయనిస్తాడు, అన్నింటికి ఒప్పుకుంటాడు అని అందరు అనుకోవచ్చు. వాడు చేతకాని వాడు అని కూడా అంటారు.

అదృష్టం ఏంటంటే మా ఆయనకి తెలుగు రాదు. సోషల్ మీడియాలో కామెంట్స్ పట్టించుకోడు. ఆయనలా ఉండాలని ఎన్నోసార్లు అనుకుంటాను.నేను మా ఆయనతో ఉన్నట్టు వేరే వాళ్లతో ఉండలేను.

## నన్ను దోచుకుందువటే వన్నెల దొరసానీ

–నేడు మన తెలంగాణ ముద్దు బిడ్డ, జ్ఞాన పీఠ అవార్డు గ్రహిత డాక్టర్ సి నారాయణ రెడ్డి జయంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

తెలుగు చలన చిత్ర సీమలో డాక్టర్ సి.నారాయణరెడ్డి సాహిత్యం సహజత్వానికి ప్రయోగాలకు పుట్టినిల్లు. అంతకు మునుపు ఎక్కువగా వాడని పదాలను సాహితీ స్రవంతిలోకి తీసుకు వచ్చి, వాటితో సాహిత్యానికి ఎంతో వన్నె తెచ్చారు సినారె. దొరసాని, నెరజాణ వంటి పదాలు అప్పట్లో తెలుగు సినీ సాహిత్యంలో చాలా అరుదుగా ఉపయోగించే వారు. నారాయణ రెడ్డి అటువంటి పదాలను తన సాహిత్యంలో పొందు పరచి తెలుగు భాష అందాన్ని పెంచారు. సినారెగా సుప్రసిద్ధుడైన డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డిది ఒకప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇప్పుడు రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని హనుమాజీపేట. బుచ్చమ్మ, మల్లారెడ్డి తల్లిదండ్రులు. 1931 జూలై 29న జన్మించారు. ప్రాథమిక విద్యను స్వగ్రామంతో పాటు సిరిసిల్ల,కరీంనగర్‌లో పూర్తి చేశారు. ఉన్నత విద్యాభ్యాసానికి హైదరాబాద్ వెళ్లారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ పూర్తి చేసి అక్కడే అధ్యాపకుడిగా పనిచేశారు. కళాశాల విద్యార్థిగా ఉన్నపుడే శోభ పత్రికకు సంపాదకుడిగా వ్యవహరించారు. పసి వయసులో విన్న హరికథలు, జానపదాలు, జంగం కథల స్ఫూర్తితో ఉన్నత స్థాయి సాహితీవేత్తగా ప్రఖ్యాతి చెందారు. 1953లో నవ్వనిపువ్వుతో ప్రారంభమైన సినారె సాహిత్య ప్రస్థానం అలుపెరగక సాగిపోయింది. పద్య కవితలు, గేయకావ్యాలు, వచన కవితలు, గద్య కృతులు, సంగీత నృత్య రూపకాలు, ముక్తకాలు, బుర్ర కథలు, గజళ్లు, వ్యాసాలు విమర్శలు, అనువాదాలు వంటి అనేక సాహితీ ప్రక్రియల్లో అనితర సాధ్యమైన ప్రతిభను చాటుకున్నారు.నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, మట్టి మనిషి ఆకాశం, విశ్వంభర, మంటలు మానవుడు, మధ్య తరగతి మందహాసం, నడక నా తల్లి, తెలుగు గజళ్లు, భూమిక, ముఖాముఖి, ఆరోహణ, అక్షర గవాక్షాలు, ఇంటి పేరు చైతన్యం తదితర రచనలు చేశారు. సినారె రాసిన రామప్ప సంగీత నృత్య రూపకం అన్ని భారతీయ భాషల్లోకి అనువదించబడింది. దీంతో పాటు ఆయన గ్రంథాలు ఇంగ్లిష్, ఫ్రెంచ్ సంస్కృతం, మలయాళం, హిందీ, ఉర్దూ కన్నడ భాషల్లోకి అనువాదమయ్యాయి. అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్, రష్యా, జపాన్, కెనడా, ఇటలీ, డెన్మార్క్, థాయ్‌లాండ్, సింగపూర్, మలేషియా వంటి దేశాల్లో సందర్శించారు. అంతర్జాతీయ కవి సమ్మేళనాల్లో భారతీయ ప్రతినిధిగా హాజరై తెలుగు సాహిత్య వైభవాన్ని విశ్వయవనికపై చాటారు. ఆధునిక ఆంధ్ర కవిత్వం, సంప్రదాయాలు, ప్రయోగాలు పేరిట సినారె పరిశోధన ఆయను పీహెచ్‌డీ ప్రామాణిక విమర్శన గ్రంథంగా మిగిలింది.

అత్యున్నత పురస్కారాలు..

కేంద్ర సాహిత్య అకాడమి, సోవియట్ ల్యాండ్ నెహ్రు పురస్కారంతో పాటు విశ్వంభర దీర్ఘ కావ్యానికి 1988లో ప్రతిష్టాత్మక జ్ఞానపీఠ పురస్కారం వరించింది.భారతీయ భాషా పరిషత్, రాజలక్ష్మి, అసాన్, ఉమ్మడి రాష్ట్రంలో సాంస్కృతిక వ్యవహారాలు సలహాదారునిగా, సాంస్కృతిక మండలి, అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా, సార్వత్రిక విశ్వవిద్యాలయం, తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతిగా వ్యవహరించారు. తెలుగు విశ్వవిద్యాలయం నుంచి విశిష్ట సాహిత్య పురస్కారం అందుకున్నారు. డాక్టర్ బోయి భీమన్న జీవన సాఫల్య పురస్కారం స్వీకరించారు. రాజ్యసభ సభ్యులుగా ఉన్నతమైన బాధ్యతలను నిర్వహించారు. భారత ప్రభుత్వం సినారె సేవలను గుర్తించి పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలిచ్చింది. పలు విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్‌తో గౌరవించాయి. సినిమా పాటలు కైకట్టి..వందలాది సినిమాలకు వేల సంఖ్యలో సినీ గీతాలు రాశారు. స్వర్గీయ ఎన్టీఆర్ కథానాయకుడిగా విడుదలైన గులేబకావళి కథ సినిమాలో నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని అనే పాటతో సినీ రంగ ప్రవేశం చేసిన సినారె ఆపైన సుమారు మూడు వేలకు పైగా పాటలు రచించి సినిమా ప్రేక్షకులకు సైతం చేరువయ్యారు. చిలిపి కనుల తీయని చెలికాడా..అనగనగా ఒక రాజు అనగనగా ఒక రాణి, నీ ధర్మం నీ సంఘం నీ దేశం నువు మరవొద్దు, జాతిని నీతిని నిలిపిన మహనీయులనే మరవొద్దు. అమ్మను మించి దైవం ఉన్నదా ఆత్మను మించి అద్దమున్నదా.. కంటేనే అమ్మ అని అంటే ఎలా.. ఓ ముత్యాల కొమ్మా...ఓ రాములమ్మా.. తదితర తెలుగు సినిమా పాటలు సినారె ప్రతిభకు తార్కాణాలు. సినిమా పాటల్లో సైతం సాహిత్య విలువలకు పట్టం కట్టి తెలుగు సినీ సాహిత్యంపై చెరగని ముద్ర వేశారు. 2017 జూన్ 12 న హైదరాబాద్ కేర్ ఆస్పత్రిలో అనారోగ్యంతో కన్ను మూశారు.

## రాయచోటి సబ్ రిజిస్ట్రార్ పై నాన్ బెయిలబుల్ కేసు

అన్నమయ్య రాయచోటి సబ్ రిజిస్ట్రార్ షేక్ సత్తార్ పై నాన్ బెయిలెబుల్ కేసు నమోదు చేసినట్లు నంద్యాల ఒకటో పట్టణ సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. సత్తార్ నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో పని చేసేటప్పుడు రూ. 2 కోట్ల విలువైన స్థలాన్ని, బాలాజీ కాంప్లెక్స్ ఉన్న పద్దెనిమిది సెంట్ల వివాదాస్పద స్థలాన్ని జైలాల్బి కి రిజిస్ట్రేషన్ చేశారు. ఇందుకు గాను ఆయన భారీగా ముడుపులు దండుకున్నట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## పోలీసుల విస్తృత తనిఖీలు

ములుగుమావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో కన్నాయిగూడెం మండలంలో ఎస్సై ఈ. వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఛత్తీస్గఢ్ నుంచి కన్నాయిగూడెం ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులను విచారించారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

# 2026 నాటికి స్టీల్ ప్లాంట్ పూర్తి

కడప, సెప్టెంబర్ 8

వైఎస్సార్ కడప జిల్లా వాసులకు గుడ్ న్యూస్.. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న తరుణం సమీపిస్తోంది. కడప జిల్లాలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు విషయం చాలా రోజుల నుంచి నడుస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా సున్నపురాళ్లపల్లెలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుపై జేఎస్‌డబ్ల్యూ ప్రతిపాదనలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం చేసిన ప్రతిపాదనలను ఆమోదిస్తూ.. ఏపీ పారిశ్రామికాభివృద్ధి పాలసీ ప్రకారం ప్రోత్సాహకాలు ఇవ్వాలని, చర్యలు తీసుకోవాలని విద్యుత్, పరిశ్రమలు, జలవనరులు, రెవెన్యూ, ఆర్థిక శాఖలను ప్రభుత్వం ఆదేశించింది. రూ.4,500 కోట్లతో సున్నపురాళ్లపల్లె వద్ద స్టీల్‌ప్లాంట్ తొలి దశ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. రూ.11,850 కోట్లతో స్టీల్ ప్లాంట్ రెండో దశ నిర్మాణ పనులు చేపట్టనున్నారు.మరోవైపు సున్నపురాళ్లపల్లె వద్ద స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం జేఎస్‌డబ్ల్యూ సంస్థకు ఏపీ ప్రభుత్వం 1100 ఎకరాల భూమిని కేటాయించిన సంగతి తెలిసిందే. ఎకరా రూ. 5లక్షల చొప్పున ఈ భూమిని కేటాయించింది. 2026 జనవరి నాటికి కడప స్టీల్‌ప్లాంట్ తొలి దశ పనులు ప్రారంభించాల్సి ఉంది. అలాగే 2026 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు. ఇక 2029 ఏప్రిల్ సమయానికి స్టీల్ ప్లాంట్ నుంచి ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.జేఎస్‌డబ్ల్యూ ప్రతిపాదనలకు ఏపీ ప్రభుత్వం ఆమోదం తెలపటంతో సకాలంలో పనులు ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న జేఎస్‌డబ్ల్యూ సంస్థకు ప్రోత్సాహకాలు ఇవ్వటంతో పాటుగా విద్యుత్, నీరు, ఇతరత్రా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.మరోవైపు సున్నపురాళ్లపల్లె వద్ద స్టీల్ ప్లాంట్ రెండో దశ పనులను 2031 జనవరి నాటికి మొదలుపెట్టనున్నారు. 2034 ఏప్రిల్ వచ్చేసరికి స్టీల్‌ప్లాంట్‌లో రెండో దశలోనూ ఉత్పత్తి



ప్రారంభించాలని నిర్ణయించారు.ఆంధ్రప్రదేశ్ రీఆర్గనైజేషన్ యాక్ట్, 2014లోని 13వ షెడ్యూల్ ప్రకారం కడప స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే మూడు మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో రెండు దశలలో కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మొదటి దశలో ఒక మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయాలని.. రెండో దశ కల్లా ఉత్పత్తి సామర్థ్యాన్ని మరో 2 మిలియన్ టన్నులకు పెంచుకోవాలని నిర్ణయించారు. ఇందుకోసం జేఎస్‌డబ్ల్యూ సంస్థకు 1100 ఎకరాల భూమిని 33 సంవత్సరాలు లీజుకు ఇచ్చారు.ఇక కడప స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి ఇప్పటికే పలుసార్లు శంకుస్థాపనలు చేశారు. 2023లో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ లిమిటెడ్ భూమి పూజ చేసింది. తాజాగా జేఎస్‌డబ్ల్యూ ప్రతిపాదనలకు ఏపీ ప్రభుత్వం ఆమోదం తెలపటంతో పనులు వేగం పుంజుకోనున్నాయి. ఈ స్టీల్ ప్లాంట్ మొదటి దశ నిర్మాణం ద్వారా ప్రత్యక్షంగా 3,200 మందికి, పరోక్షంగా 25,000 మందికి ఉపాధి అవకాశాలు.లభిస్తాయని అధికారులు చెప్తున్నారు.

# చెత్త తీసుకెళ్లి.,..బహుమతులు తీసుకోండి

గుంటూరు, సెప్టెంబర్ 8

చెత్తే కదా అని వేస్టు కింద లెక్కగట్టకండి. చెత్త కాదు అది సంపద అంటోంది ఏపీ ప్రభుత్వం. అందుకే చెత్త సేకరణ చేస్తోంది. చెత్తతో సంపద తయారీ కేంద్రాలను కూడా నెలకొల్పుతోంది. ఇదే క్రమంలోనే గుంటూరు జిల్లా పొన్నూరును చెత్త రహిత పట్టణంగా మార్చేందుకు అధికారులు నడుం బిగించారు. పొన్నూరు మున్సిపాలిటీ ఐటీసీ సంస్థ మధ్య ఒప్పందం కుదిరింది. ఇక ఒప్పందంలో భాగంగా పొన్నూరు పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చెత్త సేకరణపై ఐటీసీ ప్రతినిధులు అవగాహన కల్పిస్తారు. అలాగే ఓ సంచి అందిస్తారు. స్కూలుకు వచ్చేటప్పుడు ఈ సంచీలో ఇంటి నుంచి పొడి చెత్తను తీసుకురావాల్సి ఉంటుంది. ఆ చెత్తను తూచి వారికి బహుమతులు అందిస్తారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా మార్చాలనే పట్టుదలతో ఏపీ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర అనే కార్యక్రమాన్ని ఇప్పటికే అమలు చేస్తున్నారు. అలాగే చెత్త వేస్తే నిత్యావసరాలు ఉచితంగా పంపిణీ చేసే స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని గుంటూరు గ్రామీణ మండలంలో ఇటీవల పైలెట్ ప్రాజెక్టు కింద ప్రారంభించారు. వీటితో పాటుగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను కూడా నెలకొల్పుతున్నారు. తాజాగా గుంటూరు జిల్లా పొన్నూరును చెత్తరహిత పట్టణంగా మార్చే ప్రయత్నాలు మొదలయ్యాయి. పొన్నూరులో తడి, పొడి చెత్తలను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలిస్తూ ఉంటారు. అయితే ఇక్కడి నుంచి వ్యర్థాల తొలగింపు లేకపోవటంతో డంపింగ్ యార్డులో చెత్త గుట్టలు గుట్టలుగా పెరిగిపోయింది. ఈ స్థాయిలో చెత్తను బయటకు తరలించాలంటే పొన్నూరు మున్సిపాలిటీకి ఆర్థికంగా ఇబ్బందిగా మారింది.ఈ నేపథ్యంలోనే పొన్నూరు మున్సిపాలిటీ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. చెత్తను తరలించేందుకు ఐటీసీ సంస్థతో పొన్నూరు మున్సిపాలిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వ సూచనలతో పొన్నూరు మున్సిపాలిటీ, ఐటీసీ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ నేపథ్యంలో చెత్త సేకరణకు కొత్త విధానాన్ని పొన్నూరు మున్సిపాలిటీలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నారు. ఇక్కడి నుంచి వచ్చే ఫలితాల ఆధారంగా మరికొన్ని చోట్ల ఇదే తరహా విధానాన్ని అమలు చేసే అవకాశాలు ఉన్నాయి.ఈ విధానంలో భాగంగా పొన్నూరులోని స్కూళ్ల విద్యార్థుల నుంచి చెత్త సేకరించి వారికి ప్రోత్సాహకాలు అందించనున్నారు. పొన్నూరు పరిధిలోని జిల్లా పరిషత్, మున్సిపాలిటీ, ప్రాథమిక పాఠశాలల్లో సుమారుగా 1500 మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు అంచనా. ఐటీసీ ప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు చెత్త సేకరణ, వాటి నుంచి సంపద ఎలా సృష్టించవచ్చో అవగాహన కల్పిస్తారు. అలాగే ప్రతి విద్యా?ర్థికి ఓ సంచీని అందజేయనున్నారు. రోజూ ఉదయం పాఠశాలకు వచ్చే సమయంలో విద్యార్థులు ఆ సంచీలో తమ ఇంటి నుంచి పొడి చెత్తను తీసుకుని రావాల్సి ఉంటంది. అలా తీసుకువచ్చిన పొడిచెత్తను తూకం వేసి.. ఆ బరువు ప్రకారం విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తారని పొన్నూరు మున్సిపాలిటీ అధికారులు తెలిపారు.లాగే మున్సిపాలిటీలోని ప్రతి ఇంటికి వెళ్లి మున్సిపాలిటీ అధికారులు, ఐటీసీ ప్రతినిధులు చెత్త సేకరణ, ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. అలాగే సేకరించిన తడిచెత్తను సేంద్రీయ ఎరువుగా మార్చే ప్రయత్నం చేస్తామని పొన్నూరు మున్సిపాలిటీ అధికారులు తెలిపారు.

# కూటమి టార్గెట్ అంతా రాయలసీమే

అనంతపురం, సెప్టెంబర్ 8

కుంది. కడపలో కూడా వైసీపీ పట్టు నిలుపుకోలేకపోయింది. దాంతో మొన్నటి ఎన్నికల తర్వాత కూటమి కాన్సంట్రేషన్ ఓవర్ టు సీమ అయిపోయింది.వైసీపీని తిరిగి అక్కడ కోలుకోకుండా చేస్తే ఇంకో రెండు మూడు టర్మ్‌లు తమదే పవర్ అని అంచనా వేస్తోంది టీడీపీ. అందుకే అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి మహానాడుకు కడపనే వేదికగా ఎంచుకుంది సైకిల్ పార్టీ. జగన్ కంచుకోటలో మూడురోజుల పాటు మహానాడు నిర్వహించి..లక్షలాది మందితో సభ పెట్టి..జెండాలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లతో పసుపు మయం చేసి పబ్లిక్ అటెన్షన్ గ్రాబ్ చేసే ప్రయత్నం చేసింది.తెలుగుదేశం పుట్టాక చాలా నగరాల్లో మహానాడు పెట్టారు. కానీ ఫస్ట్ టైమ్ హిస్టరీలో సాధించనన్ని సీట్లు సాధించిన తర్వాత కడపను టార్గెట్ చేస్తూ బ్రహ్మాండంగా పార్టీ పండుగను నిర్వహించి వైసీపీకి తన సత్తా ఏంటో చూపించింది టీడీపీ. సేమ్‌టైమ్ జనసేన పరంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా వరుసగా కడప పర్యటనలు చేస్తూ..జగన్ అండ్ వైసీపీ నేతలకు వార్నింగ్‌లు ఇస్తూ వస్తున్నారు.ఇప్పుడు కూటమిలో మరో మిత్రపక్షం వంతు అన్నట్లుగా ఉంది. బీజేపీ కూడా కడప నుంచే తన కార్యాచరణకు రెడీ అవుతోంది. బీజేపీకి కొత్త అధ్యక్షుడిగా నియమితులైన పీవీఎన్ మాధవ్ రాష్ట్ర పర్యటనలకు సిద్ధం అవుతున్నారు. వాటిని కడప నుంచే మొదలు పెడతామని ప్రకటించారు. కడపను రాజకీయ కోణంలో కాకుండా ఆధ్యాత్మిక కోణంలో చూస్తున్నాం.. అందుకే కడపను ఎంచుకుంటున్నామని చెబుతున్నారు.దేవుని తొలి గడప కడప అని మాధవ్ చెప్పారు. అందుకే సారథ్యం పేరుతో రాష్ట్ర పర్యటన త్వరలోనే మొదలవుతుందని అంటున్నారు. తొలి శాసనం దొరికిన జిల్లాగా అలాగే తెలుగు జాతి తెలుగు సంస్కృతికి ప్రధాన ద్వారంగా నిలిచిన కడప నుంచి పర్యటన స్టార్ట్ చేస్తామంటున్నారు. ఐదు విడతలుగా సారథ్యం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగనుంది. ఉత్తరాంధ్రకు చెందిన మాధవ్..అక్కడి నుంచే పార్టీ యాక్టివిటీస్‌ను మొదలెడతారని అంతా అనుకున్నారు. కానీ మాధవ్ తన తొలి రాష్ట్ర పర్యటనను రాయలసీమ నుంచి పైగా జగన్‌కు, వైసీపీకి హార్డ్ కోర్ జిల్లా అయిన కడప నుంచి ప్రారంభిస్తుండటం ఆసక్తికరంగా మారింది.కూటమి పార్టీలన్నీ తమ బలాన్ని పెంచుకోవడానికి కార్యక్షేత్రంగా కడపనే ఎంచుకుంటున్నాయి. పవన్ కూడా అనేక సార్లు రాయలసీమలో పర్యటిస్తూ వస్తున్నారు. కడపలో రచ్చబండ కార్యక్రమం పెట్టారు. ఆ మధ్యే కడప వెళ్ళి మరీ ఎంపీడీవో మీద జరిగిన దాడిని ఖండించి వచ్చారు పవన్. ఏకంగా రాయలసీమలోనే క్యాంప్ ఆఫీస్ పెడతానంటూ ప్రకటించేశారు. రాయలసీమ మీ జాగీరు కాదు..గూండాగిరి చేస్తే ఊరుకునేది లేదంటూ వార్నింగ్ ఇచ్చారు పవన్.కర్నూలు జిల్లాలో గ్రీన్ కో ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. ఇక కడపలో పర్యటించి..సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల ఆధీనంలో ఉన్నాయని ఆరోపిస్తున్న అటవీ భూములను పరిశీలించారు. సీఎం చంద్రబాబు కూడా నెలలో కనీసం రెండు సార్లకు తక్కువ కాకుండా సీమ జిల్లాల టూర్లు వేస్తున్నారు. ఇప్పుడు బీజేపీ కూడా రాయలసీమపైనే ఫోకస్ పెడుతోంది. దాంతో వైసీపీ వర్సెస్ కూటమిగా రాయలసీమ రాజకీయం మారిపోయింది.తిరిగి తన పట్టును సాధించేందుకు..గత వైభవం తెచ్చుకునేందుకు వైసీపీ ప్లాన్ చేస్తోంది. మూడు కీలక పార్టీలు అంతా కలసి సీమ మీద కన్ను వేయడంతో వైసీపీకి సవాల్‌గా మారింది. జగన్ కంచుకోట సెంట్రిక్‌గా కూటమి పార్టీలు చేస్తున్న ప్లాన్లు ఎంత వరకు సక్సెస్ అవుతాయో చూడాలి.

## నెల్లిమర్లలో మంత్రులు గొట్టిపాటి, కొండపల్లి పర్యటన

విజయనగరం సెప్టెంబర్ 8

నెలిమర్ల నియోజకవర్గంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్, కొండపల్లి శ్రీనివాస్ పర్యటించారు. డెంకాడ మం. పెద్దతాడివాడలో 33/11 కేవీ సబ్ స్టేషన్ కు మంత్రులు శంఖుస్థాపన చేసారు. రూ. 2.8 కోట్లతో నిర్మించనున్న సబ్ స్టేషన్ కు శంఖుస్థాపన చేసారు.

మంత్రి గొట్టిపాతి మాట్లాడుతూ లో ఓల్టేజ్ సమస్యలకు చెక్కు పెట్టేందుకే సబ్ స్టేషన్ల నిర్మాణం చేస్తున్నాం. పీఎం సూర్యఘర్ పథకం కింద రాష్ట్రానికి 20 లక్షల కనెక్షన్లు కేంద్రం కేటాయించింది. తీర ప్రాంతాల విద్యుత్ సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుంది. గత ఐదేళ్లలో విద్యుత్ శాఖ దోపిడీకి గురైంది తప్ప అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు.

విద్యుత్ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకురావాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం . రూపాయి బిల్లు పెంచకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం . రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో అధికారులు జాప్యం చేయరాదని అన్నారు.

## మా ఆర్థిక వ్యవస్థను స్విచ్ఛాఫ్ చేసుకోవాలా..?'

### రష్యా చమురు కొనుగోలు విషయంలో పశ్చిమ దేశాలపై మండిపడ్డ భారత్

న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 8

ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యాపై పశ్చిమ దేశాలు పలు ఆంక్షలు ఉన్నప్పటికీ మాస్కో నుంచి భారత్ పెద్ద ఎత్తున చమురు దిగుమతి చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో రష్యా చమురు దిగుమతి చేసుకోవడంపై పశ్చిమ దేశాలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ వస్తున్నాయి. దీనిపై తాజాగా భారత్ స్పందించింది. పశ్చిమ దేశాల విమర్శలను యూకేలోని భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామి తోసిపుచ్చారు. ఏ దేశం కూడా తమ ఆర్థిక వ్యవస్థను ఆపేయాలని అనుకోదని వ్యాఖ్యానించారు.బ్రిటిష్ రేడియో స్టేషన్ టైమ్స్ రేడియోతో దొరైస్వామి మాట్లాడుతూ.. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు అని తెలిపారు. దేశ అవసరాల్లో 80 శాతం దిగుమతులపైనే అధారపడుతున్నట్లు చెప్పారు. రష్యా నుంచి చౌక ధరకు చమురు దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు. అవసరాల మేరకు డిస్కౌంట్‌పై చమురును ఎలా కొనుగోలు చేయకుండా ఉంటాం..? అని ప్రశ్నించారు. పశ్చిమ దేశాలు భారత్‌పై విమర్శలు చేస్తున్నాయన్నారు. 'మేం ఏం చేయాలని పశ్చిమ దేశాలు కోరుకుంటున్నాయి..? మా ఆర్థిక వ్యవస్థను స్విచ్ఛాఫ్ చేసుకోవాలా..?' అంటూ ప్రశ్నించారు.

## తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రముఖ పాత్ర జైపాల్ రెడ్డిదే

### మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

హైదరాబాద్ సెప్టెంబర్ 8

కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా పీవీ నరసింహారావు మార్గ్ (నెక్లెస్ రోడ్) లోని స్ఫూర్తి స్థల్ లో ఆయన స్మారకానికి రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ పల్లె నుండి ఢిల్లీ దాకా ఎదిగిన భారత రాజకీయ శిఖరం, బెస్ట్ పార్లమెంటిరియన్ స్వర్గీయ సూదిని జైపాల్ రెడ్డి. 1969లో కల్వకుర్తి ఎమ్మెల్యేగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి అక్కడి నుండే వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తర్వాత మహబూబ్ నగర్,మిర్యాలగూడ,చేవెళ్ల పార్లమెంట్ స్థానాల నుండి ఐదు సార్లు లోక్సభ సభ్యుడిగా గెలుపొందారు. రెండు సార్లు రాజ్యసభ సభ్యుడిగా,రాజ్య సభలో ప్రతిపక్ష నేతగా కూడా పనిచేసిన అపార రాజకీయ అనుభవం కలిగిన నేత జైపాల్ రెడ్డి. ఉత్తమ పార్లమెంటేరియన్గా పురస్కారం అందుకున్న తొలి దక్షిణ భారత ఎంపీగా ఘన కీర్తి పొందారని అన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రముఖ పాత్ర జైపాల్ రెడ్డి దే. హైదరాబాద్ కు ప్రపంచ స్థాయి మెట్రో జైపాల్ రెడ్డి వల్లే సాధ్యమైంది. అధికారంలో ఉన్న,ప్రతిపక్షంలో ఉన్న రాజకీయ విలువలు కలిగి ఉన్న నేత అయన రాజకీయ జీవితం నేటి తరం నేతలకు ఆదర్శం..స్ఫూర్తి దాయకం. జైపాల్ రెడ్డి గురించి చెప్పే అంత పెద్ద స్థాయి నాది కాదు.. ప్రపంచ దేశాలు గుర్తించే నాయకుడు జైపాల్ రెడ్డి. జైపాల్ రెడ్డి పెద్ద కుమారుడు అరవింద్ నేను ఇంజనీరింగ్ లో క్లాస్ మెట్. ప్రజల కోసం నిజాయితిగా పని చేసిన నాయకుడు జైపాల్ రెడ్డి. ఆయనకు భారత రత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వని కోరుతున్నానని అన్నారు.పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కు జైపాల్ రెడ్డి పేరు పెట్టాము. ఐకే గుజ్రాల్ నేతృత్వంలో ఏర్పడ్డ యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో..మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వాల్లో కేంద్ర సమాచార ప్రసార శాఖ, పట్టణాభివృద్ధి శాఖ, పెట్రోలియం, సహజ వాయువుల శాఖ సహా మరికొన్ని శాఖలకు మంత్రిగా పనిచేశారు. వైకల్యానికి గురైన ఎన్నడూ నిరాశ చెందలేదు..అది ఆయన రాజకీయ జీవితానికి ఎన్నడూ అవరోధంగా భావించలేదు. సవాళ్ళకే సవాలుగా నిలిచిన వ్యక్తి జైపాల్ రెడ్డి. విద్యార్థి నాయకుని నుండి కేంద్ర మంత్రి గా ఎదిగారు. సవాళ్ళను సమర్థంగా ఎదుర్కొంటూ ఉన్నతంగా ఎదగాలనే నేటి తరానికి ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితమే నిదర్శనం.

# యంగ్ ఛార్మింగ్ హీరో సన్నీ కునాల్ హీరోగా ఘనంగా 'రోహిణి' మూవీ ఆడియో లాంచ్..

యంగ్ ఛార్మింగ్ హీరో సన్నీ కునాల్ హీరోగా, దేవిక సాహూ, ఆశ హీరోయిన్లుగా,కె.వి నరసింహ రాజు సమర్పకులుగా, నిర్మాత కుశాల్ రాజు








దర్శకుడు సంగ కుమార్ కాంబినేషన్‌లో రూపొందిన 'రోహిణి' మూవీ ఆడియో వేడుక హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో కిక్కిరిసిన ప్రేక్షకుల మధ్య ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమంలో పాటలు, ట్రైలర్‌ను ఆవిష్కరించిన ముఖ్య అతిథులు టీఎఫ్‌సీసీ అధ్యక్షులు దామోదర ప్రసాద్, నిర్మాత చదలవడ శ్రీనివాస్, త్రినేత్ర ఫౌండేషన్ ప్రెసిడెంట్ పరమేశ్వరి మడపటి, హీరో కృష్ణసాయి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రముఖ నిర్మాత చదలవడ శ్రీనివాస్ ట్రైలర్ లాంచ్ చేసి మాట్లాడుతూ.. " స్టామినా ఉన్న హీరో సన్నీ కునాల్ తప్పకుండా సక్సెస్ సాధిస్తాడు. రూపంలోనూ నటనలోనూ ఆకట్టుకున్న సన్నీ కునాల్ కు ఆల్ ది బెస్ట్. చిన్న సినిమాలు సక్సెస్ అయితే వేలాది కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది. మంచి సబ్జెక్ట్‌తో తెరకెక్కిన రోహిణి సినిమా పెద్ద విజయం సాధించి నిర్మాత కుశాల్ రాజు మరిన్ని సినిమాలు తీయాలని కోరుకుంటున్నాను" అన్నారు.

టీఎఫ్‌సీసీ సెక్రటరీ, ప్రముఖ నిర్మాత దామోదర ప్రసాద్ మాట్లాడుతూ.. " హీరో సన్నీ కునాల్ కు మంచి భవిష్యత్తు ఉంది. తప్పకుండా సినిమా ఇండస్ట్రీలో హీరోగా మంచి పేరు తెచ్చుకుంటాడు.. కంటెంట్ బాగుంటే ఏ సినిమా అయినా విజయవంతం అవుతుంది. ఇటీవల హిట్ అయిన 'లిటిల్ హార్ట్స్' లాగే , రోహిణి కూడా హిట్ అయి, కాంప్రమైజ్ కాకుండా సినిమా తీసిన నిర్మాత కుశాల్ రాజుకు డబ్బులు రావాలి. మరెన్నో మంచి చిత్రాలు తీస్తూ సినిమా ఇండస్ట్రీలో స్థిరపడాలి " అన్నారు.

దర్శకుడు సంగ కుమార్ మాట్లాడుతూ.. "ఈ సినిమా విజయవంతం కావడానికి యూనిట్‌లో ప్రతి ఒక్కరి కృషి ఉంది. ముఖ్యంగా డాక్టర్ రాజేంద్ర రాజు కాంచనపల్లి అందించిన సహకారం మా సినిమాకు బలం. పాటలకు వస్తున్న స్పందన సంతోషంగా ఉంది. త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాను హిట్ చేయాలని కోరుతున్నాను" అన్నారు.

నిర్మాత కుశాల్ రాజు మాట్లాడుతూ.. "ఒక మంచి సినిమా అందించాలనే లక్ష్యంతో పని చేశాం. దర్శకుడు సంఘ కుమార్ అందించిన కొరియోగ్రఫీ ఫైట్స్ అదుర్స్. కెమెరామెన్ అభినయ్ ప్రతిభ రోహిణి సినిమాకు హైలైట్. అందుకే సినిమా బాగా వచ్చింది. త్వరలోనే విడుదల చేసే మా సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నాము " అన్నారు.

హీరో సన్నీ కునాల్ మాట్లాడుతూ.. "మేమంతా ఎంతో కష్టపడ్డాం. ఆ కష్టానికి తగిన ఫలితం రావాలి. ప్రేక్షకులు నచ్చే సస్పెన్స్,

మెచ్చే రొమాన్స్ అండ్ థ్రిల్లింగ్ అంశాలు రోహిణి లో చాలా ఉన్నాయి. ప్రేక్షకుల ఆదరణ కావాలి. సినిమాను సూపర్ హిట్ చేయండి. " అన్నారు. హీరోయిన్లు దేవిక సాహూ మాట్లాడుతూ.. "పాటలు బాగుంటే సినిమా హిట్ అవుతుంది. రోహిణి పాటలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా కూడా చాలా బాగా వచ్చింది. ప్రతి ఒక్కరూ థియేటర్‌కి వెళ్లి ఈ సినిమాను విజయవంతం చేయాలని కోరుకుంటున్నాం. మాకు అవకాశం ఇచ్చిన నిర్మాత కుశాల్ రాజు కు దర్శకులు సంఘ కుమార్ కు ధన్యవాదాలు" అన్నారు.

లిరిక్ రైటర్ డాక్టర్ దాసరి వెంకటరమణ మాట్లాడుతూ.. "ఈ సినిమాకు సింగల్ కార్డు తో పాటలు రాసే అవకాశం ఇచ్చిన మిత్రుడు డాక్టర్ రాజేందర్ రాజు కాంచనపల్లికి కృతజ్ఞతలు. పాత సినిమాల మాదిరిగా మధురమైన సాహిత్యంతో రాశాను. పాటలు అందరికీ నచ్చుతాయి " అన్నారు. ప్రముఖ కవి, రచయిత, కేంద్ర బాల సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ దాసరి వెంకటరమణ ఈ చిత్రంలోని అన్ని పాటలు రాయగా, సంగీతాన్ని ఆనంద్ అందించారు.

" నవరసాలు పలికించిన డాక్టర్ దాసరి వెంకటరమణ పాటలు వినసొంపుగా, కనువిందుగా ఉన్నాయి. మా ఇలవేల్పు శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్యానర్ పై వస్తున్న రోహిణి చిత్రం కుశాల్ అండ్ కునాల్ కు మంచి పేరు తీసుకువస్తుంది. సినిమా ఇండస్ట్రీలో ఇద్దరికీ స్థిరమైన మంచి భవిష్యత్తు ఉండాలని మా ఇష్ట దైవం శ్రీ లక్ష్మీనరసింహస్వామిని వేడుకుంటున్నాను. ఇంత గొప్ప సినిమాకు సమర్పకుడిగా ఉన్నందుకు గర్వంగా ఉంది. నా జన్మ ధన్యమైంది." అని సమర్పకులు కెవి నరసింహ రాజు తెలిపారు.

చిత్ర పర్యవేక్షకులు డాక్టర్ రాజేంద్ర రాజు కాంచనపల్లి ఆకట్టుకునే వ్యాఖ్యానంతో వేడుకను విజయవంతం చేశారు." పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న రోహిణి సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది." సినీ ప్రముఖులు రఘు బత్తుల, %జ%. వేణుగోపాల్,సినీ రచయిత డాక్టర్ వెనిగళ్ళ రాంబాబు, నిర్మాత లయన్ శ్రీరామ్ దత్తి, దర్శకులు అలహరి, సింహ శ్రీ మిద్దె, బిల్డర్స్ యువ రాజు, కృష్ణ, స్పందన, నగధర్ రాజు, రవీందర్ రాజు, చలపతి, రాపోలు దత్తాత్రి, పోలీస్ అధికారులు రాజా, రవి, ఖాజానా, తదితరులు రోహిణి ఆడియో వేడుకలో పాల్గొన్నారు. చంద్ర గ్రహణం ఉన్నా సరే పాత్రికేయ మిత్రులతో,సినీ అభిమానులతో హాల్, కిక్కిర్సి పోవడం విశేషం . ఈ చిత్రానికి మాటలు: మెండెమ్ శ్రీధర్.. కెమెరా: అభినయ్ సంగ. కో ప్రొడ్యూసర్: దేవకి.. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: షేక్ వలీ పాషా.. అసోసియేట్ రైటర్: అక్బర్ చక్రవర్తి.. కో రైటర్స్ : మధురిమ, ప్రియ, ముత్యాల సరాలు జి. హరి ప్రసాద్, బోయినపల్లి రమణా రావు, కే.కే... పీ.ఆర్.ఓ. : కడలి రాంబాబు, దయ్యాల అశోక్.. పబ్లిసిటీ డిజైనర్: వివ రెడ్డి.

# ప్రజాకవి కాళోజీకి హైడ్రా నివాళి

## కాలోజీ చిత్రపటానికి పూలు వేసి నివాళి అర్పించిన హైడ్రా కమిషనర్



హైదరాబాద్, సెప్టెంబరు 09: భారత శక్తి

పద్మవిభూషణ్, ప్రజాకవి, స్వర్గీయ కాళోజీ నారాయణ రావు గారి 111 జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ నివాళు లర్పించారు. –అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి. అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి. అన్యాయాన్నెదిరించిన వాడే నాకారాధ్యుడు" అని సగర్వంగా ప్రకటించి ఉద్యమమే ఊపిరిగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు గారు జీవించారని హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా అన్నారు. "పుట్టుక నీది,చావు నీది, బ్రతుకంతా దేశానిది" అన్న వారి మాటలు అందరికీ స్ఫూర్తి కావాలని ఆకాంక్షించారు. హైడ్రా అడ్మిన్ ఎస్పీ శ్రీ సుదర్శన్‌గారితో పాటు ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని కాళోజీ గారికి నివాళు లర్పించారు.



# సర్దుకోలేకపోతున్నాము

## జనసేన ఎమ్మెల్యేల మనోవేదన

విజయవాడ, సెప్టెంబర్ 8

జనసేన ఎమ్మెల్యేలు అసంతృప్తిగా ఉన్నారా? వారిలో ఫ్రస్టేషన్ పతాక స్థాయికి చేరుకుందా? టిడిపి తీరుపై ఆగ్రహంగా ఉన్నారా? కక్కలేక మింగలేక ఇబ్బంది పడుతున్నారా? ఎంతసేపు తమను సర్దుబాటు చేసుకోవాలన్న సూచనను వ్యతిరేకిస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. పైకి టిడిపితో సమన్వయం కొనసాగుతున్న.. లోలోపల మాత్రం జనసేన ఎమ్మెల్యేలు రగిలిపోతున్నట్లు తెలుస్తోంది. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో టిడిపి నేతల పెత్తనం కొనసాగుతుండడాన్ని వారు సహించలేకపోతున్నారు. అలాగని నాయకత్వం దృష్టికి తీసుకువెళ్తే సర్దుకోవాలని సూచిస్తున్నారు. ఇప్పటికే కొందరు నియోజకవర్గ జనసేన ఇన్చార్జులు అసంతృప్త స్వరం వినిపిస్తే వేటు వేస్తున్నారు. అందుకే ఎమ్మెల్యేలు సైతం వెనక్కి తగ్గుతున్నారు.తెలుగుదేశం కూటమిప్రభుత్వంలో జనసేన కీలక భాగస్వామి. 100% విజయంతో.. డిప్యూటీ సీఎం గా పవన్.. మరో ఇద్దరు జనసేన మంత్రులు.. మరో ఇద్దరు ఎంపీలు.. 21 మంది ఎమ్మెల్యేలతో జనసేన పటిష్ట స్థితిలో కనిపిస్తోంది. అయితే రాజకీయంగా మైలేజ్ ఇచ్చిన జనసేన ఎమ్మెల్యేల విషయంలో మాత్రం నియోజకవర్గాల్లో ఇబ్బందికరంగా ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడ అంతా టిడిపి నేతల పెత్తనం ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. పైగా అక్కడ టిడిపి నేతల మాటే చెల్లుబాటు అవుతోందని ప్రచారం నడుస్తోంది. ఆ పై టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి లకు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు ఇచ్చారు. వారి మాటనే ప్రభుత్వంలో చెల్లుబాటు అవుతోంది. ఎమ్మెల్యేలు ఉన్నారంటే ఉన్నారు అన్నట్టు ఉంది జనసేన శాసనసభ్యుల పరిస్థితి. ఇది రోజు రోజుకు పతాక స్థాయికి చేరుకుంటుంది. దీనిపై జనసేన ఎమ్మెల్యేల్లోనే చర్చ నడుస్తోంది.వాస్తవానికి రాష్ట్రస్థాయిలో తప్పనిసరి పరిస్థితుల్లో పొత్తుకు అంగీకరించారు టిడిపి నేతలు. జనసేనకు కేటాయించిన 21 అసెంబ్లీ స్థానాలు టిడిపికి కంచుకోట లాంటివి. అక్కడ ఆ పార్టీకి బలమైన నాయకత్వం ఉంది. దశాబ్దాలుగా పాతుకుపోయిన నాయకులు సైతం ఉన్నారు. అటువంటివారు పొత్తులో భాగంగా సీట్లు త్యాగం చేశారు. ఇప్పుడు టిడిపి నేతృత్వంలో కూటమి అధికారంలోకి రావడంతో సీట్లు త్యాగం చేసిన నేతలకు పదవులు దక్కాయి. పార్టీపరంగా ప్రాధాన్యం లభిస్తుంది. సీట్లు త్యాగం చేశారు కాబట్టి రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవులు ఇస్తున్నారు. తెలుగుదేశం పార్టీ కార్యవర్గంలో సైతం చోటిస్తున్నారు.

దీంతో వారు దూసుకుపోతున్నారు. సీనియర్లు కావడంతో అధికారులతో కూడా పనులు చేయించుకుంటున్నారు. వారితో చూసుకుంటే జనసేన ఎమ్మెల్యేల మాటలు కొన్నిచోట్ల చెల్లుబాటు కావడం లేదు. దీంతో వారికి అవమానాలు ఎదురవుతున్నాయి. అయితే ఒకటి కాదు రెండు కాదు దాదాపు జనసేన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతి నియోజకవర్గంలో కూడా ఇదే పరిస్థితి.జనసేన రాష్ట్ర స్థాయి సమన్వయ సమావేశంలో ఎమ్మెల్యేలు తమ బాధను వ్యక్తం చేస్తే.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీదూకుడును నియంత్రించాలంటే పొత్తు కొనసాగాలని.. అలా కొనసాగాలంటే సర్దుబాటు చేసుకోవాలని జనసేన ఎమ్మెల్యేలకు నాయకత్వం సూచిస్తోంది. దీంతో ఒక రకమైన అసంతృప్తి ఎమ్మెల్యేల్లో ఉంది. పవర్ లేని ఈ పదవులు ఎందుకని.. టిడిపి నేతల మాటలే చెల్లుబాటు అవుతుంటే ఇక తాము ఉండి ఏమి ప్రయోజనమని ఎక్కువమంది బాధపడుతున్నారు. మున్ముందు ఇదే పరిస్థితి కొనసాగితే జనసేన ఎమ్మెల్యేలు స్వచ్ఛందంగా పక్కకు తప్పుకోవడం ఖాయమని ఆ పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. తప్పకుండా ఇది పార్టీకి నష్టం చేకూరుస్తుందని ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు.

# శిశువు - పశువు



నాడుజి
అన్నం తినరా కన్నా! అని
నీవు ఎంతగా
బతిమాలుకున్నా..!

నీ మాట వినకుండా
నిన్ను ఎన్నో విధాలుగా
వేధింపులకు గురి చేశాడు..
నిన్ను లెక్క చేయకుండా
ఎంతగానో ఏడిపించాడు..
ఐనా నీవు వాడికి కడుపునిండా
నీ చేతులతో తినిపించావు

నేడుజి
అన్నం పెట్టరా! తండ్రీ! అని
నీవు ఎంతగా వేడుకున్నా..
నిన్ను అన్ని విధాలుగా
బాధలకు గురి చేస్తున్నాడు
ముద్ద పెట్టరా! నాన్నా! అని
ఆకలితో మొరపెట్టుకున్నా
నిన్ను పిడిగుద్దులతో గుద్దుతూ
నీ ఒంటిని హూనం చేస్తున్నాడు
పాలతో కడుపు నింపిన నిన్ను
కాలెత్తి నీ కడుపు మీదే తంతున్నాడు
ఔనమ్మా...!
నాడు
నీవు గారాబంగా పెంచుకున్న
నీ ముద్దుల శిశువు!
నేడు
నీ ముందు నిల్చున్న
రెండు కాళ్ల పశువు!



చౌదూరి నరసింహారావు
కవి, పత్రికారచయిత, విశ్లేషకులు

# డీజే శబ్దాలతో పోతున్న ప్రాణాలు.!

- తల్లిదండ్రులకు కడుపుకోతగా మిగిలిస్తున్న వైనం
- మద్యం మత్తులో తూలుతు యువత సంబరాలు
- డీజే వాడకంపై ఆరోగ్య సమస్యలుంటాయన్న వైద్య నిపుణులు

-కొరవడిన పోలీసుల నిఘా.!

మణుగూరు, సెప్టెంబర్ 09 (భారతశక్తి): డీజే సౌండ్స్ యువతకు ఎనలేని ఇష్టం. ఈ సౌండ్స్ వినగానే చిన్న, పెద్ద, యువతి, యువకులు వైమరిచి నృత్యం చేస్తుంటారు. పండగలు, శుభకార్యాలు వంటి కార్యక్రమాలకు డీజే సౌండ్స్ తప్పనిసరిగా ఉండాల్సిందే. ఒకప్పుడు వివాహాలకు బ్యాండ్ ఏర్పాటు చేసుకునేవారు. ఈ డీజే సౌండ్స్ వచ్చిన తర్వాత బ్యాండ్ బాజాలు కనుమరుగయ్యాయి. డీజేలను ఆన్ చేయగానే యువతి, యువకుల్లో ఒక రకమైన వైబ్రేషన్స్ స్టార్ట్ అయి వైమరిచి, కేరింతలు కొడుతూ నృత్యం చేస్తుంటారు. ముఖ్యంగా ఈసౌండ్స్ ను వినాయక నవరాత్రి, దసరా ఉత్సవాల ఊరేగింపుల్లో, శుభకార్యాల్లో ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఈ సౌండ్స్ వలన ప్రాణాలకి ప్రమాదమని తెలిసినప్పటికీ యువతి,యువకులు వీటికే ప్రాధాన్యత ఇస్తారు. ఈ సౌండ్స్ వలన ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నప్పటికీ యువతి, యువకులు మాత్రం మాకు డీజేలు కావాలంటూ పెద్దల మాటలను సైతం పక్కనపెట్టి ఈ సౌండ్ సిస్టంకు అధిక ప్రాధాన్యతను ఇస్తుంటారు. ఈ సౌండ్స్ కారణంగా ఇండ్లలో కబోర్డ్స్ లో ఉండే సామాన్లు, మన శరీరంలో ఉండే అవయవాలు సైతం కదులుతాయి.

డీజే శబ్దంతో తల్లిదండ్రులకు కడుపుకోత.!

డీజే శబ్దాలకు తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు కడుపుకోత మిగిలిస్తుంది. ఈ మధ్య కాలంలో మణుగూరు మండలంలోని గుట్టమలారం గ్రామానికి చెందిన మహిళ వినాయక నవరాత్రి ఉత్సవాల ఊరేగింపుల్లో డీజే పాటలకు డాన్స్ వేస్తూ ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటన అందరికి తెలిసిందే. అదేవిధంగా ఖమ్మం జిల్లా, చింతకాని మండలంలోని ప్రభుత్వ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ గా పనిచేస్తున్న వారి కుమారుడిని స్కూల్ కు పంపేందుకు తల్లి స్నానం చేయిస్తుండగా డీజే శబ్దానికి ఒక్కసారిగా కళ్ళు తేలేసి, చేతులు పైకి లేపి కిందపడి పోయాడు. ఉలిక్కిపడ్డ తల్లిదండ్రులు చిన్నారిని హుటాహుటిన హాస్పిటల్ కు తీసుకెళ్తే తలలో రక్తం గడ్డ కట్టిందని, ఆపరేషన్ కొరకు రూ.15 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. మధ్యతరగతి కుటుంబానికి అంత డబ్బు భారమైనప్పటికి అప్పు చేసి బాబు ప్రాణాలను కాపాడుకున్నారు. ఇలా ఎంతో మంది ముఖ్యంగా యువతి, యువకులు, అభంశుభం తెలియని చిన్నారులు నృత్యం చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలను పోగొట్టుకుంటున్న ఘటనలు కోకొల్లలున్నాయి.

హెచ్చరిస్తున్న వైద్యులు

గుండె జబ్బులు ఉన్న వారు ఈ సౌండ్స్ కు దూరంగా ఉండకపోతే గుండె పోటు వచ్చి ప్రాణాలు పోయే ప్రమాదముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. దింతో పాటు మానసిక అసహనం, కల్లోలం, స్ట్రోక్ లాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా వీటి శబ్దాలకు 100 మీటర్ల దూరం వరకు మనం నిలబడే నేల, కాంక్రీట్ గోడల సైతం వైబ్రేషన్స్ వస్తుంటాయంటే ఎంత ప్రమాదకరమో అర్థం చేసుకోవచ్చు. ఈ సౌడ్స్ కు వలన ఇంట్లో సెల్ఫ్ ల్లో ఉండే సామాన్లు కింద పడిపోతుంటాయి. ఈ సౌండ్స్ కారణంగా వృద్ధులు, అనారోగ్య సమస్యలతో ఉన్నవారు ఇబ్బందులు పడుతున్న యువత మాత్రం లెక్కచేయకుండా మద్యం మత్తులో




ఇష్టం వచ్చినట్లు ఈ సౌండ్స్ ముందు నృత్యం చేస్తూ క్షణాల్లో గాలిలో కలిసిపోతున్నారు. పోలీస్ శాఖ డీజేసౌండ్స్ వల్ల జరుగుతున్న అనర్థాలను చూసిచూడనట్లు వదిలేయడంతో డీజే నిర్వాహకులు మితిమీరిన శబ్దాలతో రాత్రిపగలు అనే తేడా లేకుండా రెచ్చిపోతున్నారు

కొరవడిన పోలీసుల నిఘా.!

జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఊరేగింపుల్లో డీజేలసౌండ్స్ ను తగ్గించాలని వాటి నిర్వాహకులకు ఆదేశాలు ఇచ్చినప్పటికీ మణుగూరులో మాత్రం పోలీసుల నిఘా కొరవడింది. జిల్లా ఎస్పీ ఆదేశాలు పెడచెవిన పెట్టి వినాయక ఉత్సవాల కమిటీ నిర్వాహకులు డీజేలు పెట్టి యువత, యువకులు మద్యం మత్తులో ఇష్టం వచ్చినట్లు నృత్యాలు చేశారు. ఈ సౌండ్సను ఇప్పటికైనా పోలీసులు కట్టడి చేయకపోతే మరింత మంది ప్రాణాలను పోగొట్టుకునే ప్రమాదం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో మణుగూరు పోలీస్ శాఖ వారు ఆంక్షలు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# సీఎం రిలీఫ్ చెక్కుల పంపిణీ..

## - ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో కార్యక్రమం..

## కృతజ్ఞతలు తెలియజేసిన భాస్కరాచారి..

హైదరాబాద్: భారత శక్తి అబ్దుల్లాపూర్మెట్ మండల్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ, పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ చెందిన వారు అనారోగ్య



సమస్యలతో హాస్పిటల్లో చూయించుకోగా 22 మంది లబ్ధిదారులకు 9,27,000 రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా క్యాంప్ ఆఫీస్ తొర్రూర్ లో పంపిణీ చేయడం జరిగినది..

ఈ కార్యక్రమంలో బి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ భాస్కర్ చారి, మండల పార్టీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కందాల రంగారెడ్డి, మాజీ సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, కిషన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కె వెంకట్ రెడ్డి, ధన్ పాల్ రెడ్డి, మూల కిరణ్, అంతటి ధనరాజ్, రాజు నాయక్, రాజ్యాం నాయక్ ముఖ్య నాయకులు పాల్గొని లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేయడం జరిగింది..

# గీతంలో ఘనంగా కాళోజీ 111వ జయంతి

## ప్రజా కవిని స్మరించుకుని నివాళులర్పించిన గీతం ఉన్నతాధికారులు, సిబ్బంది, విద్యార్థులు

పటాన్చెరు సెప్టెంబర్ 9 భారత శక్తి

తెలంగాణ కవి, రచయిత, స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ కాళోజీ



నారాయణరావు 111వ జయంతిని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని స్టూడెంట్ లైఫ్ విభాగం వారు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ కాళోజీ నారాయణరావు (9 సెప్టెంబర్ 1914 %-% 13 నవంబర్ 2002) ప్రజా కవిగా ప్రసిద్ధి చెందారు. తన రచనల ద్వారా సామాజిక స్పృహను పెంపొందించడంతో పాటు మానవ విలువలను ప్రతిబింబించిన ప్రముఖ సాహిత్యవేత్త. ఆయన అపార కృషికి గుర్తింపుగా, 1992లో కాళోజీకి పద్మవిభూషణ్ అవార్డును ఇచ్చి కేంద్ర ప్రభుత్వం సత్కరించగా, ఆయన పుట్టిన రోజును తెలంగాణ భాషా దినోత్సవంగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.

ఈ సందర్భంగా, గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు పుష్పగుచ్ఛాలు అర్పించి, కాళోజీ శాశ్వత వారసత్వాన్ని గుర్తుచేసుకున్నారు. వెరపులేని రచయితగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, సామాన్య ప్రజల గొంతుకగా ఆయన పాత్రను ప్రోవీసీ కొనియాడారు. కాళోజీ రచనలు తరతరాలకు స్ఫూర్తినిస్తానే ఉన్నాయని, తెలంగాణ సాంస్కృతిక గుర్తింపునకు చిహ్నంగా ఉన్నాయన్నారు.

గీతం హైదరాబాదు రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం %-% క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, బోధన, బోధనేతర సిబ్బందితో పాటు పలువురు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజా కవికి ఘన నివాళులు అర్పించారు.

తెలంగాణ యొక్క గొప్ప సాహిత్య, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటం, ప్రోత్సహించడం పట్ల గీతం నిబద్ధతను ఈ స్మారక కార్యక్రమం ప్రతిబింబించడంతో పాటు విద్యార్థులలో సామాజిక బాధ్యత విలువలను కూడా పెంపొందిస్తోంది.

# అమీన్ పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యములో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానం



అమీన్ పూర్ సెప్టెంబర్ 9 భారత శక్తి

గురువులు విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే నిజమైన శిల్పులని, వారి సేవ సమాజానికి అమూల్యవైనవని ముఖ్య అతిథి లయన్ ఇ. వి. రమణ అన్నారు. డా. సర్వేపల్లి రాధకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని గురుపూజోత్సవము సందర్భముగా లయన్స్ క్లబ్ ఆఫ్ అమీన్ పూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమములో ముఖ్య అతిథి రీజియన్ చైర్మన్ ఇ వి. రమణ ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. క్లబ్ అధ్యక్షులు కే. నాగరాజు అధ్యక్షతన ప్రోగ్రామ్మింగ్ చైర్మన్స్ లయన్స్ పట్నం సురేందర్, మంగళపర్తి రామక్రిష్ణ ప్రసాద్ ల సౌజన్యముతో బృందావన్ టీచర్స్ కాలనీ లోని కమ్యూనిటీ హాల్ నందు 12 గురు ఉత్తమ ఉపాధ్యాయులను ఘనముగా సన్మానించారు. ఈ కార్యక్రమములో క్లబ్ కార్యదర్శి కే. సిద్దిరాములు, కోశాధికారి కరుణాకర్ రెడ్డి సభ్యులు లయన్స్ పి. రామనర్సింహ రెడ్డి, వెంకటేశం, రమేష్, రమాకాంత్, నాగభూషణం, లింగం, రాజేందర్, సోమకృష్ణ, మహేందర్ రెడ్డి, వెంకటరమణ, రమణాచార్యులు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎస్ రామచంద్రరావుకు సన్మానం




ఎల్బీనగర్, సెప్టెంబర్ 09 (భారత శక్తి):

త్యాగరాయ గానసభలో జరిగిన మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధా కృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సోమవారం యస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యస్. రామచంద్రా రావుకు పద్మశ్రీ ఆచార్య కులుకులూరి యేనాక్ పూర్వ వెంకటేశ్వర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మురళి మోహన్ రాజు, కోలేటి దామోదర్ పూర్వ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ శక్తి,జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో 10-రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం



సంగారెడ్డి సెప్టెంబర్ 9 భారత శక్తి

జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో %-% బేటీ పడావో కార్యక్రమం లో భాగంగా 10 రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఇష్ట జూనియర్ కళాశాల, సంగారెడ్డి లో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (%ఋూూ%) సెక్రటరీ సౌజన్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ %-%జువెనైల్ జస్టిస్ యాక్ట్, పోక్సో యాక్ట్ వంటి బాలల రక్షణ చట్టాల ప్రాముఖ్యతను వివరించారు. సైబర్ క్రైమ్స్, ఆన్లైన్ మోసాలు, సోషల్ మీడియా ప్రభావాలు గురించి అవగాహన పెంచి, బాధ్యతాయుతంగా టెక్నాలజీ వినియోగించుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని హెచ్చరించి, అలాంటి అలవాట్లను దూరం పెట్టాలని సూచించారు. టీనేజ్లో ఎదురయ్యే ఆకర్షణలు, మానసిక ఒత్తిళ్లు వంటి సమస్యలను సకాలంలో పరిష్కరించుకోవాలని, కౌన్సెలింగ్ సేవలు వినియోగించుకోవాలని సలహా ఇచ్చారు. విద్యార్థులు తమ కెరీర్ లక్ష్యాలు స్పష్టంగా సెట్ చేసుకొని క్రమశిక్షణ, కష్టపడి చదవడం ద్వారా విజయాన్ని సాధించాలని ప్రేరేపించారు. పిల్లల వివాహ నిషేధ చట్టం, మహిళల రక్షణ చట్టాలు గురించి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయం, అవగాహన శిబిరాలు, 1098 చైల్డ్లైన్ సహాయ సేవలు వంటి కార్యక్రమాలను వినియోగించుకోవాలని విద్యార్థులను కోరారు. లింగ సమానత్వం, మహిళా సాధికారత సమాజ అభివృద్ధికి కీలకమని గుర్తుచేశారు. కార్యక్రమం అనంతరం అధికారులు, విద్యార్థులు "సెల్ఫీ ఫోటో బూత్" లో పాల్గొన్నారు. అదే విధంగా మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతిజ్ఞ చేసి, యువత ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు కట్టుబడి ఉండాలని సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇష్ట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవి కుమార్, %ూ×% నర్సింలు, ఎక్సిబిషన్ %ూ×% దిలీప్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, వైస్ ప్రిన్సిపాల్ షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటియూసి పోరాట ఫలితమే సంక్షేమ బోర్డు - ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్..




ములుగు జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్ 9 (భారత శక్తి) : ఏఐటీయూసీ పోరాట ఫలితమే భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఏర్పాటు అయిందని ఎ ఐ టి యు సి ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల యూనియన్ ములుగు జిల్లా కమిటీ సమావేశము జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవణము లో జిల్లా అధ్యక్షులు పోలం కొండయ్య అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ హాజరై మాట్లాడారు. అనేక పోరాటాల ఫలితంగా 2009 లో భవణ నిర్మాణ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అలాంటి సంక్షేమ బోర్డు లో సభ్యులు గా నమోదైన కార్మికులకు సంబంధించిన వివాహలకు,ప్రసూతికి రూ 30,000/- వేల చొప్పున, నార్మల్ డెత్ కు రూ 1,30,000/- లు,ప్రమాద మరణానికి రూ,6,30,000/- ల చొప్పున అందిస్తున్నారు. ఏఐటియుసి అనుబంధ భవణ నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు అనేక రకాలుగా మిలిటెంట్ పోరాటాలు నిర్వహించిన ఫలితంగా సహజ మరణానికి రూ 2,30,000/- లుగా,ప్రమాధ మరణాలకు రూ 10,30,000/- లకు పెంచడం జరిగిందని ఆయన వెల్లడించారు. దీంతో పాటు వివాహనికి,ప్రసూతికి కూడ లక్షావెయ్యి నూటాపధహరు రూపాయలు,సహజ మరణానికి రూ 10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. సభ్యులు గా నమోదు కావడానికి వయస్సు 60, ఏండ్లు కటాఫ్ కాకుండా 75 ఏండ్ల వరుకూ అవకాశం ఇవ్వాలని అన్నారు,

ఈ సమావేశంలో భవణ నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండి నర్సయ్య, ప్రధాన కార్యదర్శి కొక్కుల రాజేందర్ కోశాధికారి సామల దేవేందర్, సిపిఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, సీనియర్ నాయకులు ఇంజం కొమురయ్య,బుర్రి క్రాంతి,ఇండ్ల లక్ష్మినారాయణ,గ్రామ పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బుడిమె సదయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతం, జిల్లా కేంద్రం లో ప్రతి గల్లిలో రోడ్డు నిర్మాణ పనులకే ప్రాధాన్యత - మంత్రి సీతక్క..



ములుగు జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 9 (భారత శక్తి) : గ్రామీణ ప్రాంతాలతో పాటు జిల్లా మండల కేంద్రాలలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్ణయం తీసుకున్నదని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి 163 నుండి మదనపల్లి క్రాస్ రోడ్డు వరకు నాలుగు కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయనున్న రోడ్డు వెడల్పు, డివైడర్, సెంటర్ లైటింగ్ పనులను జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతురవి చందర్ లతో కలిసి మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు.అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయడమే కాకుండా ఇప్పటికీ రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించిందని వివరించారు. ఇప్పటికే జిల్లా కేంద్రం నుండి పలు గ్రామాలకు వెళ్లే రహదారులను విస్తరించి పనులను పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు.బతుకమ్మ పండుగ వరకు రోడ్డు పనులను, నాణ్యత లోపించకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్, పంచాయతీ రాజ్ ఈ ఈ అజయ్ కుమార్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బహుజన బీడీ కార్మిక సంఘం బిఎల్ టీయూ రెండవ రాష్ట్ర మహా సభల గోడ ప్రతులు ఆవిష్కరణ..



కామారెడ్డి జిల్లా, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 09: అక్టోబర్ 11,12, న నిజామాబాదు జిల్లా కేంద్రంలోతెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం, బిఎల్ టీయూ రెండవ రాష్ట్ర మహా సభలను జయప్రదం కోసం,గోడ ప్రతులను ఆవిష్కరణ గావించారు. మంగళవారం నిజామాబాదు జిల్లా ముప్కాల్ మండలం, బస్వాపూర్ ఎమ్.ఎస్,లంగర్ బీడీ సెంటర్ లో, బీడీ ప్యాకర్లు,బట్టి, చటన్,బుర్ర కార్మికులు, సమక్షంలో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం, రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్దిరాములు ఆద్వర్యంలో గోడ పోస్టర్(గోడ పత్రాలు, ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రములోని బీడీ పరిశ్రమకు పుట్టినిల్లు అయినా నిజామాబాదు జిల్లా కేంద్రంలో అక్టోబర్ 11,12 తేదీ ల్లో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బిఎల్ టీయూ రాష్ట్ర రెండవ మహా సభలు, నిర్వహించడం జరుగుతుంది,


మొదటి రోజు అక్టోబర్11న, మధ్యాహ్నం 1గంటకు, తిలక్ గార్డెన్ నుండి, భారీ ర్యాలి, పాత కలెక్టర్ కార్యాలయం వరకు, మధ్యాహ్నం 2 గంటలకు, పాత కలెక్టర్ కార్యాలయం గ్రౌండ్ లో బహిరంగ సభ ఉంటుంది.రెండవ రోజు అక్టోబర్12న,నిజామాబాదు తిలక్ గార్డెన్ న్యూ అంబేద్కర్ భవనంలో ప్రతినిధుల మహా సభ ఉదయం10.గంటలకు ప్రారంభం అవుతుంది, మొదటి రోజు బహిరంగ సభకు ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు, ఉమ్మడి నిజామాబాదు జిల్లా ఇన్ చార్జి మంత్రి వర్యులు, అతిధులు, కా. నల్ల సూర్య ప్రకాష్, బిఎల్ ఎఫ్,చైర్మన్ జయరాజ్, పకృతి కవి,రచయిత ఏపూరి సోమన్న, బహుజన యుద్ధ నౌక,జుపక సుభద్ర కవి, రచయిత, వక్తలు దండి వెంకట్, బిఎల్ టీయూ రాష్ట్ర అధ్యక్షులు, యం. ఆంజనేయులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నగరపు యెల్లయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్. డి. సయ్యద్, రాష్ట్ర కోషదికారి తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం, సబ్బని లత, బహుజన లెఫ్ట్ మహిళ సంఘం, రాష్ట్ర అధ్యక్షురాలు మంత్రి సుదర్శన్, రాష్ట్ర అధ్యక్షులు తిరుపతి గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గుడ్ల రాజు, సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బాస్కర్, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు, తెలంగాణ బహుళ జన బీడీ టేకేదార్ యూనియన్,బి. జగదీష్, నిజామాబాదు జిల్లా అధ్యక్షులు చట్ల పొశవ్వ, నిర్మల్ జిల్లా అధ్యక్షులు కే.శ్రీ హరి,జిల్లా అధ్యక్షులు బి. నర్సిములు, జిల్లా కార్యదర్శి సిద్దిపేట జిల్లా గంగా మణి, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు కుమ్మరి రవి, కామారెడ్డి జిల్లా కార్యదర్శి యం. ప్రభాకర్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు రోహిణి, మెదక్ జిల్లా అధ్యక్షురాలు యం. రాజేంద్రర్, బిఎల్ టీయూ నిజామాబాదు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.రాజు సిరిసిల్ల జిల్లా కార్యదర్శి తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం వడ్ల సాయి కృష్ణ, బిడియస్ఎఫ్, రాష్ట్ర అధ్యక్షులు, తదితరులు హాజరయి, మాట్లాడే ఈ సభను జయప్రదం చేయాలని కార్మిక వర్గం విజ్ఞప్తి చేశారు.

గత రెండు సంవత్సరాల కాలంలో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బిఎల్ టీయూ, తెలంగాణ రాష్ట్రములోని బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై, రాజీలేని పోరాటం చేయడం జరిగింది. చేసిన పోరాటాలను ఉద్యమాలను సామిక్షించుకోని భవిష్యత్ ఉద్యమ కర్తవ్యాలు,

కాంగ్రెస్ ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల సందర్భాలలో బీడీ కార్మికుల అందరికీ, 4016 రూ.ల. జీవన భృతి ఇస్తామని, బీడీ కార్మికుల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటికి రెండు సంవత్సరాలు అవుతున్న బీడీ కార్మికులకు,4016 రూ.లు, ఇవ్వలేదు,2014 పిబ్రవరి 28, కటావ్ తేదిని తోలగించలేదు, కేంద్రం ప్రభుత్వం ఇపిఎఫ్, పెన్షన్ పెంచిన 3000/- ఇవ్వడం లేదు, బీడీ పరిశ్రమ పై లేనిపోని ఆంక్షలు పెట్టి, బీడీ పరిశ్రమపై జిఎస్టి, 28% నుండి,నేడు,40%కు పెంచడం జరుగుతుంది. దిని ద్వారా బీడీ కార్మికులు మరింత ఉపాది దెబ్బ తినడం కోసం బహుళ జాతీయ కంపనీలతో కేంద్రం ప్రభుత్వం, కుమ్ముక్కై బీడీ కార్మికులకు ఉపాది లేకుండా చేస్తుంది, ఇట్టి విషయాలపై మరింత పోరాటం చేయడం కోసం ఈ అక్టోబర్ 11,12 తేదీల్లో నిజామాబాదు జిల్లా కేంద్రంలో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బిఎల్ టీయూ, రాష్ట్ర రెండవ మహా సభలుకు వేల సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి,

ఈ కార్యక్రమంలో, తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బిఎల్ టీయూ, రాష్ట్ర ఉపాధ్యక్షులు, బి. జగదీష్, రాష్ట్ర కోషదికారి, యస్. డి. సయ్యద్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు బాధ తప్పేదెలా.. యూరియా అందేదేలా..! అన్నదాతలతో అధికార పార్టీ ఆగమయ్యేనా..







ములుగు జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 9 (భారత శక్తి) : జిల్లావ్యాప్తంగా యూరియాతో రైతులకు బాధ తప్పడం లేదు. జిల్లాలోని వివిధ మండలాలలో టోకెన్ల జారీకి పలు చోట్ల కౌంటర్లు నెలకొల్పినప్పటికీ యూరియా కోసం రైతులు బారులు తీరాల్సి వచ్చింది. ఒక చోట టోకెన్లు.. మరొక చోట పంపిణీ ప్రక్రియతో అన్నదాతలు ఆగమవుతున్నారని పలుచోట్ల ప్రజలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకపక్క ప్రభుత్వం రైతులకు ఎక్కడా యూరియాతో సమస్యలు తలెత్తకుండా, క్యూ లైన్లలో తోపులాటలు జరగకుండా ప్రతి రైతుకు యూరియా బస్తాలను అందిస్తున్నామని, రైతు వేదికల ద్వారా యూరియా అమ్మకాలు జరిపేందుకు వీలుగా ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్స్ మిషన్లను తెప్పించి సంబంధిత సిబ్బందికి శిక్షణ ఇప్పించి యూరియా అమ్మకాలు జరుపుతున్నామంటుంది. మరోపక్క రైతుల బారులు తప్పడం లేదు. పలు కౌంటర్లలో వేలకొద్దీ రైతులకు చిట్టీలు ఇచ్చి 15 రోజుల నుండి 30 రోజుల వరకు రైతుకు అధికారులు యూరియా అందించలేకపో తున్నారని, అది కూడా ఒక రైతుకు ఒక్క బస్తా ఇస్తే పంటలను ఎలా కాపాడుకోవాలి అంటూ అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పిఎసిఎస్ ద్వారా ఓ రెండు ప్రైవేటు ఫెర్టిలైజర్ షాపుల వద్ద వేల సంఖ్యలో రైతులు తిండి తిప్పలు లేకుండా పొద్దటి నుండి క్యూ లైన్ లో యూరియా కోసం నిలబడితే అందులో కొంత మందికే 200 బస్తాలను ఒక్కో బస్తా ఇచ్చి, మిగతా వందల మంది రైతులు బాధతో వెనుదిరిగి వెళ్ళారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ అన్నదాతలతో ఆగమయ్యేనా... అంటూ పలుచోట్ల ప్రజల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల అండతో పలుకుబడి ఉన్న నాయకుల ఇండ్లలో సరిపడా యూరియా బస్తాలు నిలువ చేసుకున్నారంటూ ప్రజల నుండి ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి దనసరి అనసూయ (సీతక్క) చొరవ చూపి రైతులకు సరిపడా యూరియా అందించి అన్నదాతలను ఆదుకోవాలని కోరుతున్నారు.

# మట్టేవాడ పోలీస్ స్టేషన్ సందర్శించిన సిపి..



ఉమ్మడి వరంగల్ బ్యూరో,(భారత శక్తి)సెప్టెంబర్9:

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం మట్టేవాడ పోలీస్ స్టేషన్ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్కు చేరుకున్న పోలీస్ కమిషనర్ కు అధికారులు మొక్క ను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ ముందు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం స్టేషన్ రెసెప్షన్ సిబ్బంది, స్టేషన్

సిబ్బంది పనితీరుతో పాటు, పోలీస్ స్టేషన్ లో అత్యధికంగా నమోదు అయిన కేసులు, స్టేషన్ పరిధిలోని కాలనీ ల వివరాలను పోలీస్ కమిషనర్ ఇన్స్ స్పెక్టర్ కరుణాకర్ ను అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏ ఎస్పీ శుభం వున్నారు.

## ఘనంగా కాళోజి నారాయణరావు జయంతి వేడుకలు

కామారెడ్డి జిల్లా, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 09: మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ముఖ్యఅతిథిగా పాల్గొని కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సాహిత్య వర్గ ప్రతినిధులు మాట్లాడుతూ, కాళోజి తన కవిత్వంతో ప్రజల కష్టాలు, ఆశలు, ఆకాంక్షలకు స్వరమిచ్చారు.



ఆయన రచనలు సామాజిక చైతన్యానికి మార్గదర్శకం అని పేర్కొన్నారు.తరువాత జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కాళోజి నారాయణరావు తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో అగ్రగణ్యులు. ఆయన రచనల్లో సమాజంలోని సమస్యలు ప్రతిఫలించాయి. ప్రజల కోసం, తెలుగు సాహిత్యం కోసం చేసిన కృషి చిరస్మరణీయం అని వివరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్

చందర్ నాయక్, డిబిసిడిఓ జయరాజ్ అసిస్టెంట్ బిసిడిఓ చక్రధర్, సాహితీ మిత్రులు, బహుజన సంఘాల నాయకులు కొత్తపల్లి మల్లయ్య,నాగభూషణం, గంగారాం, నాగరాజు, నరేష్, పవన్ అశ్వక్, జిల్లా అధికారులు, పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

# గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు రైతులు తప్పనిసరిగా వేయించాలి



వైయస్సార్ కడప జిల్లా సెప్టెంబర్ 9(భారత శక్తి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు విధిగా వేయించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోజాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టరు శ్రీధర్ చెరుకూరి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ఈ నెల 15-09-2025 నుండి 15-10-2025 వరకు ఈ టీకాల కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.జిల్లాలో 3,71,400 డోసుల టీకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 4 నెలలు వయస్సు దాటిన నల్ల మరియు తెల్ల పశువు కలిగియున్న ప్రతి్ని రైతు ఈ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జెడి శారదమ్మ, పశుసంవర్ధక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జియాగూడ స్లాటర్ హౌజ్ ఆధునీకీకరణ పనులను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలి

**పరిశుభ్రత కు పెద్ద పీట వేయాలి**

**జియాగూడ స్లాటర్ హౌజ్ తనిఖీ సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఆదేశం**







హైదరాబాద్, (భారత శక్తి) సెప్టెంబర్ 9:

జియాగూడ స్లాటర్ హౌజ్ ఆధునికీకరణ పనులను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలనీ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ప్రాజెక్ట్స్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.మంగళవారం జిహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ కార్వాన్ సర్కిల్‌లోని జియాగూడ కమేళా స్లాటర్ హౌస్‌ను ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, చీఫ్ ఇంజనీర్ (మెయింటెనెన్స్) సహదేవ్ రత్నాకర్, చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ వకీల్ లతో కలసి తనిఖీ చేశారు.స్లాటర్ హౌస్ ఆధునికీకరణ కు ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందున త్వరగా టెండర్లను పిలిచిపనులను త్వరగా ప్రారంభం అయ్యేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు .ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల ఉండేలా చూడాలని కమిషనర్ ప్రాజెక్టు ఇంజినీర్లకు ఆదేశించారు. పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ ప్రజారోగ్య రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త, నిర్మాణ వ్యర్థాలు తక్షణమే తొలగించాలని, శుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలి

## -150 కోట్లతో భక్తుల సౌకర్యార్థం జాతర పనులు : మంత్రి సీతక్క






ములుగు జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 9 (భారతశక్తి) : వనదేవతల భక్తుల సౌకర్యార్థం 150 కోట్లతో పనులు ఏర్పాట్లు, అన్ని శాఖల అధికారులు నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేసి అందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ – శిశు సంక్షేమశాఖల మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మేడారం జాతర పనులువచ్చే ఏడాది జనవరి 28 నుండి 31 వరకు జరగనున్న మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతరను పురస్కరించుకొని భక్తులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, మేడారంలో జరుగునున్న పనులను పరిశీలించడానికి వారంలోగా ముఖ్యమంత్రి మేడారాన్ని పర్యటిస్తారని మంత్రి తెలిపారు.మంగళవారం జిల్లాలోని ఎస్ఎస్ తాడువాయి మండలం మేడారం గ్రామంలో జిల్లా కలెక్టర్ దివాకరటి.ఎస్., ఎస్పీ డాక్టర్ శబరిష్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచంద్ర లతో కలసి ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న విఐపి పార్కింగ్ రోడ్డు, పోలీస్ కంట్రోల్ రూమ్,హరిత హెూటల్ తదితర ప్రాంతాలను పరిశీలించారు.అనంతరం మేడారంలోని ఐటీడీఏ సమావేశపు హాల్లో అమ్మవార్ల పూజారులు, అన్ని శాఖల అధికారులతో మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర 2026 పై సమీక్ష సమావేశం నిర్వహించి మంత్రి సీతక్క మాట్లాడుతూ భక్తుల సౌకర్యాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 150 కోట్ల రూపాయలను కేటాయించిందని, కేటాయించిన నిధులతో ఆయా శాఖల అధికారులు 100 రోజుల నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గద్దెల ప్రాంతంలో పూజారుల మనోభావాలు దెబ్బ తినకుండా వారి సూచనలు మేరకు నూతన హంగులతో శ్వాశతంగా నిలిచిపోయేలా పనులు చేయాలని, మేడారం గ్రామస్తులు పూజార్ల అభిప్రాయాలను సైతం పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర పండుగనే కాకుండా మరో కుంభమేళా తరహాలో జరగనున్న జాతరకు సామాన్య పౌరుని నుండి రాష్ట్రపతి, ప్రధానమంత్రి లాంటి ముఖ్యులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వివిఐపి లకు ఇబ్బందులు రాకుండా విమానాలు సైతం దిగే విధంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈసారి చేపట్టనున్న పనులు శాశ్వతంగా ఉండే విధంగా పనులపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. దేవుళ్ళు కలిగిన ప్రాంతంలో రాజకీయాలు చేసే ఏ రాజకీయ నాయకుడు ఎదగలేదని, రానున్న మహా జాతరను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు. భక్తులకు అమ్మవార్లపై భక్తి విశ్వాసం పెంపొందించేలా జాతర ఏర్పాట్లు చేయాలని ఆమె సూచించారు.ఈ సమావేశంలో ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ స్థపతి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ ఈ శివ నాగిరెడ్డి, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గరావు, ఈ ఓ వీరస్వామి, ఆర్కేటెక్చర్, ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎలక్షన్ గోడౌన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

కామారెడ్డి జిల్లా,(భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 09:

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు త్రైమాక్షిక తనిఖీలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జిల్లా కేంద్రంలోని ఎలక్షన్ గోడౌన్ ను పరిశీలించారు.ఈసందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎలక్షన్ గోడౌన్ లో ఈవీఎంలను భద్రపరిచిన గదులను తెరిచి ఇవియం బాక్సను పరిశీలించి మళ్లీ గదులను సీల్ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు త్రైమాక్షి తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోడౌన్ లో రక్షణ చర్యలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించడం జరిగిందని, అన్ని రక్షణ చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపారు.జిల్లా కలెక్టర్ వెంట కామారెడ్డి ఆర్డిఓ వీణ, తాసిల్దార్ జనార్ధన్, ఎలక్షన్ డిటీ అనిల్, రాజకీయ పార్టీల ప్రతినిధులు జాకంటి ప్రభాకర్ బిఆర్ఎస్, సంతోష్ రెడ్డి బిజెపి, కసిం అలీ టిడిపి, హరిలాల్ బిఎస్పి, శ్రీకాంత్ కాంగ్రెస్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ సమాజాన్ని తన కవితలతో జాగృతం చేసిన గొప్ప ప్రజాకవి కాళోజీ: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్

హైదరాబాద్, (భారత శక్తి )సెప్టెంబర్ 09:

తెలంగాణ సమాజాన్ని తన కవితలతో జాగృతం చేసిన గొప్ప



ప్రజాకవి కాళోజీ అని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ అన్నారు.మంగళవారం ప్రజాకవి కాళోజీ జయంతినీ పురస్కరించుకునిజీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోఆయన చిత్రపటానికి కమిషనర్ ఆర్ వి కర్ణన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తెలంగాణ భాషా సాహిత్యానికి కాళోజీ చేసిన సేవలన కమిషనర్ ఈ సందర్భంగా స్మరించుకున్నారు.తెలంగాణ యాస, భాష కోసం వారు చేసిన కృషికి గుర్తింపుగాకాళోజీ జయంతినీ తెలంగాణ భాషా దినోత్సవ జరుపుకుంటున్నామని కమిషనర్ తెలిపారు.తెలంగాణ భాషకు అస్తిత్వ స్పృహను పెంచడంలో కాళోజీది కీలకపాత్ర అని కొనియాడారు. కాళోజి స్ఫూర్తి, తెలంగాణ సాధనలో, ప్రగతిలో ఇమిడి ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ గీతా రాధిక, %జజు% సహదేవ్ రత్నాకర్, విజిలెన్స్ అదనపు ఎస్పీ సుదర్శన్, డీఎస్పీ నరసింహ రెడ్డి,పిఆర్ఓ మామిండ్ల దశరథం తదితరులు పాల్గొన్నారు.

## స్వరాష్ట్ర ఉద్యమానికి స్ఫూర్తి కాళోజి




సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి)సెప్టెంబర్ 9:

స్వరాష్ట్ర ఉద్యమానికి తన రచనలతో స్ఫూర్తి నింపిన గొప్ప కవి కాళోజీ నారాయణరావు అని సంగారెడ్డి మండలం కల్పగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శైలజ అన్నారు. మంగళవారం పాఠశాలలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి హెచ్ఎం శైలజ ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ..కాళోజి స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని తెలంగాణ భాషను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూదన్ రామకృష్ణారెడ్డి శ్రీనివాస్ గౌడ్ విరాజ్ రెడ్డి కమల్ జిత్ కౌర్ హమీదా బేగం ప్రవీణ్ కుమార్ తేజందర్ సింగ్ రాహుల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## కాళోజీ ఆశయాలను కొనసాగించాలి

ములుగు జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 9 (భారత శక్తి) : కాళోజి నారాయణజయంతిని ఘనంగా నిర్వహించి ఆయన ఆశయాలను కొనసాగించాలని అదనపు కలెక్టర్ సంపత్ రావు అన్నారు.జిల్లా





కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు కాళోజి నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి, ఆయన సేవలను స్మరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళోజి నారాయణ తెలుగు సాహిత్యంలో, ప్రజా ఉద్యమాలలో చేసిన కృషి విశేషమని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు ఆచరణలో పెట్టాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ కార్యాలయ ఏవో రాజ్ కుమార్, సూపరింటెండెంట్ మహేష్ బాబు, ఇతర సిబ్బంది తదితరులు పాల్నోరు. ములుగు మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జనగాం సంపత్ సిబ్బంది తో కలిసి కాళోజీ నారాయణ జయంతిని ఘనంగా నిర్వహించారు

## సంగారెడ్డి జిల్లాలో ఫోటో ఎక్స్పో గోడ పత్రిక ఆవిష్కరణ



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి)సెప్టెంబర్ 9:

ఫోటో ఎక్స్పో ఆవిష్కరణ ను టి జి ఐ ఐ సి చైర్మన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి పట్టణ మరియు మండల అధ్యక్షులు సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు సుప్పాల శ్రీనివాస్, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి పుట్టి బాలరాజు, కుటుంబ భరోసా జిల్లా ఇన్చార్జ్ సాయి మరియు పట్టణ కోశాధికారి మురళి, సీనియర్ ఫోటోగ్రాఫర్లు అప్ప ప్రభాకర్, గోపాల్, సురేష్, యాదగిరి, లక్ష్మణ్, రవికాంత్, మరియు కొండాపూర్ మండలం ఆధ్వర్యంలో అధ్యక్షులు కర్ణం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గోడ పత్రికను ఆవిష్కరించడం జరిగింది. అలాగే జిల్లాలోని నాలుగు డివిజన్లో మరియు పట్టణాలు మండలాలలో ఘనంగా గోడ పత్రిక ఆవిష్కరణను నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు సుప్పాల శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలోని ఫోటోగ్రాఫర్లు పెద్ద ఎత్తున ఫోటోగ్రాఫర్ల పండుగ కు విచ్చేసి మన వృత్తిలో వచ్చే కొత్త కొత్త మార్పు చేర్పులను, ఎక్స్పోకు వచ్చి, తిలకించి, తమ యొక్క నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని అన్నారు.

## గ్రామ పాలన అధికారులకు క్లస్టర్లకు కేటాయించిన నియామక ఉత్తర్వులను అందజేసిన జిల్లా కలెక్టర్

కామారెడ్డి జిల్లా,(భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 09: వివిధ




క్లస్టర్లకు కేటాయించిన గ్రామ పాలన అధికారులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ క్లస్టర్లకు కేటాయించిన నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఎంతో నమ్మకంతో మిమ్ములను ఇతర శాఖల నుండి మళ్లీ రెవెన్యూ శాఖలోకి తీసుకొని విధులను అప్పగించడం జరిగిందని ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మీకు కేటాయించిన క్లస్టర్లలో రెవెన్యూ విధులు సక్రమంగా నిర్వహించి ప్రభుత్వ భూముల సంరక్షణ, భూభారతి చట్టం అమలు, ఇతర రెవెన్యూ శాఖ సంబంధించిన విధులను సమర్థవంతంగా నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఆర్డీవో వీణ, కలెక్టరేట్ ఏవో సయ్యద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ఊరగుట్ట నేచర్ పార్క్‌ను పర్యాటక హబ్ గా అభివృద్ధి చేయాలి

## - కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం,సెప్టెంబర్ 09 (భారతశక్తి):

ఊరగుట్ట నేచర్ పార్క్ ను పర్యాటక హబ్ గా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఇల్లందు మండలంలోని సుభాష్ నగర్ లో గల ఊర గుట్ట నేచర్ పార్క్ ను సందర్శించి, అక్కడ పర్యాటకులను ఆకర్షించడానికి, నేచర్ పార్క్ అభివృద్ధి కి అవకాశాలు, భవిష్యత్తులో చేపట్ట వలసిన కార్యక్రమాలను సంభంధిత శాఖల అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఊరగుట్ట నేచర్ పార్క్ జిల్లాలో సహజసిద్ధమైన అద్భుత సౌందర్యాన్ని కలిగిన ప్రదేశమని, దీనిని సక్రమంగా అభివృద్ధి పరచి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే, రాష్ట్ర స్థాయిలో పర్యాటకులను ఆకర్షించే అవకాశముందని పేర్కొన్నారు. పార్క్ అభివృద్ధి ద్వారా పర్యాటక రంగంలో పురోగతితో పాటు స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కలుగుతాయాన్నారు. ఊరగుట్ట నేచర్ పార్క్ లో ట్రెక్కింగ్ మార్గాలు, జిప్ లైన్, ఫ్లై ఏరియా, అడ్వెంచర్ స్పోర్ట్స్ వంటి వినోదాత్మక వసతులు ఏర్పాటు చేయడానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యువత, కుటుంబాలు, విద్యార్థులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఆకర్షితులయ్యేలా వినోదం, భద్రత, విశ్రాంతి అంశాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్క్ లో పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, చెత్త నిర్వహణ వంటి ప్రాథమిక వసతులు తప్పనిసరిగా కల్పించబడాలని తెలిపారు. పార్క్ లో ఏర్పాటయ్యే స్టాల్స్, ఫుడ్ కార్నర్స్, హ్యాండీక్రాఫ్ట్ ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు వంటి వాటిని స్వయం సహాయక సంఘాలకు అప్పగించడం ద్వారా వారికి ఆర్థికాభివృద్ధి కలుగుతుందని, స్థానిక మహిళలకు స్థిరమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఊరగుట్ట నేచర్ పార్క్ ను జిల్లాలో పర్యాటక హబ్ గా తీర్చిదిద్దడం లక్ష్యమని, దీనిద్వారా జిల్లా పర్యాటక రంగం అభివృద్ధికి కొత్త దారులు తెరవబడతాయని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవి, ఎఫ్.డి.ఓ కరుణాకర చారి, పంచాయితీ రాజ్ ఈఈ శ్రీనివాస్, జిల్లా క్రీడా శాఖ అధికారి పరందామ రెడ్డి, ఎంపీడీఓ ధన్సిగ్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్ ను తనిఖీ చేసిన కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 09 (భారతశక్తి):

కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం భద్రతకు సంబంధించి ప్రతినెల తనిఖీ చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా మంగళవారం ఈవీఎం గోడౌన్ ను సందర్శించడం జరిగిందని తెలిపారు. ఈ పరిశీలనలో భాగంగా ఈవీఎం, వీవీ ప్యాట్లు ఉన్న గదిని, సీసీ కెమెరా గదిలో కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన గోడౌన్ పరిసర ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవరిని లోపలికి అనుమతించరాదని అధికారులకు సెక్యూరిటీ గార్డ్ కు తెలిపారు. అనంతరం తనిఖీ రిజిస్టర్లు సంతకం చేశారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, పొలిటికల్ పార్టీ నోముల రమేష్ బిజెపి, లక్ష్మణ అగర్వాల్ కాంగ్రెస్ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ రాంబాబు, సిపిఐ పార్టీ ఎస్ శ్రీనివాస్, సిపిఐఎం ఎస్కే సలీం ఎన్నికల సిబ్బంది నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# లింగంపల్లి గురుకుల పాఠశాల పాత డార్మెటరీ బ్లాకుకూలిన ఘటనలో విద్యార్థులు సురక్షితం

## - జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య

## - రూ.7 కోట్లతో నూతన భవనం నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు



సంగారెడ్డి, (భారత శక్తి ప్రతినిధి)సెప్టెంబర్ 9మునిపల్లి మండలం లోని తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ స్కూల్ యొక్క పాత డార్మిటరీ బ్లాక్ , మంగళవారం మధ్యాహ్నం కూలిన ఘటనలో విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేదని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అన్నారు. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే హుటాహుటిన కలెక్టర్ లింగంపల్లి రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఎస్ డి ఆర్ హెచ్ బృందం చేపట్టిన సహాయక చర్యలను కలెక్టర్ పర్యవేక్షించారు. తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న మునిపల్లి మండలం, లింగంపల్లి గురుకుల పాఠశాలలో 1984లో నిర్మించిన పాత హాస్టల్ భవనంలో మంగళవారం మధ్యాహ్నం గోడ కూలిన ఘటన చోటుచేసుకుంది . విషయం తెలిసిన వెంటనే కలెక్టర్ ప్రావిణ్య హుటాహుటిన గురుకుల పాఠశాలకు చేరుకున్నారు. గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి నుండి ఇంటర్ వరకు సుమారు 601 మంది విద్యార్థులు చదువుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో విద్యార్థులంతా తరగతి గదిలో ఉండడంతో, పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. ఆ సమయంలో హాస్టల్ భవనం పక్కగా వెళు తున్న ముగ్గురు విద్యార్థులు ఈ ఘటనలో స్వల్పంగా గాయాలయ్యాయని , వారికీ జహీరాబాద్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో ఎస్డిఆర్ఎఫ్ బృందం కూలిన మట్టి తోలగింపు మట్టి శిఖరాల కింద ఉన్న విద్యార్థుల ట్రంకు బాక్సులు వ్యక్తిగత సామాగ్రిని సురక్షితంగా బయటకు తీస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రమాదకరమైన శిథిలావస్థకు చేరిన భవనాల వద్దకు వెళ్లకుండా కౌన్సిలింగ్ కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు విద్యార్థులకు తాత్కాలికంగా వసతికి ఇలాంటి ఇబ్బందులు లేవని అందుబాటులో ఉన్న తరగతి గదులు మరియు హాస్టల్ గదుల్లో తాత్కాలిక వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంజనీరింగ్ శాఖ (ఈ ఈ డబ్ల్యూ ఐ డి సి) అధికారులు సంఘటనా స్థలంలో పాడైన భవనాలను కూల్చివేయడం , వినియోగించటానికి వీలుగా వుండే గదులకు తక్షణ మరమ్మతులు చేపట్టడం లాంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు . రాత్రి సమయంలో పనులు కొనసాగేందుకు తాత్కాలికంగా లైటింగ్ కూడా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గురుకుల పాఠశాలకు నూతన హాస్టల్ భవన నిర్మాణం కోసం రూ .7 కోట్లతో ప్రభుత్వానికి ఆమోదం కోసం ప్రతి పనులకు సమర్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు . ప్రస్తుతం పాఠశాలల్లో పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని విద్యార్థుల భద్రతకు ఎలాంటి సమస్యలు లేవని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

# కాళోజి జయంతి వేడుకలు

## కవికి నివాళులర్పించిన జిల్లా అధికారులు



సంగారెడ్డి, (భారత శక్తి ప్రతినిధి)సెప్టెంబర్ 9:

కళ, సాహిత్యం, సామాజిక న్యాయం కోసం కాళోజి చూపిన కృషిని స్ఫూర్తిగా తీసుకోవాలని, డి ఆర్ ఓ పద్మజారాణి అన్నారు . వెనుకబడినతరగతుల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భముగా జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ రాణి కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భముగా డిఆర్ఓ మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజాకవి కాళోజి తెలుగు సాహిత్యాన్ని కొత్త దిశగా మలిచారని, కాళోజి రచనలు ప్రజలకు చైతన్యం నింపాయని తెలిపారు. ఆయన జీవితం సాదాసీదాగా ఉన్నా ఆయన ఆలోచనలు మహత్తరమని, కాళోజి మాటలు ప్రజల మనసులను కదిలించే శక్తి కలిగినవని అన్నారు. కవిత్వాన్ని ప్రజల సమస్యలతో మేళవించి సాహిత్యాన్ని ఒక ఉద్యమంగా మార్చిన వ్యక్తి కాళోజి మాత్రమేనని వివరించారు. సాహిత్యం తరతరాలను చైతన్యపరుస్తుందని, ఆలోచనలు ఈనాటి యువతకు ఆదర్శంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. కవిత్వం కేవలం సాహిత్యానికే పరిమితం కాకుండా, సమాజ మార్పుకు దారితీసే మార్గదర్శక శక్తిగా ఉన్నదని పేర్కొన్నారు. కళ, సాహిత్యం, సామాజిక న్యాయం కోసం కాళోజి చూపిన కృషిని స్ఫూర్తిగా తీసుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు,యువత కాళోజి బాటలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెనుకబడినతరగతుల శాఖ అధికారి జగదీష్ , అధికారులు, సిబ్బంది, సాహితీ ప్రేమికులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పోతాయిపల్లి గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే మదన్ మోహన్



కామారెడ్డి జిల్లా, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 09:

ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్ మంగళవారం లింగంపేట మండలం, పోతాయిపల్లి గ్రామాన్ని పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న టేకుల చెరువు, పంట పొలాలు, రహదారులు, గ్రామంలోని దెబ్బతిన్న గృహాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా జరుగుతున్న మరమ్మతుల పనులను ప్రత్యక్షంగా పరిశీలించి, వాటిని వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో జరిగిన ఆస్తి నష్టం, పంట నష్టంపై నివేదికను ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యాలయానికి అందజేశాను. రైతులు, ప్రజలకు సరైన నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ కమిటీ సభ్యులు, ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో క్యాన్సర్ డే కేర్ సెంటర్లు

## రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర్ రాజ నరసింహ

సంగారెడ్డి,(భారత శక్తి ప్రతినిధి)సెప్టెంబర్ 9

తెలంగాణ ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగంలో మరో ముందడుగు వేసింది. క్యాన్సర్ వ్యాధి చికిత్సను ప్రజలకు చేరువ చేయడానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో క్యాన్సర్ డే కేర్ సెంటర్ ల ప్రారంభం ద్వారా క్యాన్సర్ వ్యాధిపై పోరాటానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మంగళవారం సంగారెడ్డి వైద్య ఆరోగ్య కళాశాల నుండి వర్చువల్ విధానంలో రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ డే కేర్ సెంటర్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు.క్యాన్సర్ అనేది ప్రమాదకరమైన వ్యాధి అని ప్రజలకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన లేకపోవడంతో వ్యాధి నిర్ధారణకు ఆలస్యం జరగడం చికిత్స అందించడంలో జాప్యం కారణంగా చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని అలాంటి సంఘటనలు



ఇకమీదట జరగకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో క్యాన్సర్ ఎలిమిషన్ ప్రోగ్రాం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమానికి అడ్వైజర్ గా రాష్ట్రానికి చెందిన ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ నూరి దత్తాత్రేయులను నియమించిందని అన్నారు. ఆయన తెలంగాణ రాష్ట్రం క్యాన్సర్ వ్యాధి నియంత్రణలో దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్న నమ్మకాన్ని మంత్రి ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన క్యాన్సర్ డే కేర్ సెంటర్లు లో రోగులకు సమయానుకూలమైన స్క్రీనింగ్ పరీక్షలు రేడియేషన్ పాజిటివ్ కేర్ వంటి సేవలు అందుబాటులోకి వస్తాయి అన్నారు. ఉదయం డే కేర్ సెంటర్కు వచ్చిన రోగి సాయంత్రానికి ఇంటికి చేరుకునేలా అన్ని రకాల క్యాన్సర్ కు సంబంధించిన చికిత్సలు డే కేర్ సెంటర్లలో అందుబాటులోకి వస్తాయన్నారు. దీంతో క్యాన్సర్ రోగులకు ఆర్థికంగా ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు.త్వరలో అన్ని జిల్లాలలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ వాహనాలను సైతం అందుబాటులోకి తెనున్నట్లు మంత్రి తెలిపారు. మొబైల్ స్క్రీనింగ్ వాహనాలతో వైద్య నిపుణులు గ్రామాలలోకి వెళ్లి ప్రజలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం ద్వారా క్యాన్సర్ వ్యాధి ప్రారంభ దశలో గుర్తించి మెరుగైన చికిత్స అందించే వెసులుబాటు కలుగుతుందన్నారు. దీంతో క్యాన్సర్ మరణాలను తగ్గించవచ్చు అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిమ్స్, ఎంజీఎం ఆసుపత్రులలో 80 పడకల క్యాన్సర్ ప్రత్యేక విభాగాలుకొనసాగుతున్నాయని, త్వరలోవరంగల్, సంగారెడ్డి, ఖమ్మం, మహబూబ్నగర్ జిల్లాల్లో రేడియేషన్ బంకర్లతో కూడిన క్యాన్సర్ సెంటర్లు ఏర్పాటు చేనున్నట్లు మంత్రి తెలిపారు. నర్సింగ్ విద్యార్థులకు విదేశీ భాషలపై శిక్షణకు ఒప్పందం.రాష్ట్రంలో ప్రతి ఏటా 3,000 మంది నర్సింగ్ విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు రాష్ట్రంలో ఇప్పటికే 35 బిఎస్సి నర్సింగ్ కళాశాలలో 183 జీఎన్ఎం నర్సింగ్ కళాశాలలు పనిచేస్తున్నాయన్నారు. నర్సింగ్ విద్యార్థులకు విదేశీ భాషలపై జర్మన్ ఇంగ్లీష్ భాషలతో సహా విదేశీ భాషల్లో శిక్షణ ఇవ్వడం కోసం ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటి తో వైద్య ఆరోగ్యశాఖ ఒప్పంద0 చేసుకుందన్నారు. ఈ ఒప్పందం వల్ల నర్సింగ్ విద్యార్థులకు నర్సింగ్ శిక్షణతో పాటు విదేశీ భాషలపై పట్టు సాధించేలా ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ అధ్యాపకులు విదేశీ భాష పై శిక్షణ ఇస్తారన్నారు. ఈ శిక్షణతో నర్సింగ్ విద్యార్థులకు విదేశాలలో ఉద్యోగ అవకాశాలు మమెరుగుపడతాయన్నారు . రాష్ట్రానికి చెందిన నర్సింగ్ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి సేవలు అందించేలా నైపుణ్యాన్ని సాధిస్తారని ఇది వైద్య ఆరోగ్య రంగానికి కొత్త దిశను చూపుతోందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి క్రిస్టినా జడ్చోంగ్తా, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరేంద్ర కుమార్, డైరెక్టర్ అఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్ర కుమార్, అడిషనల్ డీఎంఈ డాక్టర్ వాణి, డైరెక్టర్ ఆఫ్ ఎం.ఎన్.జే కాన్సర్ హాస్పిటల్ డాక్టర్ శ్రీనివాసులు , జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, టీ జీ ఐ ఐ సీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు ) వైద్య కళాశాల అధ్యాపకులు,జి జి హెచ్సూపరింటెండెంట్,వైద్యులు ,నర్సింగ్ కళాశాల విద్యార్థులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గుకేశ్‌కు షాక్...!

ఫిడె గ్రాండ్ స్విస్ () 2025లో భారత చెస్ స్టార్, ప్రపంచ ఛాంపియన్ గుకేశ్‌ను అమెరికా గ్రాండ్‌మాస్టర్ అభిమన్యు మిశ్రా ఓడించాడు. 16 ఏళ్ల వయసులోనే ప్రపంచ ఛాంపియన్‌ను ఓడించి చరిత్ర సృష్టించాడు. మిశ్రా 61 ఎత్తుగడలతో ఈ విజయాన్ని సొంతం చేసుకున్నాడు. కానీ తన ప్రదర్శనతో అతడు సంతృప్తి చెందలేదు!

'నేను గెలిచినప్పటికీ, ఈ టోర్నమెంట్ మునుపటి గేమ్స్‌లా అంత ఆహ్లాదకరంగా అనిపించలేదు. కానీ టోర్నమెంట్ నేను ఊహించిన దానికంటే బాగా జరుగుతోంది. నేను ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే, టోర్నమెంట్‌ను కూడా గెలిచే అవకాశం ఉంది. నిన్న కూడా నేను ప్రాగ్‌పై కొన్ని తప్పులు చేశాను. కానీ నేను ఈ ఆటగాళ్ల కంటే (గుకేశ్, ప్రాగ్) తక్కువ అని నాకు ఎప్పుడూ అనిపించలేదు. నేను వారితో సమంగా ఉన్నా అని భావిస్తున్నా..' అని మిశ్రా తన విజయం అనంతరం అన్నాడు.

అలాగే ఆర్.ప్రజ్ఞానందకు జర్మనీకి చెందిన మథియాస్ బ్లూబామ్ వల్ల షాక్ తగిలింది. అతడు 55 ఎత్తుల్లో ప్రజ్ఞానందపై విజయం సాధించాడు.

## అప్పుడు శుభ్‌మన్ గిల్‌తో కలిసి శిక్షణ..

# ఇప్పుడు ఆసియాకప్‌లో ప్రత్యర్థిగా..



టీమ్‌ఇండియా ఆసియా కప్‌లో భాగంగా సెప్టెంబర్ 10న తన మొదటి మ్యాచ్‌ను యూఏఈతో ఆడనుంది. ఈసందర్భంగా యూఏఈ ఆటగాడు సిమ్రన్‌జిత్ సింగ్ . తనకు శుభ్‌మన్ గిల్‌తో ( ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నాడు. 35 ఏళ్ల సిమ్రన్‌జిత్ సింగ్ స్వస్థలం పంజాబ్‌లోని లూథియానా. 12 ఏళ్ల క్రితం తాను మొహాలిలోని పంజాబ్ క్రికెట్ అసోసియేషన్ నెట్స్‌లో శుభ్‌మన్‌గిల్‌తో కలిసి సాధన చేసిన రోజుల గురించి వివరించాడు.

'శుభ్‌మన్ గిల్ చిన్నప్పటినుంచే నాకు తెలుసు. కానీ అతడికి నేను గుర్తున్నానో లేదో నాకు తెలియదు. 2011-12 ప్రాంతంలో గిల్‌కు 11 లేదా 12 సంవత్సరాల వయసు ఉంటుందనుకుంటా. అప్పుడు మేం ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు మొహాలిలోని పీసీఏ అకాడమీలో శిక్షణ పొందేవాళ్లం. ఉదయం 11 గంటల ప్రాంతంలో గిల్ తన తండ్రితో కలిసి వచ్చేవాడు' అని సిమ్రన్ జిత్‌సింగ్ వివరించాడు. 'నేను మా సెషన్ తర్వాత కూడా చాలా సమయం పాటు బౌలింగ్ చేస్తూ గడిపేవాణ్ణి. ఇప్పుడు గిల్ నన్ను గుర్తుపడతాడో లేదో తెలియదు.. కానీ నేను ఆ రోజుల్లో అతడికి చాలాసార్లు బౌలింగ్ చేశాను' అని గతాన్ని నెమరువేసుకున్నాడు.

'నేను పంజాబ్‌లో జిల్లాస్థాయిలో చాలా క్రికెట్ ఆడాను. చివరికి 2017లో రంజీ ప్రాబబుల్స్‌లో చోటు దక్కించుకున్నాను. గతంలో కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టు మొహాలిలో సెషన్‌లు నిర్వహించినప్పుడల్లా నేను ఆ టీమ్ నెట్స్‌లో చాలా బౌలింగ్ చేశాను' అని అతడు గుర్తు చేసుకున్నాడు. s

## నేషన్స్ కప్‌లో భారత్‌కు మూడో స్థానం

హిసోర్ (తజికిస్థాన్): నేషన్స్ కప్ ఫుట్‌బాల్‌లో భారత జట్టు మూడో స్థానం సాధించింది. సోమవారం మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు పెనాల్టీ షూటౌట్లో 3-2తో ఒమన్‌పై గెలిచింది. జమీల్ 55వ నిమిషంలో చేసిన గోల్‌తో ఒమన్ ఆధిక్యంలోకి వెళ్లగా.. ఉదాంత సింగ్ (80వ) గోల్‌తో భారత్ స్కోరు సమం చేసింది. ఆ తర్వాత జట్లు మరో గోల్ కొట్టలేకపోయాయి. ఎక్స్‌ట్రా టైమ్ తర్వాత కూడా రెండు జట్లు 1-1తో సమంగా నిలవడంతో షూటౌట్ తప్పలేదు. షూటౌట్లో భారత్ తరఫున లలియాంజులా చంగ్తె, రాహుల్ బెకె, జితిన్ స్కోర్ చేశారు. ఓ అంతర్జాతీయ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఒమన్‌పై గెలవడం భారత్‌కు ఇదే తొలిసారి. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఒమన్ 79వ స్థానంలో ఉంది. భారత్‌ది 133వ స్థానం.

## క్వార్టర్స్‌లో జేస్మిన్ ప్రపంచ బాక్సింగ్

లివర్‌పూల్: ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో జేస్మిన్ లంబోరియా పతకానికి అడుగు దూరంలో నిలిచింది. జోరు కొనసాగిస్తూ ఆమె క్వార్టర్‌ఫైనల్ చేరింది. మహిళల 57 కేజీల ప్రిక్వార్టర్స్‌లో జేస్మిన్ 5-0తో జూస్లెన్ రొమెయూ (బ్రెజిల్)ను చిత్తు చేసింది. క్వార్టర్స్‌లో మమాజొనోవా (ఉజ్బెకిస్థాన్)తో ఆమె తలపడనుంది. సనామచా చాను (70 కేజీ), సాక్షి చౌదరి (54 కేజీ) ఓడిపోయారు. ప్రిక్వార్టర్స్‌లో నటాలియా (కజకిస్థాన్) చేతిలో చాను ఓడగా.. పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత అక్బాస్ (తుర్కియే)కు సాక్షి తలొంచింది. పురుషుల 65 కేజీల్లో అబినాష్ ప్రిక్వార్టర్స్ చేరాడు. రెండో రౌండ్లో 5-0తో బరాన్ (మెక్సికో)ను చిత్తు చేశాడు.

## సింగపూర్‌ను చిత్తు చేసి.. మహిళల ఆసియాకప్ సూపర్-4లో భారత్

హాంగ్జౌ (చైనా): ఆసియాకప్ మహిళల హాకీ టోర్నమెంట్లో భారత్ సూపర్-4కు దూసుకెళ్లింది. సోమవారం పూల్-బి మ్యాచ్‌లో 12-0తో సింగపూర్‌ను చిత్తు చేసింది. ఆరంభం నుంచి ప్రత్యర్థిపై విరుచుకుపడిన భారత్.. గోల్స్ వర్షం కురిపించింది. రెండు క్వార్టర్ల తర్వాత 7-0తో ఆధిక్యంలో నిలిచిన భారత్.. ఆ తర్వాతా జోరు కొనసాగించి ఘన విజయాన్ని అందుకుంది. నవ్‌నీత్ (14వ, 20వ, 28వ), ముంతాజ్ (2వ, 32వ, 39వ) హ్యాట్రిక్‌తో విజయంలో కీలకపాత్ర పోషించారు. నేహా (11వ, 38వ) రెండు గోల్స్ కొట్టగా.. లాల్‌రెమ్‌సియామి (13వ), ఉదిత (29వ), షర్మిల (45వ), రుతుజ (53వ) ఒక్కో గోల్ సాధించారు. టోర్నీ తొలి మ్యాచ్‌లో భారత్ 11-0తో థాయ్‌లాండ్‌ను చిత్తు చేసింది. తాజా విజయంతో పూల్-బిలో రెండు విజయాలు, ఒక డ్రాతో సూపర్-4 బెర్తు ఖరారు చేసుకుంది.

## హాంకాంగ్ టైటిల్‌పై సాత్విక్ జోడీ గురి

హాంకాంగ్: ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో జోరుమీదున్న భారత స్టార్ క్రీడాకారులు సాత్విక్ సాయిరాజ్- చిరాగ్‌శెట్టి.. హాంకాంగ్ ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 500 టైటిల్‌పై గురిపెట్టారు. మంగళవారం ప్రారంభంకానున్న ఈ టోర్నీలో సాత్విక్- చిరాగ్ జోడీ ఫేవరెట్‌గా బరిలో దిగనుంది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో చ్యూ సియాంగ్- వాంగ్ లిన్ (చైనీస్ తైపీ) జంటతో సాత్విక్- చిరాగ్ జోడీ తలపడనుంది. మహిళల సింగిల్స్‌లో లైన్ క్రిస్టోఫెర్సెన్ (డెన్మార్క్)తో పి.వి.సింధు.. పురుషుల సింగిల్స్‌లో వాంగ్ వీ (చైనీస్ తైపీ)తో లక్ష్యసేన్, గ్వాంగ్ జు (చైనా)తో హెచ్.ఎస్.ప్రణయ్ తమ పోరాటాన్ని ప్రారంభించనున్నారు.

## రిఫరీలుగా రిచర్డ్‌సన్, పైక్రాఫ్ట్

దుబాయ్: ఆసియా కప్‌లో రిచీ రిచర్డ్‌సన్, ఆండీ పైక్రాఫ్ట్ మ్యాచ్ రిఫరీలుగా వ్యవహరించనున్నారు. గ్రూపు దశలో మ్యాచ్ అధికారుల వివరాలను సోమవారం ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ప్రకటించింది. వీరేందర్ శర్మ, రోహన్ పండిట్ (భారత్).. రవీంద్ర విమలసిరి, రుచిర పల్లియగురుగే (శ్రీలంక).. అహ్మద్ పక్తీన్, ఇజాతుల్లా సఫి (అఫ్గానిస్తాన్).. ఆసిఫ్ యాకూబ్, ఫైజల్ అఫ్రిది (పాకిస్థాన్).. గాజి సోహెల్, మసుదుర్ రహ్మాన్ (బంగ్లాదేశ్) అంపైర్లుగా వ్యవహరిస్తారు.



## భారత్‌కు ఎదురుందా

దుబాయ్ ఆసియా కప్‌లో టీమ్‌ఇండియా తిరుగులేని ఫేవరెట్ అంటే చిన్న మాటే. సూర్యకుమార్ బృందానికి మిగతా జట్లకు అంత తేడా ఉంది. ఆ జట్టు కప్పు అందుకోలేకపోతే ఆశ్చర్యమే. మంగళవారం టోర్నీ తొలి మ్యాచ్‌లో అబుదాబిలో అఫ్గానిస్థాన్, హాంకాంగ్ తలపడతాయి. కానీ కళ్లన్నీ దుబాయ్‌పైనే. ఎందుకంటే అక్కడ యూఏఈతో పోరుతో టీమ్‌ఇండియా తన టైటిల్ వేటను ఆరంభిస్తుంది. ప్రతిభావంతులతో బలంగా కనిపిస్తోన్న భారత్‌పై భారీ అంచనాలే ఉన్నాయి. టీమ్‌ఇండియా ఎంత ఆత్మవిశ్వాసంతో ఉంది అంటే.. టోర్నీకి 17 మంది సభ్యులను ఎంపిక చేసే అవకాశమున్నా, అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ 15 మందినే ఎంపిక చేసింది. నాలుగున్నర నెలల్లో సొంతగడ్డపై టీ20 ప్రపంచకప్‌నకు ఆతిథ్యమివ్వనున్న నేపథ్యంలో ఆసియాకప్ గెలవలేకపోతే విమర్శలు తప్పవు. ప్రపంచకప్‌నకు ముందు సూర్య బృందానికి దాదాపు 20 మ్యాచ్‌లు (ఆసియాకప్ ఫైనల్ చేరితే) ఉన్నాయి. జట్టు కూర్పును సరిచూసుకోవడమే ఇప్పుడు భారత్ ముందున్న ప్రధాన లక్ష్యం. టీమ్‌ఇండియా ఎనిమిదిసార్లు ఆసియాకప్ (వన్డే, టీ20 ఫార్మాట్లలో)ను గెలుచుకుంది.

## బెంగళూరు దూకుడు



**విరామ సమయానికి స్కోరు 21-18తో బెంగళూరు ఆధిక్యంలో నిలిచింది. ద్వితీయార్ధంలో అలీరెజా విజృంభించడంతో బెంగళూరుకు ఎదురులేకపోయింది.**

విశాఖ ప్రొ కబడ్డీ సీజన్-12లో బెంగళూరు బుల్స్ బలంగా పుంజుకుంది. మూడు ఓటముల తర్వాత వంసగా రెండో విజయాన్ని సాధించింది. సోమవారం ఆ జట్టు 40-33తో హరియాణా స్టీలర్స్‌ను ఓడించింది. ఆట ఆరంభం నుంచి బెంగళూరు దూకుడు ప్రదర్శించింది. తొలి అయిదు నిమిషాల్లోనే ప్రత్యర్థిని ఆలౌట్ చేసి 9-2తో ఆధిక్యంలోకి వెళ్లింది. విరామ సమయానికి స్కోరు 21-18తో బెంగళూరు ఆధిక్యంలో నిలిచింది. ద్వితీయార్ధంలో అలీరెజా విజృంభించడంతో బెంగళూరుకు ఎదురులేకపోయింది. ఆఖరిదాకా మెరుగైన ఆధిక్యాన్ని కాపాడుకుంటూ వెళ్లిన ఆ జట్టు ఘన విజయాన్ని అందుకుంది. అలీరెజా (12), యోగేశ్ (6), దీపక్ (5), ఆశిష్ (5) జట్టును గెలిపించారు. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 48-37తో పుణెరి పల్టాన్‌ను ఓడించింది.



## పంజాబ్ నన్ను అవమానించింది

%దిల్లీ: కింగ్స్ ఎలెవన్ పంజాబ్ (ప్రస్తుతం పంజాబ్ కింగ్స్) జట్టులో తాను అవమానాలు ఎదుర్కొన్నట్లు వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ అన్నాడు. 2018-2021 మధ్య పంజాబ్ తరఫున ఆడిన గేల్.. 41 మ్యాచ్‌ల్లో 40.75 సగటు, 148.65 స్ట్రైక్‌రేట్‌తో 1,304 పరుగులు సాధించాడు. బయో బబుల్‌లో జరిగిన 2021 సీజన్ నుంచి గేల్ అర్ధంతరంగా నిష్క్రమించాడు. "పంజాబ్‌తో నా ప్రయాణం కాస్త ముందుగానే ముగిసింది. కింగ్స్ ఎలెవన్‌లో నన్ను అవమానించారు. ఐపీఎల్‌కు ఎంతో చేసి.. లీగ్ విలువ పెంచిన సీనియర్‌తో సరిగ్గా వ్యవహరించలేదు. నన్ను ఓ పిల్లాడిలా చూశారు. నా జీవితంలో తొలిసారిగా నైరాశ్యంలోకి వెళ్లినట్లు అనిపించింది. అప్పటి చీఫ్ కోచ్ అనిల్ కుంబ్లేతో మాట్లాడుతూ ఏడ్చేశా. చాలా బాధపడ్డా. అతనితో, ఫ్రాంచైజీ తీరుతో తీవ్రంగా నిరాశ చెందినట్లు తెలిపా. కెప్టెన్ కేఎల్ రాహుల్ నాకు ఫోన్ చేశాడు. 'గేల్.. ఉండు. తర్వాతి మ్యాచ్‌లో ఆడతావు' అంటూ చెప్పాడు. మీ అందరికీ శుభాకాంక్షలు అంటూ బ్యాగ్ సర్దుకుని బయటకు వచ్చేశా" అని గేల్ వివరించాడు.

# ఆసియా అందె.. ఆశలు చిగురించె..

లఆసియాకప్ గ్రూప్ దశలో కాస్త అస్థిరంగా ఆడిన భారత్.. సూపర్ 4లో ఒత్తిడిలో నిలిచిన తీరు అద్భుతం. డిఫెండింగ్ ఛాంపియన్ కొరియాను ఫైనల్లో 4-1తో ఓడించడం ఆ జట్టు తిరుగులేని ఆధిపత్యానికి నిదర్శనం. చాలా కాలం తర్వాత భారత్ ఎలాంటి తడబాటు లేకుండా ఇలాంటి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. డిఫెన్స్, ఎటాకింగ్, మిడ్‌ఫీల్డ్.. ఇలా అన్ని విభాగాల్లోనూ సూపర్‌గా ఆడిన భారత్, వచ్చే ఆగస్టులో జరిగే ప్రపంచకప్‌లో అవకాశాలపై ఆశలను రేపింది. ఆసియాకప్‌లో కన్నా ఆ టోర్నీలో పోటీ చాలా తీవ్రంగా ఉంటుందనడంలో సందేహం లేదు. కానీ ఆసియాకప్‌లో ఆధిపత్యాన్ని ప్రదర్శించిన తీరు కచ్చితంగా భారత జట్టు విశ్వాసాన్ని పెంచేదే.

ఫలితాన్నిచ్చిన మార్పులు!: ప్రొ లీగ్‌లో ఐరోపా అంచెలో ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో ఏడు ఓడిన నేపథ్యంలో ఆసియాకప్‌లో అడుగుపెట్టిన భారత జట్టు.. నెమ్మదిగా ఆరంభించింది. క్రమంగా పుంజుకుని.. ప్రతి మ్యాచ్‌కూ మెరుగవుతూ పోయింది. పూల్ దశలో చైనా (4-3), కొరియా (3-2)లను ఓడించడానికి కష్టపడ్డ హర్మన్‌ప్రీత్ బృందం.. కజకిస్థాన్‌ను 15-0తో ఓడించి జోరందుకుంది. సూపర్ 4లో కొరియా మ్యాచ్ (2-2) భారత్‌ను మళ్లీ పరీక్షించింది. అయితే ఆ తర్వాత మలేసియాను 4-1తో, చైనాను 7-0తో చిత్తు చేసి టాప్ ఫామ్‌ను అందుకుంది. ఫైనల్లో కొరియాను చిత్తు చేస్తూ టోర్నీని ఘనంగా ముగించింది. మరి టీమ్‌ఇండియా మెరుగైన ప్రదర్శనకు కారణమేంటి? కొందరు సీనియర్ ఆటగాళ్లను తప్పించి కుర్రాళ్లకు అవకాశం ఇవ్వడం సత్ఫలితాలనిచ్చింది. ప్రపంచకప్, ఆసియా గేమ్స్ నేపథ్యంలో మరిన్ని మార్పులు తప్పకపోవచ్చు. పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన జట్టులోని ముగ్గురు ఆటగాళ్లు షంషేర్ సింగ్, గుర్జంత్ సింగ్, నీలకంత శర్మలను తప్పించి మిడ్‌ఫీల్డర్ రాజిందర్ సింగ్, స్ట్రైకర్ శిలానంద్ లక్రాలకు అవకాశం కల్పించారు. ఈ ఎత్తుగడ ఫలించింది. ఈ



కుర్రాళ్లిద్దరూ చెరో గోల్ మాత్రమే చేసినప్పటికీ తమ ఆటతో ఆకట్టుకున్నారు. సుఖ్‌జీత్ సింగ్ (6 గోల్స్), 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్' అభిషేక్ (6), దిల్‌ప్రీత్ (4), వెటరన్ డిఫెండర్ అమిత్ రొహిదాస్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కూడా భారత్ విజయంలో కీలక పాత్ర పోషించారు. భారత ఆటగాళ్ల ఫిట్‌నెస్ కూడా గొప్పగా ఉంది. వేడి ఉక్కపోత పరిస్థితుల్లో భారత జట్టు 10 రోజుల వ్యవధిలో ఒత్తిడితో కూడిన మ్యాచ్‌లు ఏడు ఆడడం వాళ్ల అద్భుత ఫిట్‌నెస్‌కు నిదర్శనం. భారత జట్టు డిఫెన్స్, మిడ్‌ఫీల్డ్, ఫార్వర్డ్ మధ్య సమన్వయం కూడా బాగా మెరుగుపడడం సంతోషాన్నిచ్చే విషయమే. గోల్‌కీపింగ్‌లోనూ మెరుగుపడి, భారత్ ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే ప్రపంచకప్‌లో మెరుగైన ఫలితాలను సాధించొచ్చు.

# నన్నెందుకు శత్రువులా చూస్తున్నారు: మోహన్ లాల్



అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ (అమ్మ) అధ్యక్షురాలిగా శ్వేతా మేనన్ (%వాష్ట్రషవ్ష్ట్ను వీవఅశీఅ%) ఇటీవల ఎన్నికైన విషయం తెలిసిందే. అయితే, ఆమె కంటే ముందు ఆ పదవిలో ఉన్న మోహన్‌లాల్ తాను రాజీనామా చేసేందుకు దారితీసిన పరిస్థితుల గురించి తాజాగా మాట్లాడారు. తనతో పాటు, తన కార్యనిర్వాహక కమిటీలోని ఇతర సభ్యులను చాలామంది శత్రువుల్లా చూస్తున్నారన్నారు.
"అధ్యక్షుడు అనేది కేవలం ఒక పదవి. ఏదైనా సమస్య వస్తే దానికి అధ్యక్షుడు ఒక్కడే కారణమా? చాలామంది నాపై శత్రుత్వం పెంచుకున్నారు. అలా అని అందరూ నన్ను ద్వేషించారని నేను చెప్పడం లేదు. ఏదేమైనా నన్ను శత్రువులా ఎందుకు చూస్తున్నారో ఇప్పటికీ అర్థంకావడం లేదు. నాతోపాటు రాజీనామా చేసిన ఇతర వ్యక్తులు తిరిగి కమిటీలోకి వస్తారా, లేదా అనేది పూర్తిగా వారి నిర్ణయం. అధ్యక్షురాలిగా శ్వేతా మేనన్‌ను ఎన్నుకోవడం గొప్ప విషయం. ఎందుకంటే గతంలో మహిళలు చర్చించలేకపోయిన విషయాలు ఇప్పుడు వారు సంకోచం లేకుండా చర్చించుకోవచ్చు. 'అమ్మ'కు సపోర్ట్ ఇవ్వడానికి నేనెప్పుడూ సిద్ధంగానే ఉంటాను" అని తెలిపారు.
ఇక అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్‌కు నాయకత్వం వహించడానికి యువకులు ఎందుకు ముందుకురావడం లేదనే ప్రశ్నకు మోహన్‌లాల్ సమాధానమిచ్చారు. 'యువకులు ముందుకురావాలని మనం అనుకుంటే సరిపోదు. వారు బాధ్యత తీసుకోవడానికి సిద్ధంగా ఉండాలి. బహుశా వారికి అంత సహనం లేదేమో' అని తెలిపారు. మలయాళ చిత్ర పరిశ్రమపై జస్టిస్ హేమ కమిటీ గతేడాది ఓ నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ చిత్ర సీమలోపనిచేసే మహిళలు క్యాస్టింగ్ కౌచ్, లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారని ఆ నివేదికలో హేమ కమిటీ పేర్కొంది. దీంతో అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ అప్పటి అధ్యక్షుడు మోహన్‌లాల్ రాజీనామా చేశారు. ఆయనతో పాటు 17 మంది సభ్యులు ఉన్న మొత్తం పాలక మండలి తమ పదవుల నుంచి వైదొలిగింది.



# మనం అంతర్జాతీయ స్థాయికి చేరబోతున్నాం


'మాకు పరిమితులు ఉండొచ్చేమో కానీ... మా ఆశయాలకు లేవు. అందుకే ఇంత పెద్ద సినిమాని మేం చేయగలిగాం" అన్నారు తేజ సజ్జా. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'మిరాయ్'. రితికానాయక్ కథానాయిక. మంచు మనోజ్ ముఖ్యభూమిక పోషించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మించారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా సోమవారం రాత్రి విశాఖపట్నంలో విడుదలకి ముందస్తు వేడుక జరిగింది. బిగ్ టికెట్‌ని ఆవిష్కరించిన అనంతరం వేడుకని ఉద్దేశించి కథానాయకుడు తేజ సజ్జా మాట్లాడారు.
"ఈ సినిమాతో ఒక ప్రత్యేకమైన ప్రపంచాన్ని ఆవిష్కరిస్తున్నాం. యాక్షన్, అడ్వంచర్‌తోపాటు ఆశ్చర్యపోయే ఎన్నో విషయాలు ఉంటాయి. పిల్లలు మొదలుకొని అందరికీ నచ్చే సినిమా. మంచి సినిమా చేయాలనే ఒకే ఒక లక్ష్యంతో మేమంతా పనిచేశాం. తెలుగు చిత్ర పరిశ్రమలో ఒక నటుడు కావడమే పెద్ద విషయం. అలాంటిది చాలా దూరం వచ్చాను. ఆ విషయంలో ఆనందంగా ఉంది. ఇంకా ఎంతో దూరం వెళ్లాలి. అభిరుచి, తపన ఉన్న నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ ఈ సినిమా వెనకాల ఉండటంతోనే చేయగలిగాం. కార్తీక్ నాకు ఈ కథ చెప్పినప్పుడు, దీనివెనక ఇబ్బందులే చెప్పారు.
ఇప్పటివరకూ ఎవ్వరూ చేయలేదు, మనం చేయాల్సి వస్తుందన్నారు. ఇదే కదా మనం చేయాల్సింది, ఇదే కదా మన ప్రేక్షకులకు ఇవ్వాల్సిందని రంగంలోకి దిగాం. ఆ తర్వాత మనోజ్ అన్న వచ్చారు. భవిష్యత్తులో రాబోతున్న సినిమాలతో మనం అంతర్జాతీయ స్థాయికి చేరబోతున్నాం. కుటుంబ కథతో, కుటుంబం కోసం చేసిన ఈ సినిమాని అందరూ తక్కువ ధరలకే చూసేలా ఏర్పాట్లు చేశాం" అన్నారు తేజ సజ్జా.



# నా ఫొటోలు వాడొద్దు.. దిల్లీ హైకోర్టును ఆశ్రయించిన ఐశ్వర్యారాయ్

ప్రముఖ నటి ఐశ్వర్యారాయ్ మంగళవారం దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అనుమతి లేకుండా తన ఫొటోలను, పేరును ఉపయోగించేందుకు వీలులేకుండా ఆదేశాలివ్వాలని ఆమె న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. సంస్థలు/వ్యక్తులు ఐశ్వర్య పేరు, ఫొటోలు ఉపయోగించకుండా తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేస్తామని సూచించింది.కొందరు వ్యక్తులు ఐశ్వర్య ఫొటోలను మార్ఫింగ్ చేసి ఉపయోగించుకుంటున్నారని ఆమె తరఫు న్యాయవాది సందీప్ సేథి కోర్టుదృష్టికి తీసుకొచ్చారు. ఆమె ఫొటోలను టీ షర్ట్‌లపై కూడా ముద్రించి అమ్ముతూ డబ్బులు వసూలుచేస్తున్నారని వెల్లడించారు.

అనుమతి లేకుండా ఆమె చిత్రాలను ఉపయోగించుకొనే అధికారం ఎవరికీ ఉండదన్నారు. ఏఐతో ఐశ్వర్య చిత్రాలను క్రియేట్ చేసి యూట్యూబ్ ఛానల్స్ వారు అసభ్యకరమైన వీడియోలు చేస్తున్నారని న్యాయస్థానంలో వాదించారు. దీనికి సంబంధించిన పూర్తి ఆధారాలను కూడా కోర్టుకు సమర్పించినట్లు చెప్పారు. ఈ కేసుపై తదుపరి విచారణ వచ్చే ఏడాది జనవరి 15న జరగనుంది.ఇక గతంలో ఐశ్వర్య తన కుమార్తెపై వచ్చిన తప్పుడు కథనాల విషయంలోనూ దిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.



## తడిసి మోపెడు.. అప్పు చేసిన బోనీ కపూర్

# రూ.90 కోట్లు పెరిగిన బడ్జెట్..

ఏదైనా వేడుక చేయాలనుకుంటే.. చాలామంది ముందుగా ఖర్చు గురించే ఆలోచిస్తుంటారు. అనుకున్న బడ్జెట్‌లో ఈవెంట్ పూర్తయితే ఫుల్ హ్యాపీ. అదే తారుమారైతే.. ఖర్చు రెట్టింపు అయితే? వృత్తిపరంగా ప్రముఖ నిర్మాత బోనీ కపూర్ ) ఇలాంటి పరిస్థితే ఎదుర్కొన్నారు. ఓ సినిమాకి నిర్దేశించిన వ్యయం కన్నా.. ఒకట్రెండు కాదు ఏకంగా రూ.90 కోట్లు ఎక్కువ ఖర్చు పెట్టారు. కలెక్షన్స్ అంతంత మాత్రమే రావడంతో అప్పు చేయాల్సి వచ్చింది. ఆ చిత్రమే 'మైదాన్' తన డ్రీమ్ ప్రాజెక్టు మిగిల్చిన చేదు జ్ఞాపకాలను లేటెస్ట్ ఇంటర్వ్యూలో బోనీ కపూర్ గుర్తుచేసుకున్నారు.
వాటర్ బాటిళ్ల ఖర్చుతో చిన్న సినిమా తీయొచ్చు..
"కొవిడ్ రాక ముందే ఈ సినిమా చిత్రీకరణ దాదాపు 70 శాతం (2020 జనవరి నాటికి) పూర్తయింది. కొన్ని ఫుట్‌బాల్ మ్యాచ్‌లను 2020 మార్చి చివరిలో షూట్ చేయాలనుకున్నాం. దాని కోసం అంతర్జాతీయ టీమ్‌లు వచ్చాయి. అనూహ్యంగా లాక్‌డౌన్ ప్రకటించారు. విమాన ప్రయాణాలు రద్దయ్యాయి. కొన్ని నెలలపాటు లాక్‌డౌన్ పొడిగిస్తారని అనుకోలేదు. దీంతో, ఆ క్రీడాకారులందరికీ ముంబయిలోనే వసతి ఏర్పాటు చేశా. మ్యాచ్‌లను షూట్ చేసే సమయంలో సుమారు 800 మంది సెట్స్‌లో ఉండేవారు. తాజ్ హొటల్ నుంచి భోజనం తెప్పించే వాడిని. కొవిడ్ నిబంధనలను దృష్టిలో పెట్టుకుని.. నాలుగు అంబులెన్స్‌లు, పలువురు వైద్యులను అందుబాటులో ఉంచాం. ఎక్కువ మంది కలిసి తినేందుకు అప్పుడు వీల్లేదు. దూరం పాటించాల్సి రావడంతో ఎక్కువ టెంట్లు కూడా ఏర్పాటు చేయాల్సి వచ్చింది. మంచి నీళ్ల బాటిళ్లకే కొంత బడ్జెట్ కేయించామంటే పరిస్థితి ఎలా ఉండేదో అర్థం చేసుకోండి. ఆ డబ్బుతో ఓ చిన్న సినిమాని నిర్మించొచ్చు"
తుపాను తెచ్చిన తంటా..
"కొన్ని కీలక సన్నివేశాలు తెరకెక్కించేందుకు చిత్ర బృందం బ్యాంకాక్ వెళ్లింది. అక్కడా వ్యయం పెరిగింది.
ఇది చాలదన్నట్టుగా.. ముంబయిలో రూపొందించిన ఫుట్‌బాల్ స్టేడియం సెట్ తుపాను వల్ల కొట్టుకుపోయింది. ఈ బాధలను ఎవరితో పంచుకోగలను? రూ.120 కోట్ల బడ్జెట్ అనుకుంటే.. సినిమా పూర్తయ్యే నాటికి అది రూ.210 కోట్లు అయింది. ఇన్ని ఒడిదొడుకుల ప్రయాణం చేసిన ఈ సినిమా 2024లో విడుదలై, ఫ్లాప్ అయింది. నా పరిస్థితి అర్థం చేసుకున్న చిత్ర బృందంలోని కొందరు తమ పారితోషికంలో 15 శాతం తగ్గించుకున్నారు. ఇలా జరగడం విధి. ఎవరినీ నిందించలేం" అని భావోద్వేగంతో మాట్లాడారు.భారత ఫుట్‌బాల్ కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీమ్ జీవితాధారంగా దర్శకుడు అమిత్ శర్మ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సయ్యద్ పాత్రను అజయ్ దేవ్‌గణ్ పోషించారు. రూ.68 కోట్ల కలెక్షన్స్‌కు పరిమితమైంది.

# ఈ కథకి రామాయణమే స్ఫూర్తి

భయపెడుతూనే... మా కథతో ఓ మంచి విషయాన్ని చెప్పే ప్రయత్నం చేశామన్నారు కౌశిక్ పెగల్లపాటి. ఆయన దర్శకత్వంలో బెల్లంకొండ సాం -



ంశ్రీనివాస్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'కిష్కింధపురి'. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా దర్శకుడు కౌశిక్ పెగల్లపాటి సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడారు.
"నాకు హారర్ సినిమాలంటే చాలా ఇష్టం. ఆ జానర్‌కి ఒక ప్రత్యేకమైన అభిమాన గణం ఉంది. ఆ ప్రేక్షకుల్ని లక్ష్యంగా చేసుకుని, అందరినీ ఒకసారి భయపెట్టే ఓ సినిమా చేయాలని ఎప్పట్నుంచో ఉండేది. హారర్, మిస్టరీని మేళవించి రాసుకున్న కథే 'కిష్కింధపురి'. నా తొలి సినిమా 'చావు కబురు చల్లగా' తర్వాత గీతా ఆర్ట్స్‌లోనే మరో సినిమా చేయాలనుకున్నా. అయితే ఆ చిత్రం కొన్ని కారణాలతో ఆలస్యమైంది. ఆ సందర్భంలోనే నిర్మాత సాహు గారపాటికీ, కథానాయకుడు బెల్లంకొండ సాయిశ్రీనివాస్‌కీ కథని వినిపించా. ప్రేక్షకులకు వినోదం పంచడంతోపాటు, ఏదైనా కొత్త విషయం చెప్పాలని ఉంటుంది. తొలి సినిమాలో అదే ప్రయత్నం చేశా. 'కిష్కింధపురి' సినిమాతో చెప్పిన ఆ కొత్త అంశం ఏమిటన్నది తెరపైనే చూడాలి".
"కిష్కింధపురి' అనగానే మనందరికీ రామాయణం గుర్తొస్తుంది. ఈ కథకి స్ఫూర్తి రామాయణమే. అదంతా ఒక రూపకంలా కథలో మిళితమై ఉంటుంది. ఒక రేడియో స్టేషన్‌కి వెళ్లడంతో జరిగే కథ ఇది. 1989 నేపథ్యంలో సాగుతుంది. అప్పటి వాతావరణాన్ని సృష్టించి చిత్రీకరణ చేశాం.

# 'రంగీలా' ఓ గొప్ప అనుభూతి : ఊర్మిళ

%ఊర్మిళ కెరీర్‌లో గొప్పగా నిలిచిపోయిన చిత్రం 'రంగీలా'. రామ్ గోపాల్‌వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా విడుదలై 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఊర్మిళ ఇన్‌స్టా వేదికగా ఈ చిత్రంతో తన అనుబంధాన్ని పంచుకుంది. అంతేకాదు ఆమె, ఆమిర్ ఖాన్ నటించిన ఈ సినిమాలోని 'రంగీలారే' అనే పాటకి స్టెప్పులేస్తూ ఒక వీడియోను పోస్ట్ చేసింది. "ఇది కేవలం సినిమా కాదు. ఒక గొప్ప అనుభూతి. ప్రతి సన్నివేశం అద్భుతమైన ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. ప్రతి పాట కేవలం సంగీతం కాదు నవరసాల వేడుక. ముప్పై సంవత్సరాల క్రితం 'రంగీలా' మీలో ప్రతి ఒక్కరినీ ఆకర్షించిందని నేను కచ్చితంగా అనుకుంటున్నాను. నేటికీ అది మిమ్మల్ని ఆ మొదటి క్షణానికి తీసుకెళ్లే శక్తిని కలిగి ఉంది. నన్ను మీ జీవితాల్లో భాగం చేసుకుని, ప్రేమతో ఆలింగనం చేసుకున్నందుకు.. కలలకనే ధైర్యం చేయగల స్థానంలో ఉంచినందుకు ధన్యవాదాలు. మీ ప్రేమ నా ప్రయాణంలో గొప్ప ఆశీర్వాదం. ధన్యవాదాలు' 'అని ఆ పోస్ట్‌లో రాసుకొచ్చింది.



# నా హృదయాన్ని దొంగిలించి వెళ్లిపోకు

టీ సిరీస్ సమర్పణలో రాబోయే కామెడీ థ్రిల్లర్ చిత్రం 'ఏక్ చతుర్ నార్'. నీల్ నితిన్ ముఖేశ్, దివ్య ఖోస్లా, రజనీష్ దుగ్గల్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకి ఉమేశ్ శుక్లా దర్శకత్వం వహించారు. ఆశిష్ వాఘ్, జీహాన్ అహ్మద్ నిర్మించారు. కామెడీ థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 12న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ఈ సినిమా నుంచి 'గులాబీ సావరియా' అనే గీతాన్ని విడుదల చేసింది. ఈ పాటలో దివ్య ఖోస్లా గ్లామరస్ దేశీ లుక్‌లో కనిపిస్తూ.. "నీ ప్రేమ నన్ను దోచుకుంది..వెళ్లిపోకు నా ప్రియతమా. నువ్వు నన్ను చాలా ఇబ్బంది పెట్టావు.. నా హృదయాన్నే దొంగలించావు" అంటూ రజనీష్ దుగ్గల్‌తో వేసిన స్టెప్పులు ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ సినిమాలో సుశాంత్ సింగ్, జాకీర్ హుస్సేన్, యశ్‌పాల్ శర్మ కీలకపాత్రలు పోషిస్తున్నారు.





# మీకు లక్షల్లో మెజారిటీ ఎలా వస్తోంది?..

ఢిల్లీ, సెప్టెంబరు 09, (భారత శక్తి) : ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. సీఆర్ పాటిల్ పోటీ చేసిన తొలి ఎన్నిక నుంచి గత నాలుగు విడతలుగా ఘనవిజయాలు సాధిస్తూ, అంతకంతకు మెజారిటీ పెంచుకుంటూ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేయడంపై మంత్రి లోకేశ్ అభినందించారు. ఇంతలా ప్రజల అభిమానాన్ని చూరగొనడం వెనుక విజయ రహస్యం ఏమిటని వాకబు చేశారు. ఈ సందర్భంగా పాటిల్ బదులిచ్చారు. అనునిత్యం ప్రజలతో మమేకం అవుతూ.. వారితోనే ఉండటమే తన విజయ రహస్యమని చెప్పారు. "పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాల అమలుతో పాటు నవసారిని దేశంలోనే మొదటి స్మోక్‌లెస్ జిల్లాగా తీర్చిదిద్దాం. సూరత్ నగర అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాం. వస్త్ర-వజ్ర పరిశ్రమలకు విధానాలు, మౌలిక వసతులు, సూరత్ విమానాశ్రయాన్ని అంతర్జాతీయ సౌకర్యాలతో అభివృద్ధి చేశాం. నవసారి పరిధిలోని చిఖ్లీ గ్రామ పంచాయతీని సన్సద్ ఆదర్శ్ గ్రామ యోజన కింద అభివృద్ధి చేయగా, అది దేశంలోనే ఆదర్శంగా నిలిచింది. రెండో దశ కొవిడ్ సమయంలో, రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ కార్యకర్తల ద్వారా కోవిడ్ కేర్ సెంటర్లను ప్రారంభించి సేవలందించాం" అని పాటిల్ వివరించారు. గుజరాత్ లోని నవసారి లోక్ సభ నియోజకవర్గం ఎంపీగా 2009 నుంచి వరుసగా నాలుగు సార్లు సీఆర్ పాటిల్ ఎన్నికయ్యారు. 2009 లోక్ సభ ఎన్నికల్లో నవసారి నుంచి పోటీ చేసిన సీఆర్ పాటిల్ 1,32,643 ఓట్లతో నెగ్గారు. 2014లో 5,58,116 ఓట్ల మెజారిటీతో దేశంలో 3వ స్థానం, 2019లో 6,88,668 ఓట్ల మెజారిటీతో దేశంలో అగ్రస్థానం, 2024 ఎన్నికల్లో 7,73,551 ఓట్ల భారీ మెజారిటీతో దేశంలో నాలుగో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఇక, ఈ భేటీలో భాగంగా, ఆంధ్రప్రదేశ్‌లో గత 15 నెలలుగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి కూడా లోకేశ్ కేంద్రమంత్రికి వివరించారు.

# ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ఘన విజయం

**ఢిల్లీ, హైదరాబాద్, సెప్టెంబర్ 09 ( భారత శక్తి ):** ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ విజయం సాధించారు. మొత్తం 781 మంది సభ్యులకు గాను 767 మంది పార్లమెంటు సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 98.2గా నమోదైంది. సీపీ రాధాకృష్ణన్‌కు 452 మొదటి ప్రాధాన్యత ఓట్లు రాగా, ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు లభించాయి. 15 ఓట్లు చెల్లనివిగా రిటర్నింగ్ అధికారి పీసీ మోదీ వెల్లడించారు. పార్లమెంటు నూతన భవనంలోని ఎఫ్ 101 వసుధలో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. సాయంత్రం 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. ఉపరాష్ట్రపతి ఎన్నికలకు బీఆర్ఎస్, బీజేడీ, శిరోమణి అకాలీదళ్ సభ్యులు దూరంగా ఉన్నారు. మొత్తమ్మీద 152 ఓట్ల మెజారిటీతో సీపీ రాధాకృష్ణన్ విజయం అందుకున్నారు.

# కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తో సీఎం రెడ్డి భేటీ

ఢిల్లీ, సెప్టెంబరు 09, (భారత శక్తి) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఢిల్లీలో సమావేశమయ్యారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లతో పాటు, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న విద్యా పథకాలకు కేంద్ర సహకారం కోరుతూ ఆయన రెండు కీలక ప్రతిపాదనలను కేంద్ర మంత్రి ముందుంచారు. ఈ సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు, రాష్ట్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. గత ప్రభుత్వం వివిధ పథకాల పేరుతో విచక్షణారహితంగా అధిక వడ్డీలకు చేసిన అప్పులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పెనుభారంగా మారాయని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు. ఈ అధిక వడ్డీల భారం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు ప్రస్తుతం ఉన్న అప్పులను రీస్ట్రక్చరింగ్ (పునర్వ్యవస్థీకరణ) చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో కేంద్రం సానుకూలంగా స్పందించి, రాష్ట్రానికి సహకరించాలని కోరారు. అదేవిధంగా, రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని సీఎం తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 105 నియోజకవర్గాల్లో 'యంగ్ ఇండియా మోడల్ స్కూళ్ల'ను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని కేంద్రం అందించాలని నిర్మలా సీతారామన్‌ను ఆయన అభ్యర్థించారు. ఈ రెండు అంశాలపై కేంద్రం నుంచి సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నట్లు సమావేశం అనంతరం సీఎం పేర్కొన్నారు.

# ఏపీ అభివృద్ధి పరుగులు పెడుతోంది..

తిరుమల, సెప్టెంబరు 09, (భారత శక్తి) : ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నారని తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రశంసలు కురిపించారు. రాష్ట్రాభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ లక్షల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నారని, చంద్రబాబు వాటిని సమర్థంగా వినియోగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఉదయం తన పుట్టినరోజు సందర్భంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించిందని, పరిస్థితి పూర్తిగా తలకిందులైందని అన్నారు. "గతంలో ఏపీలో ఆస్తులు అమ్ముకుని హైదరాబాద్ వచ్చేవారు. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. తెలంగాణకు చెందినవారే ఇప్పుడు ఏపీలో ఆస్తులు కొంటున్నారు, వ్యాపారాలు చేస్తున్నారు" అని ఆయన వివరించారు. ప్రతి ఏటా తన పుట్టినరోజునాడు స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ అని మల్లారెడ్డి తెలిపారు. గతేడాది తాను యూనివర్సిటీలు కావాలని స్వామిని కోరుకున్నానని, ఇప్పుడు దేశంలోనే మూడు పెద్ద డీమ్డ్ యూనివర్సిటీలను నడుపుతున్నానని గుర్తు చేసుకున్నారు. అదే సమయంలో తెలంగాణలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కూడా ఆయన మాట్లాడారు. "కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణలో దేశంలో ఎక్కడా జరగనంత అభివృద్ధి జరిగింది. కేటీఆర్ ఎన్నో మల్టీ నేషనల్ కంపెనీలను హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. మళ్లీ కేసీఆర్ అధికారంలోకి వస్తేనే తెలంగాణకు ఆ పాత రోజులు తిరిగి వస్తాయి" అని మల్లారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# అల్లకల్లోలంగా నేపాల్

నేపాల్, సెప్టెంబరు 09: పొరుగు దేశమైన నేపాల్‌లో హింసాత్మక ఆందోళనలు తీవ్ర రూపం దాల్చాయి. నిరసనకారులు, పోలీసుల మధ్య జరిగిన ఘర్షణల్లో 19 మంది ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది గాయపడ్డారు. ఈ పరిణామాల నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. నేపాల్‌లో నివసిస్తున్న భారత పౌరులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, స్థానిక అధికార యంత్రాంగం జారీ చేసే మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఈరోజు హెచ్చరించింది. నేపాల్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. "నిన్నటి నుంచి నేపాల్‌లో జరుగుతున్న ఘటనలు మమ్మల్ని తీవ్రంగా కలచివేశాయి. ఎంతో మంది యువకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. మృతుల కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాము" అని పేర్కొంది. స్నేహపూర్వక పొరుగు దేశంగా, సంబంధిత వర్గాలన్నీ సంయమనం పాటిస్తూ, శాంతియుత చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ఆశిస్తున్నట్లు భారత్ తెలిపింది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా నేపాల్ రాజధాని ఖాట్మండుతో పాటు పలు ప్రధాన నగరాల్లో అధికారులు కర్ఫ్యూ విధించారు. ఈ నేపథ్యంలో భారతీయులు ఎలాంటి సమూహాల్లో పాల్గొనవద్దని, అనవసర ప్రయాణాలకు దూరంగా ఉండాలని విదేశాంగ శాఖ సూచించింది. సోషల్ మీడియాపై ప్రభుత్వం విధించిన నిషేధాన్ని ఎత్తివేసిన మరుసటి రోజే... నిరసనలు మళ్లీ హింసాత్మకంగా మారడంతో అధికారులు ఖాట్మండు రింగ్ రోడ్ పరిధిలో నిరవధిక కర్ఫ్యూను అమలు చేస్తున్నారు. కర్ఫ్యూ సమయంలో నిరసనలు, సమావేశాలు, సభలపై పూర్తి నిషేధం విధించినట్లు ఖాట్మండు జిల్లా అధికారి ఛబిలాల్ రిజాల్ వెల్లడించారు. ప్రభుత్వం అవినీతిని అరికట్టడంలో, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైందంటూ "జెన్ Z" యువత పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తోంది. దీనికి తోడు ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికలపై ప్రభుత్వం నిషేధం విధించడం వారి ఆగ్రహానికి మరింత ఆజ్యం పోసింది.

# తొలి త్రైమాసికంలో రెండంకెల వృద్ధి

అమరావతి, సెప్టెంబరు 09, (భారత శక్తి) : సుస్థిర ఆర్థిక వ్యవస్థ సాధించేందుకు వృద్ధి లక్ష్యాలను ఎప్పటికప్పుడు అంచనా వేసుకోవాలని, త్రైమాసిక ఫలితాలకు తగ్గట్టు తదుపరి కార్యాచరణ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో జీఎస్డీపీపై రాష్ట్ర ప్రణాళిక శాఖ సమర్పించిన 202526 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసిక వృద్ధి అంచనాలను సీఎం పరిశీలించారు. రెండంకెల వృద్ధిపై సంతృప్తి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి, ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యంగా పెట్టుకున్న 17.1 శాతం వృద్ధి సాధనకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఎంత లక్ష్యం నిర్దేశించుకున్నాం, ఏమేరకు ఫలితాలు సాధించాం అనేది విశ్లేషించుకోవాలన్నారు.

**అన్ని రంగాల వృద్ధికి ప్రత్యేక అధ్యయనం**

సుదీర్ఘ సముద్రతీరం, పుష్కలంగా జలవనరులు, మెరుగైన మౌలిక వసతులు ఇలా ఎన్నో అంశాలు రాష్ట్రాభివృద్ధికి తోడ్పడతాయని ముఖ్యమంత్రి అధికారులతో అన్నారు. కొన్ని రంగాలు ఎందుకు పురోగతి సాధించడం లేదనే దానిపై కారణాలు తెలుసుకునేందుకు నిపుణులతో ప్రత్యేకంగా అధ్యయనం జరపాలన్నారు. పర్యాటక రంగంలో ప్రస్తుతం సాధించిన 17.08 శాతం పురోగతి సరిపోదని... ఈ రంగంలో 25 శాతం వృద్ధికి అవకాశం ఉందన్నారు. వృద్ధిలోనూ అంతర్జాతీయ లక్ష్యాలను అందుకోవాలన్నారు. రైల్వేస్, ట్రాన్స్‌పోర్ట్, హోటళ్లు, కమ్యూనికేషన్స్, బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్, రియల్ ఎస్టేట్ వంటి రంగాలపై దృష్టి పెట్టాలని చెప్పారు. శాఖలు, రంగాలు, నియోజకవర్గాల వారీగా జీఎస్డీపీ వివరాలను మరింత లోతుగా నమోదు చేయాలని అన్నారు.

**పరిశ్రమల రంగంలో అత్యధిక వృద్ధి**

జాతీయ సగటును మించి 202526 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో జీఎస్డీపీలో వృద్ధి నమోదైందని రాష్ట్ర ప్రణాళికా విభాగం అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీని విలువ రూ.3,57,894 కోట్లుగా వెల్లడించారు. గత ఏడాది ఇదే కాలంలో రాష్ట్రంలో 9.58 శాతం వృద్ధి నమోదు కాగా, ఈ ఏడాది 10.50 శాతం సాధ్యమైందన్నారు.
ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో దేశ జీడీపీ వృద్ధి రేటు 8.8 శాతం ఉంటే, దాని కంటే అధికంగా గణనీయమైన ప్రగతిని కనబరచడం రాష్ట్రం ఆర్థికంగా బలోపేతమైందనే విషయాన్ని రుజువు చేస్తోందన్నారు. ఏపీ జీఎస్డీపీ వృద్ధిని రంగాలవారీగా పరిశీలిస్తే పరిశ్రమల శాఖలో 11.91 శాతం, సేవల రంగంలో 10.70 శాతం, వ్యవసాయ రంగంలో 9.60 శాతం, జీవీఏ 10.76 శాతం వృద్ధి కనిపిస్తోందని తెలిపారు.

**అధికారులు తెలిపిన వివరాలు...**

వ్యవసాయం, అనుబంధ రంగాలు: తొలి త్రైమాసికంలో ప్రస్తుత ధరల్లో పశుపోషణ ఉత్పత్తి విలువ రూ.46,751 కోట్లు (6.65% వృద్ధి), చేపల పెంపకం ఆక్వాకల్చర్ రూ.32,110 కోట్లు (14.52% వృద్ధి), మాంసం ఉత్పత్తి 3.15 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 3.41 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగింది (8% వృద్ధి), గుడ్ల ఉత్పత్తి 62,157 లక్షల నుంచి 67,450 లక్షలకు పెరిగింది. పరిశ్రమల రంగం: మైనింగ్ క్వారీయింగ్‌లో రూ.10,686 కోట్లు (43.54% వృద్ధి), తయారీ రంగం రూ.40,515 కోట్లు (9.93% వృద్ధి), నిర్మాణ రంగం రూ.31,550 కోట్లు (9.57% వృద్ధి), రోడ్ మెటల్, బ్లాక్ గ్రానైట్, కలర్ గ్రానైట్ ఉత్పత్తి పెరిగింది. సేవా రంగం: హోటళ్లు, రవాణా పర్యాటక రంగం రూ.25,702 కోట్లు (17.92% వృద్ధి), రియల్ ఎస్టేట్ ప్రొఫెషనల్ సర్వీసులు రూ.34,324 కోట్లు (11.70% వృద్ధి), పర్యాటకులు 6.89 కోట్ల నుంచి 8.07 కోట్లకు పెరిగారు (17.08% వృద్ధి), విమాన ప్రయాణికులు 13.09 లక్షల నుంచి 15.85 లక్షలకు పెరిగారు (21.1% వృద్ధి).



# ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా.. హామీలను నెరవేరుస్తున్నాం: పొంగులేటి

కూసుమంచ, సెప్టెంబరు 09 (భారత శక్తి) : రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం రూ.8.19 లక్షల కోట్లు అప్పు చేసిందని, పేదవారికి కష్టం కలగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు. రాబోయే మూడేళ్లలో అర్హులైనవారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి పర్యటించారు. కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెంలో రూ.20 లక్షలతో నిర్మించిన పంచాయతీ కార్యాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. నర్సింహులగూడెం గ్రామంలో కిష్టాపురం నుంచి నర్సింహులగూడెం వరకు రూ.1.33 కోట్లతో చేపట్టనున్న పీఆర్ రోడ్డు మరమ్మతులకు శంకుస్థాపన చేశారు. వీటితోపాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు.

# కుప్పకూలిన గురుకుల పాఠశాల భవనం..

## ముగ్గురు విద్యార్థులకు గాయాలు

సంగారెడ్డి, సెప్టెంబరు 09, (భారత శక్తి) : సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి గ్రామంలోని గురుకుల పాఠశాలలోని పాత డార్మిటరీ బ్లాక్ మంగళవారం మధ్యాహ్నం కుప్పకూలింది. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పాఠశాల భవనాన్ని 1984లో నిర్మించారు. ఇందులో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు 601 మంది విద్యార్థులు చదువుతున్నారని కలెక్టర్ తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో విద్యార్థులంతా తరగతి గదిలో ఉండటంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. ఆ సమయంలో హాస్టల్ భవనం పక్కగా వెళ్తున్న ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయని చెప్పారు. గాయపడిన విద్యార్థులను జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. ఎస్డీఆర్ఎఫ్ బృందం ఘటనాస్థలిలో శిథిలాల తొలగింపు పనులు చేపట్టింది. శిథిలాల కింద ఉన్న విద్యార్థుల సామగ్రిని సిబ్బంది వెలికి తీస్తున్నారు. అందుబాటులో ఉన్న తరగతి గదులు, హాస్టల్ గదుల్లో విద్యార్థులకు తాత్కాలిక వసతి ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. గురుకుల పాఠశాలకు నూతన హాస్టల్ భవన నిర్మాణం కోసం రూ.7 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం పాఠశాలలో పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, విద్యార్థుల భద్రతకు ఎలాంటి సమస్యలు లేవని కలెక్టర్ తెలిపారు.




# 111 జీఓ పరిధిలో అక్రమ నిర్మాణాలు..


- భవిష్యత్ నీటి భద్రతకు సంభవించనున్నపెను ముప్పు..
- మొయినాబాద్, రాజేంద్రనగర్, చేవెళ్ల, షాబాద్, శంకరపల్లి, గండిపేట్, కొత్తూరు మండలాల్లో తీవ్ర ప్రభావం..
- సుమారు 1,32,000 ఎకరాలు 111 జీఓ పరిధిలో భూములపై ఎఫెక్ట్..
- భాగ్యనగరంలో నానాటికీ పెరుగుతున్న నీటి అవసరాలు..
- భూగర్భ జలాలు అడుగంటిపోతే జనాల గొంతులు ఎండిపోవడం ఖాయం..
- దురాక్రమణ జరుగుతున్నా అధికారుల్లో సోయి లేదు..
- లంచాలు తీసుకుంటూ చూసి, చూడనట్లు వ్యవహరిస్తున్న వైనం..
- ఎక్కువ శాతం రాజకీయనాయకులు, అక్రమార్కులైన నిర్మాణదారుల హస్తం..
- అడ్డగోలుగా కబ్జాలు చేయడం, భారీ నిర్మాణాలు చేపట్టడం..
- ఈ నిర్మాణాల్లో కొనుగోలు చేసిన అమాయకుల జీవితాలు ఆగమాగం..
- చెరువులు దురాక్రమణకు గురి అవుతున్నా మొద్దునిద్రల్లోవుతున్న హైడ్రా..
- చెరువులను రక్షిస్తాం.. ప్రజలను కాపాడతాం, పర్యావరణాన్ని రక్షిస్తాం అని చెప్పడం తప్ప చేసింది ఏమీ లేదు..
- అక్రమార్జనకు అలవాటు పడ్డ అధికారులు, నిర్మాణదారులు, ప్రభుత్వ పెద్దలున్నంతకాలం ఇదే పరిస్థితి..
- 111 జీఓ దురాక్రమణలపై సమరశంఖం పూరిస్తోంది " ఫోరం ఫార్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "...

(స్పెషల్ కరస్పాండెంట్)

హైదరాబాద్, సెప్టెంబర్ 09 (భారత శక్తి) : అసలు జీఓ 111 ఉద్దేశం మహోన్నతమైనది..




ఈ జీవో ప్రకారం చెరువులు, సరస్సుల పరిధిలోని 10 కిలోమీటర్ల లోపల ఎటువంటి భారీ భవన నిర్మాణాలు, పరిశ్రమలు, రియల్ ఎస్టేట్ లేఅవుట్లు,





కాలుష్యం సృష్టించే ప్రాజెక్టులు ఉండకూడదు. కారణం ఏమిటంటే భూగర్భ జలాలు, చెరువులు, సరస్సుల నీరు కలుషితం కాకుండా చూడటం. అంటే, ఈ జీఓ ఒక రకంగా హైదరాబాద్ భవిష్యత్ నీటి భద్రతకు రక్షణ కవచంగా నిలుస్తుంది..

కానీ వాస్తవ పరిస్థితి భిన్నంగా వుంది.. కాగితాలపై ఉన్న ఈ రక్షణ కవచం వాస్తవ జీవితంలో క్రమంగా చిల్లులు పడి పోతోంది.

ప్రభావశీలులు, మేధావుల సహకారంతో రియల్ ఎస్టేట్ మాఫియా విల్లా ప్రాజెక్టులు, ఫార్మ్ హౌస్‌లు, రిసార్ట్‌లు విస్తరిస్తోంది. ఇక అక్రమ లేఅవుట్లకు గ్రామ పంచాయతీలు, స్థానిక నాయకులు అనుమతులు ఇచ్చే ఉదంతాలు కూడా ఇబ్బడి ముబ్బడిగా బయటపడుతున్నాయి.


ఒకవైపు అధికారులు అక్రమ నిర్మాణాలపై కూల్చివేత చర్యలు చేపడుతున్నట్లు చూపించినా, మరోవైపు పెద్ద స్థాయి నిర్మాణాలను కనీసం టచ్ చేయడానికి కూడా వెనుకంజ వేస్తున్నారన్నది కళ్ళముందు కనిపిస్తోంది..

దీనివల్ల విపరీతమైన దుష్ప్రభావాలు ఏర్పడుతున్నాయి.. చెరువులు, సరస్సులపై డైరెక్టుగా ప్రభావం చూపిస్తోంది.. మురుగునీటి ప్రవాహం పెరిగి నీటి నాణ్యత తగ్గుతోంది. భూగర్భ జలాల సమస్యఅధికమవుతోంది.. అధిక కాంక్రీటీకరణ వల్ల నీరు నేలలోకి చొచ్చుకుపోకపోవడం. నగర నడిబొడ్డులో సైతం వరద ప్రమాదాలు సంభవిస్తున్నాయి.. ప్రజల భవిష్యత్ నీటి అవసరాలు మృగ్యమై పోతున్నాయి.. హైదరాబాద్‌కు రాబోవు 20, 30 ఏళ్లలో తాగునీరు సరఫరా చేయడం కష్టమవుతుంది. చట్టాల పట్ల విపరీతమైన నిర్లక్ష్యం ఏర్పడుతోంది.. ప్రభుత్వ ఉత్తర్వులు, కోర్టు తీర్పులు ఉన్నా అవి అమలవడం మాత్రం జరగడం లేదు..

ఈ వ్యవహారంపై నిపుణులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.. పర్యావరణ నిపుణుల మాటల్లో.. "జీవో 111 రద్దు చేయడం గాని, ఉల్లంఘనలను పట్టించుకోకపోవడం గాని భవిష్యత్‌లో హైదరాబాద్‌ను నీటి సంక్షోభంలోకి నెట్టివేస్తుంది..

కాగా స్థానిక రైతులు, పర్యావరణ కార్యకర్తలు, సంఘాలు ఈ అక్రమ నిర్మాణాలను ఆపాలని, ఇప్పటికే నిర్మించిన కట్టడాలను కూల్చాలని పట్టుదలతో డిమాండ్ చేస్తున్నారు. "ఇది కేవలం పర్యావరణ సమస్య కాదు, మన భవిష్యత్ తరాల జీవనాధార సమస్య" అని వారు చెబుతున్నారు.

111 జీఓ కేవలం ప్రభుత్వ ఉత్తర్వు మాత్రమే కాదు, అది హైదరాబాద్ నీటి భద్రతకు బలమైన కంచె. కానీ ఈ కంచెను రాజకీయ ప్రయోజనాలు, రియల్ ఎస్టేట్ ఆశలు చెరిపేస్తున్నాయి. అక్రమ నిర్మాణాలను అరికట్టకపోతే రాబోయే తరాలు



తాగునీటి కోసం తహతహలాడే పరిస్థితి తప్పదు. కాబట్టి ప్రభుత్వం, ప్రజలు, పర్యావరణ సంస్థలు కలసి ఈ ఉల్లంఘనలను ఆపి హైదరాబాద్ భవిష్యత్‌ను కాపాడాల్సిన అవసరం అత్యవసరం అన్నది తెలుసుకోవాలి..

# ఏసీబీకి పట్టుబడిన టీపీఓ

హైదరాబాద్, సెప్టెంబర్ 09 (భారత శక్తి) : నార్సింగి మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి మణిహారిక 4 లక్షల లంచం స్వీకరిస్తూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ సంఘటన బుధవారం జరిగింది. పూర్తివివరాల్లోకెళితే నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల గ్రామానికి చెందిన వినోద్ అనే వ్యక్తి ప్లాట్‌కి సంబంధించిన ఎల్‌ఆర్‌ఎస్‌ను క్లియర్ చేయడానికి టౌన్ ప్లానింగ్ అధికారి మణిహారిక 10 లక్షలు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. బాధితుడు ఈ విషయాన్ని ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు మున్సిపల్ కార్యాలయంలో రెక్కీ వేశారు. తర్వాత రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి ఆమెను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అధికారులు ప్రస్తుతం విచారణ



కొనసాగిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# మున్సిపల్ కమిషనర్ అవినీతికి బలైన ఇద్దరు టీ.పీ.వోలు

* **అవినీతి అనకొండ నార్సింగ్ మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి..**
* **ఈయన అవినీతికి ఔటైపోయిన టిపిఓ మణిహారిక, టిపిఓ అశోక్..**
* **టీజీ బి పాస్, బిల్డ్ నౌ లో ఉన్న లోపాలే వీరికి ఆయుధాలు..**
* **అడ్డదారిలో లక్షలు దోచుకుని కోట్లకు పడగలెత్తిన అవినీతి అధికారులు..**

పాలించే ప్రభుత్వాలు ప్రజా ఉపయోగార్థం ఏదైనా ఒక చట్టం తీసుకువచ్చినప్పుడు గానీ, సాంకేతికతను తీసుకుని వచ్చినప్పుడు గానీ, అందులో ఎదురయ్యే లోటుపాట్లు ముందుగానే నిపుణులచేత పూర్తిగా సమీక్షించి ముందు ముందు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా, ఏ ఒక్కరుకూడా ఇందులో అవినీతి చేయడానికి వీలులేకుండా రూపొందించాల్సి ఉంటుంది.. కానీ ప్రభుత్వ పెద్దలు భేషజానికి పోయి, తామే ప్రజలకోసం ఏదో చేశామని చెప్పడంకోసం హడావుడిగా, మిడి మిడి జ్ఞానంతో జీరో పారదర్శకతతో టీజీ బీపాస్, బిల్డ్ నౌ లాంటి పోర్టల్ లను తీసుకుని వస్తున్నారు.. కానీ అలాంటి పోర్టల్ లోని లోపాలను తమకు అనుగుణంగా మార్చుకున్న కొందరు అతి తెలివి, అవినీతి అధికారులు అడ్డదారుల్లో లక్షలకు లక్షలు దోచుకుంటూ అమాయకులైన ప్రజలను నట్టేట ముంచుతున్నారు.. దీనికి ఉదాహరణే నార్సింగి మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున జరుగుతున్న అవినీతి వ్యవహారం..

హైదరాబాద్, సెప్టెంబర్ 09 (భారత శక్తి) : అవినీతికి కేరాఫ్ నర్సింగ్ మున్సిపాలిటీ మొన్న మొన్ననే బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు జారీ చేసి ఎన్ఐఏ కు దొరికిన నర్సింగ్ మున్సిపాలిటీ ఉద్యోగి. ప్రముఖ మీడియా మాధ్యమాల్లో సోషల్ మీడియా మాధ్యమంలో కేంద్ర బిందువైన నర్సింగ్ మున్సిపాలిటీ మళ్లీ నేడు పైకి రావడం గమనార్హం.. అది 111 జీఓ జంట జలాశయాల పరివాహక ప్రాంతం. పదుల సంఖ్యలో అక్రమ వెంచర్లు , వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు అక్కడ వెలుస్తున్నాయి.. వెలిశాయి కూడా.. మరీ ప్రత్యేకంగా నార్సింగ్ మున్సిపాలిటీలో వందల అక్రమ నిర్మాణాలపై రాతపూర్వక ఫిర్యాదులు అందాయి.. కాగా ఇదే అదునుగా మున్సిపల్ కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులను ఉసిగొల్పి టేబుల్ కింద నుంచి లక్షల్లో లంచాలు తీసుకొని కోట్లకు పడగలెత్తాడు.. ఇది జరుగుతున్న యదార్థం..

* **మున్సిపల్ కమిషనర్ అవినీతికి బలైన ఇద్దరు టీ.పీ.వోలు :**

నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి




అంటే అవినీతికి బ్రాండ్ అంబాసిడర్.. టీఎన్జీవో కమిషనర్ అసోసియేషన్ ప్రెసిడెంట్. ఇప్పుడు నార్సింగ్ మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు.. ఇతగాడు గతంలో డిటిసిపి జైంట్ డైరెక్టర్ గా, అంతకు ముందు బడంగ్ పేట్ మున్సిపల్ కమిషనర్ గా విధులు నిర్వహించాడు. ఈ కమిషనర్ ది ఒక ప్రత్యేకమైన స్టైల్ ఈయన ఎక్కడ విధులు నిర్వహించినా అక్కడున్న స్థానిక నాయకులను, ఎమ్మెల్యేలను, మంత్రులను గుప్పెట్లో పెట్టుకొని.. టీఎన్జీవో ఉద్యోగ సంఘాన్ని అడ్డం పెట్టుకొని అవినీతికి పాల్పడుతాడు.. దీనికి ఎన్నెన్నో ఆధారాలున్నాయి.. బడంగ్ పేట్ మున్సిపాలిటీలో కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న సమయంలో విచ్చలవిడిగా అవినీతి కార్యకలాపాలు నిర్వహించాడు.. అప్పట్లో ఏసీబీ అధికారులు పాగా వేసి అప్పుడున్న టిపిఓ అశోక్ ని పట్టుకొని విధుల నుంచి తొలగించి రిమాండ్ కు తరలించారు.. గతంలో ఏసీబీకి పట్టుబడిన టిపిఓ అశోక్ బుల్లెట్ బండి రాజా ఇప్పుడు రోడ్లు పట్టుకొని తిరుగుతున్నాడు.. ఇదే విధంగా కృష్ణమోహన్ రెడ్డి అండర్ లో పనిచేస్తున్న మణిహారిక ఏసీబీకి పట్టు పడడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. ఒక టిపిఓ ఓపెన్ గా అవినీతికి పాల్పడుతుంది అంటే ఎంతో కొంత కమిషనర్ హస్తం ఉన్నట్లే అని వ్యక్తం అవుతుంది. ఈ విషయంపై ఏసీబీ అధికారులు దృష్టి సారించి అవినీతికి పాల్పడ్డ అధికారిణికి వెనుక ముందు ఎవరున్నారు..? అన్నది పూర్తిగా దర్యాప్తు చేసి, అవినీతిపరులైన అధికారులను శిక్షించాలని ప్రజా సంఘాలు, సామాజిక ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నారు.. వీరి అవినీతిపై పూర్తి ఆధారాలతో మరో కథనంతో మీముందుకు..

# యువతకు సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి: కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబరు 09 (భారత శక్తి) : గ్రూప్1 మెయిన్స్ పరీక్షల కేసులో తెలంగాణ హైకోర్టు తీర్పు.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠమని మాజీ మంత్రి కేటీఆర్ (KTR)అన్నారు. నిరుద్యోగ యువతకు న్యాయం లభించిందని సంతోషం వ్యక్తం చేస్తూ ప్రకటన విడుదల చేశారు. గ్రూప్1 పరీక్షల్లో అక్రమాలు జరిగాయని నిరుద్యోగులు సాక్ష్యాధారాలతో సహా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ, టీజీపీఎస్సీ మొండిగా వ్యవహరించిందని ఆక్షేపించారు. నిరుద్యోగులు లేవనెత్తిన అంశాలను పట్టించుకోకుండా వారిపై కేసులు పెట్టి, లాఠీచార్జ్‌కి గురిచేసిన కాంగ్రెస్ ప్రభుత్వం హైకోర్టు తీర్పునకు ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. ఉన్నత న్యాయస్థానం తీర్పుతో నిరుద్యోగులకు న్యాయం జరిగిందని.. ఇది ముమ్మాటికి గ్రూప్ 1 బాధితుల అలుపెరగని పోరాటానికి దక్కిన విజయమని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల కేటాయింపు, హాల్ టికెట్ల జారీ, ఫలితాల్లోని అక్రమాల ఆరోపణల నేపథ్యంలో హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పు ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతుందని కేటీఆర్ అన్నారు. పరీక్షల నిర్వహణలో జరిగిన తప్పులకు బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువతకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనవసర పట్టుదలకు పోకుండా హైకోర్టు లేవనెత్తిన అనేక లోపాలను దృష్టిలో ఉంచుకొని తీర్పును వెంటనే అమలు చేసేందుకు ప్రయత్నం చేయాలని కోరారు. మళ్లీ అప్పీళ్లు, కోర్టు కేసులు అంటూ యువతకు అన్యాయం చేయవద్దని కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

# గచ్చిబౌలిలో 600 గజాల స్థలాన్ని కాపాడిన హైడ్రా

హైదరాబాద్, సెప్టెంబరు 09 (భారత శక్తి) : రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలిలో 600 గజాల స్థలాన్ని హైడ్రా కాపాడింది. దీని విలువ దాదాపు రూ. 11 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. తెలంగాణ సెక్రటేరియట్ మ్యూచ్యువల్ ఎయిడెడ్ కోపరేటివ్ సొసైటీకి చెందిన 24 ఎకరాల లే ఔట్‌లో రెండు పార్కులను హైడ్రా మంగళవారం కాపాడి.. చుట్టూ ఫెన్సింగ్ వేసింది. హెచ్ ఎండీఏ అనుమతి పొందిన ఈ లే ఔట్‌లో పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను సొసైటీ నిర్వాహకులు అమ్మినట్టు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో







హైడ్రా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. పార్కుల స్థలాలుగా నిర్ధారించుకున్న తర్వాత ఆక్రమణలను తొలగించి చుట్టూ ఫెన్సింగ్ వేసింది. ఈ మేరకు హైడ్రా పరిరక్షించిన పార్కు స్థలంగా పేర్కొంటూ హెచ్చరికల బోర్డులు కూడా పెట్టింది. ఇల్లీగల్‌గా అమ్మకాలు, కొనుగోళ్లు జరిగిన తీరుపై పూర్తి స్థాయిలో విచారిస్తోంది. ఎవరు అమ్మారు.. ఎలా అమ్మారు.. ఎలా కొన్నారు అనే విషయాలతో పాటు.. వీటి వెనుక ఎవరెవరు ఉన్నారనేదానిపై పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామని హైడ్రా ప్రకటించింది. ఇలా ఇంకా ఎన్ని స్థలాలు అమ్మారు అనేది పరిశీలించి అక్రమ లావాదేవీలు నిర్వహించిన వారిపై కేసులు కూడా పెడుతున్నట్టు హైడ్రా ప్రకటించింది.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.